
01-09Pg1exHMNWJQE VJA_01-09Pg1exHMNWJQE.qxd 9/1/2025 12:07 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 211 పేజీలు: 12 వెల: 6.50

భారత్ క్వాడ్ సదస్సుకు ట్రంప్ డుమ్మా!
భారత్‌పై ఆంక్షలు విధించండి: అమెరికా 9

# ఇక 'గ్రీన్ హైడ్రోజన్' విప్లవం



2030 నాటికి ఏపిని గ్రీన్‌హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తాం

కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి రూ.160కి తగ్గేలా ప్రణాళిక

విశాఖ, కృష్ణపట్నం, కాకినాడ, తిరుపతిలో రూ. 2.50 లక్షల కోట్ల ప్రాజెక్టులు

రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో గ్రీన్ హైడ్రోజన్ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ మార్గదర్శిగా నిలుస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రత్యామ్నాయం ఇంధన రంగంలో ఏపీ ముందుకు దూసుకుని వెళ్ళడంతో పాటుగా అద్భుత ఫలితాలను సాధిస్తుందని తెలిపారు.సీఎం చంద్రబాబు తెలిపిన వివరాలను అనుసరించి తీర ప్రాంతంలో డీసాలినేషన్ టెక్నాలజీతో సముద్ర జలాన్ని తాగునీటిగా మార్చితే పెద్దఎత్తున హైడ్రోజన్ ఉత్పత్తి చేయవచ్చు. సమీపంలోని పోర్టుల ద్వారా దాన్ని విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. రాష్ట్రంలోని పోర్టులు, తీర ప్రాంతం, నీటి వనరులు, పునరుత్పాదక శక్తి ఇలా ఎన్నో అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా నిలబెట్టనున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారన్నారు. ఇప్పటికే పునాది పడిన ఈ ప్రాజెక్టులు విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్లో ముందంజలో ఉండటమే కాకుండా, అంతర్జాతీయ ఎగుమతి కేంద్రంగా కూడా ఎదుగుతుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు కార్యాలయం నుంచి ఒక సమాచార పత్రం విడుదలయింది.ముఖ్యంగా ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలకు ఇది శాశ్వత ప్రత్యామ్నాయం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ ప్రయాణం కేవలం ఎనర్జీరంగాన్ని మాత్రమే కాకుండా రాష్ట్రఆర్థిక భవిష్యత్తును మలుపుతిప్పేశక్తిగా మారబోతోంది హైడ్రోజన్ ఉత్పత్తి సులభమే అయినా,ఎలెక్ట్రోలైజర్ల ఖర్చు ఎక్కువ. వీటిలో ప్లాటినం, టైటానియం వంటి అరుదైన లోహాలు ఉపయోగించడం వల్ల కిలోకు రూ.400 వరకూ అవుతోంది. ప్రభుత్వాలు దీన్ని రూ.150-200కి తగ్గించాలన్న లక్ష్యంతో పెద్దఎత్తున పెట్టుబడులను >>2

# పోటీదారులం కాదు భాగస్వాములం



తియాంజిన్‌లో జిన్‌పింగ్‌తో ప్రధాని మోడీ

ద్వైపాక్షిక భేటీ తర్వాత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

తియాంజిన్‌లో ఉభయనేతల శిఖరాగ్ర భేటీ

సరిహద్దుల్లో శాంతియుత వాతావరణంపై సంతృప్తి

బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్‌ను ఆహ్వానించిన ప్రధాని మోడీ

**బీజింగ్, ఆగస్టు 31:** భారత్, చైనాలు పరస్పరం పోటీదారులు కావని, అభివృద్ధిలో భాగస్వాములని ప్రధానిమోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు పునరుద్ఘాటించారు.నేతలు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోదీ, జిన్‌పింగ్ >>2

# తాడిపత్రిలో రణరంగం



ఆదివారం తాడిపత్రిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ దృశ్యం

వినాయక నిమజ్జనంలో టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

పరస్పరం దాడులు, పోలీసు జోక్యంతో సద్దుమణిగిన రగడ



అల్లరిమూకలను చెదరగొడుతున్న పోలీసులు

**తాడిపత్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల అనుచరుల పరస్పర దాడులతో తాడిపత్రిలో వినాయక నిమజ్జనం ఆదివారం వివాదాస్పదంగా మారింది. అరుపులు కేకలు, కర్రలు, రాళ్లతో ఒక్కసారిగా తాడిపత్రి పట్టణంలోని ప్రధాన రహదారి రణరంగాన్ని తలపించింది. తెదేపా నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్‌ల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా నిమజ్జనం సందర్భంగా అగ్గిరాజుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో ఇద్దరు నాయకుల మధ్య రేకెత్తిన మాటల యుద్ధం కాస్తా రాళ్ల దాడిగా మారింది. తాడిపత్రి పట్టణ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించ తలపెట్టిన వినాయక నిమజ్జనం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాలనేది జేసీ ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలోని నిర్వాహకుల ఆలోచన. ఆ ఆలోచన ప్రకారమే అన్ని విగ్రహాలు శోభాయాత్రలో పాల్గొంటూ ముందుకు సాగాయి. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాకర్ల రంగనాథ్ ఆధ్వర్యంలో వస్తున్న వినాయక విగ్రహ తరలింపు వాహనానికి ఎదురెళ్లిన జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్ని వాహనాలతో పాటు రావాల్సిందని, త్వరగా కదలాలని రంగనాథ్‌కు సూచించడం, అది చెప్పడానికి మీరెవరంటూ రంగనాథ్ వాదించడంతో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. జై జేసీ అంటే...జై కాకర్ల అంటూ ఇరు వర్గాల అనుచరులు చేసిన అరుపులు, కేకలతో ఒక్కసారిగా పరిస్థితి చేయిదాటి పోయింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇద్దరు నాయకులకు సర్దిచెప్పడంతో తాత్కాలికంగా గొడవ సద్దుమణిగింది. కాకర్ల రంగనాథ్ వాహనం రామచంద్ర లాడ్జి వద్దకు రాగానే ఎదురుగా జేసీ అనుచరులు పెద్ద ఎత్తున తరలివచ్చి మరోసారి ఘర్షణకు దిగారు. జేసీ వర్గీయులు రాళ్లదాడికి దిగడంతో మరోసారి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. రామచంద్ర లాడ్జి వద్ద పరిస్థితి రణరంగాన్ని తలపించడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పి, ఇరువర్గాల అనుచరులను చెదరగొట్టి ఘర్షణ వాతావారణాన్ని అదుపులోకి తీసుకొని వచ్చారు. కాకర్ల రంగనాథ్ వాహనాలు దెబ్బతినడం, పోలీసులే >>2



# 18 నుంచి అసెంబ్లీ

14, 15న తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ల సమావేశం

**విజయవాడ, ఆగస్టు31, ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబరు 18 నుంచి ప్రారంభం కానున్నాయని ఏపీ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆ మేరకు స్పీకరు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అసెంబ్లీ సమావేశాల్లో విశేష చర్చ జరిగే అవకాశముంది. రాష్ట్రంలోని ముఖ్యమైన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా అసెంబ్లీలో ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా చర్చించే యోచన >>2

# సమృద్ధిగా జలవిద్యుత్

ఈ నెలలో గరిష్ట ఉత్పత్తికి అవకాశం

నేటి నుండి ఇపిఎంఎస్ పైలట్ ప్రాజెక్టు

విద్యుత్ సరఫరా మెరుగుదలకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు: సిఎస్ విజయానంద్



**విజయవాడ, ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సెప్టెంబర్ నెలలో విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలం కారణంగా లభిస్తున్న జల విద్యుత్ ఉత్పత్తిని గరిష్టంగా వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ విద్యుత్ సంస్థలకు ఆదేశించారు. ఆదివారం సీఎస్ క్యాంప్ కార్యాలయం నుండి ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చెకూరి, ఏపిట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎ.కె.వి. భాస్కర్, జె.వి. రావు, ఎన్.వి. రమణమూర్తి, ఏపీజెన్‌కో డైరెక్టర్లు ఎం. సుజయ్ కుమార్, పి.అశోక్ కుమార్ రెడ్డి, సిఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులతో సిఎస్ వర్చువల్‌గా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతానికి రోజుకు సుమారు 22 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతున్న జలవిద్యుత్ ఉత్పత్తిని పూర్తి స్థాయిలో వినియోగిస్తే రోజువారీగా 26 మిలియన్ యూనిట్లు వరకు చేరుకోవచ్చన్నారు. దీని వలన మార్కెట్ కొనుగోళ్లపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు, నాణ్యమైన విద్యుత్ అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమ, గృహాలకు రాబోయే పండుగల సీజన్‌లో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తూ జలవిద్యుత్ ఉత్పత్తిని గరిష్టంగా పెంచాలన్నారు. బ్యాంకింగ్ ద్వారా నిల్వ ఉంచిన విద్యుత్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంకోసం విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సరఫరా ను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా అందించేందుకు వ్యవసాయ, సాగునీటి విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ రంగంలో సామర్థ్యం పెంచాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్లు ఎల్లప్పుడూ సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు మరమత్తులు, అవసరమైన పరికరాలను ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు.
ఎనర్జీ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈపీఎంఎస్) యాప్ అనే దేశీయంగా అభివృద్ధి చేయబడిన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రయోగాత్మకంగా శ్రీకారం చుడుతున్నామన్నారు.తద్వారా తక్కువ ధరలతో విద్యుత్ కొనుగోళ్ల వ్యయాన్ని తగ్గించవచ్చని, విజయవంతమైతే ఈ యాప్ ను విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సరఫరా స్థితిని >>2

# ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు



**విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఈ విద్యాసంవత్సరంలో ఫిబ్రవరిలోనే నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మార్చి నెలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతుండగా, ఈసారి సీబీఎస్ఈతో పాటు ఫిబ్రవరిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఏప్రిల్‌లో తరగతులను నిర్వహించేందుకు ముందుగానే పరీక్షలన్నీ పూర్తవుతాయి. అందుకు అనుగుణంగానే పరీక్షల విధానంలోనూ పలు మార్పులు జరిగాయి. మొదట సైన్స్ విద్యార్థులకు గ్రూపు సబ్జెక్టులతో పరీక్షలు ప్రారంభమవుతాయి. రోజుకు ఒక్క సబ్జెక్టు పరీక్షే ఉంటుంది. గతంలో ఎంపీసీ అభ్యర్థులకు ఏదైనా సబ్జెక్టు పరీక్ష ఉన్నప్పుడు అదేరోజు బైపీసీ, ఆర్ట్సు గ్రూపుల వారికి ఇతర సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించేవారు ఇప్పుడు ఎంపీసీ అభ్యర్థులకు గణితం పరీక్ష ఉంటే ఆ రోజు ఆ సబ్జెక్టు ఒక్కటే ఉంటుంది. ఎంబైపీసీ గ్రూపును తీసుకురావడంతో ఎంపీసీ విద్యార్థులూ జీవశాస్త్రం చదివే >>2



# మంత్రి లోకేష్‌కు మరో అరుదైన గౌరవం

ఆస్ట్రేలియా ప్రభుత్వ స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని ప్రత్యేక ఆహ్వానం

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు శ్రీకారం చుట్టిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు మరోఅరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్‌ప్రోగ్రామ్‌లో పాల్గొ నాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం..ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం >>2



# రాష్ట్రంలో మరో అల్పపీడనం

తగ్గుతున్న కృష్ణ, గోదావరి ఉధృతి

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతంలో సెప్టెంబరు 2 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలకు సమీపంలో వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి సగటున 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. ఈ ఆవర్తనం ప్రభావంతోనే అల్పపీడనం ఏర్పడనుందని, దీని ఫలితంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో మోస్తరు >>2

# గణపతి నిమజ్జన వేళ అపశ్రుతి

ట్రాక్టర్ ఢీకొని నలుగురి మృతి

**నరసాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా సినీ పాటలకు నృత్యాలు చేస్తున్న ఆ నలుగురికి మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి కబళిస్తుందని తెలియదు. ఒక్కసారిగా మీద పడ్డ ట్రాక్టర్ కింద నాలుగు నిండు ప్రాణాలు నుజ్జాయిపోయాయి. మరో ఇద్దరు గాయపడటంతో వారిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తీసుకువెళ్లారు. ఆదివారం రాత్రి 8 9 గంటల మధ్య సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మరో 10 నిమిషాల్లో వినాయకుని నిమజ్జనం చేస్తామనగా ఈ ఘటన జరగడంతో గ్రామం ఉలిక్కిపడింది. తూర్పు తాళ్ళు సెంటర్లో ఎంతో ఉల్లాసంగా సాగుతున్న ఊరేగింపులో ట్రాక్టర్ దూసుకు రావడంతో గురుజి మురళి తిరుమల సూర్యనారాయణ ఇవన నరసింహస్వామి కడియం దినేష్ అనే విద్యార్థి అక్కడికక్కడే చనిపోయారు. >>2

ప్రపంచ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ బాలికకు ఏడు బంగారు పతకాలు 2



# మైసూరు తరహాలో 'విజయవాడ ఉత్సవ్'

కొత్త హంగులతో దసరా వేడుకలకు రంగం సిద్ధం



11 రోజులపాటు వివిధ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు

అంగరంగవైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**విజయవాడ, ఆగస్టు31, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో దసరా వేడుకలను మైసూర్ తరహాలో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో హెలీకాప్టర్ రైడ్, గ్యాస్ ఎయిర్ బెలూన్స్, ఎగ్జిబిషన్, జలక్రీడలు, సినీ, సాంస్కృతిక ప్రదర్శనలు 11 రోజుల పాటు రోజూ ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అందుబాటులోకి తీసుకుని రానున్నారు. తొలిసారిగా ఈ ఏడాది దసరా సంబరాలు విజయవాడ ఉత్సవ్ పేరుతో జరుగుతాయి. విజయవాడకు వచ్చే ప్రతి ఒక్కరూ కనీసం రెండు రోజులుండి, ఈ ఉత్సవాలను తిలకించి వెళ్లేలా వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. నగరంలోని నదీ పరివాహకం సహా అన్ని ప్రాంతాల్లోనూ సినీ, సాంస్కృతిక కళా ప్రదర్శనలు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, జల క్రీడలు, హెలీకాప్టర్‌రైడ్, దుకాణ సముదాయాల స్టాళ్లు, మిరుమిట్లు గొలిపే డ్రోన్ల ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. దసరా అనగానే విజయవాడకు కచ్చితంగా వెళ్లాలనేలా వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ చూడనంత గొప్ప విద్యుత్తు >>2

01-09pg2exHMNWJQE 2ND_01-09pg2exHMNWJQE.qxd 9/1/2025 12:02 AM Page 1





చైనాలోని టియాంజిన్‌లో నేపాల్ ప్రధాని కెపి ఒలితో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ

## నేటి నుంచి పులివెందులలో జగన్ పర్యటన

**జయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో పర్యటించనున్నారు. 2వ తేదీన వైఎస్ఆర్ వర్థంతి కార్యక్రమంలో జగన్ పాల్గొంటారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు భాకరాపేటలోని క్యాంప్ కార్యాలయానికి వైఎస్ జగన్ చేరుకుంటారు. మంగళవారం ఉదయం 7.15 గంటలకు ఇడుపులపాయకు చేరుకుని వైఎస్ఆర్ ఘాట్ వద్ద తన తండ్రికి జగన్ నివాళులర్పించనున్నారు.

## 5 లోగా 'ఆడుదాం ఆంధ్ర' అవినీతిపై చర్యలు

### -శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర'లో అవినీతికి పాల్పడిన వారిపై సెప్టెంబరు 5 లోపు చర్యలుంటాయని శాప్ ఛైర్మన్ రవినాయుడు వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందినట్లు పేర్కొన్నారు. దోషులు ఎవరైన సరే ప్రభుత్వం ఉపేక్షించదని, లింగ భేధం లేకుండా చర్యలుంటాయని స్పష్టం చేశారు. విజయవాడ లోని శాప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఒక ఆటకు రెండు,మూడు సంఘాలు ఉండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. శాప్ నియమావళి మేరకు నెల రోజుల్లోగా ఒక క్రీడకు సంఘంగా ఏర్పడి ముందుకు రావాలి. డీఎస్సీకి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున జాబితాను తయారు చేసి విద్యాశాఖకు సమర్పించాం. తుది జాబితాను త్వరలో ప్రకటిస్తారు. దీనిపైనా అభ్యంతరాలు స్వీకరించే అవకాశం ఉంది. వీటికి ధరఖాస్తు చేసిన వారిలో 870 మంది నకిలీ ధృవపత్రాలు పెట్టినట్టు గుర్తించాం'అని పేర్కొన్నారు శాప్ పాలకమండలి సభ్యుడు ఎస్.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో రణరంగం

>> రంగనాథ్ వాహనాన్ని నిమజ్జనం వరకు తరలించడం జరిగింది. అనంతరం పోలీసులు ఇరు వర్గాలకు చెందిన నాయకులను వారి ఇళ్లవద్దకు సాగనంపి పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు. ప్రశాంతంగా..ఉత్సాహంగా జరగాల్సిన నిమజ్జన సమయంలో ప్రధాన రహదారిపై రాళ్లదాడి చోటు చేసుకోవడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. కాకర్ల రంగనాథ్ వర్గానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. అధికార తెదేపాకు చెందిన ఇద్దరు బలమైన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం, పరస్పరం రాళ్లు రువ్వుకోవడం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇకపై చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సంఘటనల నేపథ్యంలో కాకర్ల రంగనాథ్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై అధిష్టానం నుంచి తమకు ఫోన్ వచ్చినట్లు, సమాచారమంతా చేరవేసినట్లు కాకర్ల రంగనాథ్ విలేకరులతో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మరో అల్పపీడనం

>> నుంచి భారీవర్షాలు పడతాయని, తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల వారు మరింత జాగ్రత్తగా ఉండాలనిహెచ్చరికలు జారీ చేసింది. ఇక విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది.ఎన్టీఆర్,కృష్ణా,గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ సాధారణ నుంచి మోస్తరు వర్షాలు కురిసాయి.ధవలేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి వరద ఉధృతి స్థిరంగా ఉంది.ఉమ్మడి గోదావరి జిల్లాలోను వర్షాలు పడ్డాయి.ఉత్తరాంధ్ర,రాయలసీమ ప్రాంతాల్లోవానలు పడ్డాయని సమాచారం.ఈ వర్షాలుమరోనాలుగురోజులు ఉంటాయని అంచనా వేస్తున్నారు.ఇంచుమించు ఆగస్టు నెలంతా కురిసిన వరుస వానలు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు భారీగా పంట నష్టం సంభవించింది.

## ప్రపంచ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ బాలికకు 7 బంగారు పతకాలు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్ట్రేలియాలోని మోంట్ వారెన్,క్వీన్స్‌ల్యాండ్ లో ఆగస్టు 28వ తేదీన నుండి 31వ తేదీ వరకు జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో విజయవాడకు చెందిన భారతీయ స్కేటింగ్ క్రీడాకారిణి కుమారి పి.చైత్ర దీపిక అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ స్కేటింగ్లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్ (వరల్డ్ స్కేట్ ఓషేనియా) పోటీల్లో భారత జట్టు కు పలు విభాగాలులో ప్రాతినిత్యం వహించి, పెయిర్ స్కేటింగ్ విభాగం లో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగం లో బంగారు పతకం, కపుల్ డాన్స్ విభాగం లో బంగారు పతకాలు, మరియు వి.హృతిక్స్ విభాగం లో బంగారు పతకం, పెయిర్ స్కేటింగ్ విభాగం లో బంగారు పతకం, ద్విఖ్య డాన్స్ విభాగం లో బంగారు పతకాలు మరియు సోలో డాన్స్ లో సిల్వర్ పతకం సాధించి దేశానికి ఏంతో పేరు తీసుకొచ్చారు. ఏడు పతకాలు సాధించి భారతదేశానికి గర్వకారణంగా నిలిచారు. దీపక్ ఎల్లాప్రగడ తాయ్ ప్రెసిడెంట్,ఆస్ట్రేలియా తెలుగు సంఘం చైత్ర క్రీడా ప్రయాణంలో తమ మద్దతును అందించగలిగినందుకు గర్వంగా భావించింది. ఆమె సాధించిన అద్భుత విజయాన్ని హర్షభరితంగా అభినందించింది.ఆమెకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు దుర్గేష్ కందుల,రాంప్రసాద్‌రెడ్డి మండిపల్లి, వంగలపూడి అనిత,శాప్ ఛైర్మన్ రవినాయుడు, మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ శైలజా రాయపాటి అభినందనలు తెలిపారు.




వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ అమ్మాయి చైత్ర దీపిక

## 18 నుంచి అసెంబ్లీ

>> ఉన్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం పూర్తయిన సందర్భంగా.. పాలనపై సమగ్రంగా చర్చ జరగనుంది. 14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ సమావేశం జరగనుందని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శాసన సభ్యులు సహా సుమారు 300 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇతర విషయాలపైనా మాట్లాడారు. మహిళా పార్లమెంటేరియన్ సమావేశాన్ని 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. 15న ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు. ఇక 10 రోజులపాటు ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 4న జరిగే కేబినెట్ భేటీలో అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ విషయాన్నీ గత నెలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

## సమృద్ధిగా జలవిద్యుత్

>> ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారని వినియోగదారులకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఏపీఎస్ఎల్డీసి డిమాండ్ అంచనా ప్రకారం సెప్టెంబర్ మొదటి వారంలో రోజువారీ విద్యుత్ అవసరం 210 నుండి 225 మిలియన్ యూనిట్ల వరకు, పీక్ డిమాండ్ సుమారు 10,200 నుండి 10,500 మెగావాట్ల వరకు ఉండనుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ అవసరాలను తీర్చడానికి ఏపీజెన్‌కోకు చెందిన జలవిద్యుత్ , థర్మల్ విద్యుత్ కేంద్రాలు రోజుకు 100 మిలియన్ యూనిట్లకు పైగా, కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు 3540 మిలియన్ యూనిట్ల వరకు, పునరుత్పాదక వనరులు వాతావరణ పరిస్థితులను బట్టి 2530 మిలియన్ యూనిట్ల వరకు ఉత్పత్తి చేస్తాయని ఆయన వివరించారు. దీనికి అదనంగా, ఆగస్టు నెలలో నిల్వ (బ్యాంకు) చేసిన 326 మిలియన్ యూనిట్ల నిల్వను అవసరాల కోసం వినియోగించుకోవచ్చని, మార్కెట్ నుండి విద్యుత్ కొనుగోళ్ల అవసరమైనంత మేరకు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు ముగిసే నాటికి జలవిద్యుత్ ఉత్పత్తి 2000 మిలియన్ యూనిట్లు దాటిందన్నారు. ఇది గత దశాబ్ద కాలానికి పైగా ఉత్పత్తి చేసిన అత్యధిక స్థాయి రికార్డుగా నమోదైందని ఏ పీ జెన్కో అధికారులు ఈ సందర్భంగా సిఎస్ కు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

01-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి రా.2.41
జ్యేష్ఠ రా.7.51
వర్జ్యం : ఉ.9.05-10.48
దు.ము.12.33-మ.1.23,
2) 3.03-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంతాలలో ఉన్న మీ వారికి సహాయసహకారాలు అందిస్తారు. వస్తులాభం

**వృషభం:** శ్రమకు తగిన ఫలితాలు ఎక్కువగా చేతికి అందుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

**కర్కాటకం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనా ధోరణిలో ఏర్పడుతుంది. వాహనయోగం.

**సింహం:** ఎదుటి వారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు.

**కన్య :** జీవిత భాగస్వామితో రాజీ ధోరణి అవలంభించడం మేలు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**తుల :** ఆర్థిక విషయ వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాహ యత్నాలు.

**ధనుస్సు:** సన్నిహితాల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**మకరం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి.

**కుంభం:** మిత్రులు నుండి శుభవార్తలు అందుకుంటారు. ఇంటర్వ్యూలు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**మీనం :** ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పోటీదారులం కాదు భాగస్వాములం

>> ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఇరువురునేతల వ్యాఖ్యలు కనిపించాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత ఏడాది సరిహద్దుల నుంచి ఇరు దేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదని అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీజిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగా ఉందని కై కీ తెలిపారు. ఎస్‌సీవో సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోదీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.



ఆదివారం పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

# 'విజయవాడ ఉత్సవ్'

>> దీపాలంకరణలతో నగరాన్ని ధగధగలాడించనున్నారు. దసరా ఉత్సవాల కోసం విజయవాడకు ఏటా 11 రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశవిదేశాల నుంచి 12-15 లక్షల మంది వస్తుంటారు. వీరు కనకదుర్గమ్మను దర్శించుకొని వెళ్లడం తప్ప మరే ఆకర్షణ లేదు. అందుకే ఈ ఏడాది నుంచి దసరా ఉత్సవాలతో మిళితం చేస్తూ విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిం చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలు కార్నివాల్ తరహాలో జరుగుతాయి. పున్నమిఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, గొల్ల పూడిలో ఎగ్జిబిషన్ మైదానాల్లో అంతర్జాతీయ స్థాయిలో కార్నివాల్ తరహాలో వేడుకల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే వినూత్న రీతిలో దుకాణ సముదాయాల స్టాళ్లు, జలక్రీడలు, దాండియా నృత్యాలు, ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్స్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు, పిల్లలకు ప్రత్యేకంగా క్రీడాజోన్లు పెడతారు.రోజూ ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ గొల్లపూడిలో 39 ఎకరాల్లో ఎగ్జిబిషన్ మైదానం పెట్టి వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేశారు. 11 రోజులు ఒక్కో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఓజీ ప్రీరిలీజ్ ఈవెంట్‌తో కార్యక్రమాలు ఆరంభం కాబోతున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకూ సినీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ దసరాలకు హెలీకాప్టర్ రైడ్, గ్యాస్ ఎయిర్ బెలూన్స్‌లో నింగిలోకి వెళ్లే అనుభూతిని కూడా విజయవాడ వాసులు, పర్యాటకులు పొందొచ్చు. ఇవేకాక నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ పిల్లలు ఆడుకునేలా క్రీడాపరికరాలు పెట్టనున్నారు. దసరా వస్తోందంటే చాలూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిస్తోంది. శరన్నవరాత్రుల్లో అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెలుగు ప్రజలంతా "అమ్మలగన్న అమ్మ మము కన్నతల్లి మాతల్లి దుర్గమ్మ" అని నోరారా విజయవాడ కనకదుర్గమ్మను పిలుచుకుంటారు. ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనక దుర్గాదేవికి ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

ఇప్పటికే విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఈసారి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా వేడుకలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖలతో కలిసి సమన్వయంతో పని చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గా దేవి మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది.

## మంత్రి లోకేష్‌కు మరో అరుదైన గౌరవం

>> కావాలని మంత్రి లోకేష్‌ను కోరింది. గత 20 ఏళ్లలో భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని, 2001లో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకూడా SVPలో భాగస్వాములయ్యారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

## ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు

>> అవకాశం వచ్చింది. అందువల్ల ఒకేరోజు 2 పరీక్షలు రాయడం సాధ్యం కాదు కాబట్టి ఒక రోజు ఒకే పరీక్ష పెట్టనున్నారు. సైన్స్ గ్రూపు సబ్జెక్టులన్నీ పూర్తయ్యాక చివరిలో భాషల పరీక్షలు ఉంటాయి. అనంతరం ఆర్ట్స్ గ్రూపు పరీక్షలు ప్రారంభమవుతాయి. ప్రాక్టికల్ పరీక్షలను జనవరి చివరిలో నిర్వహించాలా? లేదంటే రాతపరీక్షలు పూర్తయ్యాక నిర్వహించాలా? అనేదానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రధానంగా అనేక రకాలైన సంస్కరణలను తీసుకొని రావడం గమనార్హం. పూర్తిగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను అమలు చేశారు. అదే విధంగా ఎంబైపీసీ, జీవశాస్త్రంతో ఎంపీసీ చదువుకునే వెసులుబాటును సైతం కల్పించారు. ఆర్ట్స్ విద్యార్థులు సైతం కొందరు ఐచ్ఛికంగా సైన్స్ సబ్జెక్టులు ఎంచుకున్నారు. మరికొందరు కొందరు సైన్స్ గ్రూపు విద్యార్థులు రాజనీతిశాస్త్రం, చరిత్ర, ఆర్థికశాస్త్రం ఎంపిక చేసుకున్నారు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ దేనికైనా అర్హత సాధించేందుకు ఇలా సబ్జెక్టులను ఎంచుకున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రశ్నపత్రాల విధానాన్ని కూడా మార్చారు. భౌతిక శాస్త్రం, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులను 85 మార్కుల చొప్పున నిర్వహిస్తారు. మిగతా మార్కులు రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్‌కు ఉంటాయి. అన్ని పేపర్లలోనూ ఒక్క మార్కు ప్రశ్నలను కొత్తగా తీసుకొచ్చారు. ఇకపై జీవశాస్త్రంలో వృక్షశాస్త్రం 43 మార్కులకు, జంతుశాస్త్రం 42 మార్కులకు ఉండనుంది. పరీక్షా విధానంలో పలు సంస్కరణలను ఏపీ ప్రభుత్వం చేపట్టింది.అందులో భాగంగా ఇంటర్ పరీక్షలను సంస్కరణలను తీసుకుని వచ్చింది.దాంతో ఇంటర్ పరీక్షల్లో ఇకపై రోజుకు ఒక్క సబ్జెక్టుకే పరీక్షలు జరగనున్నాయి. మొదట సైన్స్ గ్రూపులకు, ఆ తర్వాత ఆర్ట్స్ గ్రూపులకు పరీక్షలు నిర్వహించేలా ఇంటర్ విద్యామండలి మార్పులు చేసింది.

## గణపతి నిమజ్జన వేళ అపశ్రుతి

>> బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పరామర్శించారు. డీఎస్పీ శ్రీ వేద ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనలతో తీరప్రాంత గ్రామమైన తూర్పు తాళ్ళు తీవ్ర విషాదంలో నిండిపోయింది.

**కలెక్టర్ చదలవాడ నాగరాణి దిగ్భ్రాంతి**

ప్రమాద సంఘటనపై కలెక్టర్ నాగరాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు కలెక్టర్ హుటాహుటిని భీమవరంనుండి బయలుదేరారు. ట్రాక్టర్ డ్రైవర్ మంచినీళ్ల తాగేందుకుదిగడంతో ఓపిల్లవాడు ట్రాక్టర్‌స్టార్ట్ చేయగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకునే అవసరమైన చర్యలకు ఆదేశాలు ఇచ్చారు.

# 'గ్రీన్ హైడ్రోజన్' విప్లవం

>> ప్రోత్సహిస్తున్నాయి. అదే విధంగా హైడ్రోజన్ నిల్వ చేయడం, రవాణా చేయడం చాలా కష్టం. అత్యంత భద్రతా ప్రమాణాలు అవసర ఉంది.సుమారు 974 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతం, కీలకమైన కృష్ణపట్నం, కాకినాడ వంటి పోర్టులు, అలాగే గోదావరి, కృష్ణా వంటి నదుల జల వనరులు ఆంధ్రప్రదేశ్ సొంతం. ఇవే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ ఎదగడానికి అనుకూలతలుగా మారుతున్నాయి. ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వివిధ ప్రాజెక్టుల రూపంలో విశాఖపట్నం, కృష్ణపట్నం, కాకినాడ, తిరుపతిలోకి వచ్చాయి. ఇవి పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే మార్చేస్తాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.నీరు (బీ వీ)లోని హైడ్రోజన్, ఆక్సిజన్ మూలకాలను వేరు చేసి హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియకు సైతం పవన, సౌర విద్యుత్తును ఉపయోగిస్తారు. దీన్ని సౌర, పవన విద్యుత్ ద్వారా ఎలెక్ట్రోలైజర్లలో వేరు చేస్తే, కర్బన్ ఉద్గారాలు లేకుండా ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా హైడ్రోజన్, ఆక్సిజన్ వేరు చేస్తారు. ఇదే గ్రీన్ హైడ్రోజన్. దీనిని విద్యుత్, రవాణా, వ్యవసాయం, ఉక్కు, సిమెంట్ రంగాలలో ఉపయోగించవచ్చు. ఇవన్నీ భారీ కర్బన్ ఉద్గారాలను విడుదల చేసే రంగాలు కావడంతో, గ్రీన్ హైడ్రోజన్ మంచి ప్రత్యామ్నాయం కానుంది. మరోవైపు హైడ్రోజన్‌ని వేరుచేసినప్పుడు వాతావరణంలోకి ఆక్సిజన్ చేరడం వల్ల దాని శాతం పెరుగుతుంది. ఓజోన్ పొర వృద్ధి చెందడానికి, భూగోళం వేడెక్కకుండా కాపాడేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమరావతిలో ఏర్పాటు చేసే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు.. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు స్పష్టం చేసారు.భూ తాపం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ప్రపంచ దేశాలు హరిత ఇంధనం వైపు అడుగులు వేస్తున్నాయి. అందుకు తగినట్లే సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టు, ఉత్పత్తుల ఎగుమతులకు పోర్టులు, గ్రీన్ హైడ్రోజన్ తయారీకి అవసరమైన నీరు పుష్కలం వంటి అనుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది. అందుకే కేంద్రం నిర్దేశించుకున్న 500గిగావాట్లలో ఏపీలో 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేలా పాలసీని రూపొందించారు. వచ్చే ఐదేళ్లలో 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 7.5 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. విశాఖపట్నం జిల్లా పూడిమడకలో: ఎన్‌టీపీసీ (విగిశది) రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను నిర్మిస్తోంది. గత ఏడాదినవంబరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీని పునాది రాయి వేశారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద: యూకేకు చెందిన యామ్నా కంపెనీ సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి యూనిట్‌ను రూ.16,000 కోట్లు పెట్టుబడితో ఏర్పాటు చేస్తోంది. కాకినాడలో ఏఎం గ్రీన్ అమోనియా ఇండియా సంస్థసంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల అమోనియా యూనిట్‌తో పాటు 2 గిగావాట్ల ఎలెక్ట్రోలైజర్ ప్రాజెక్టును రూ.12,000 కోట్లు పెట్టుబడితో నిర్మిస్తోంది. పోలాండ్‌కి చెందిన హైఇన్ఫ్రా కంపెనీ రూ.35,000 కోట్ల పెట్టుబడితో 150 కిలో టన్నుల హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమోనియా యూనిట్‌ను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 10,000 మందికి ఉపాధి లభించనుంది.

**ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి భౌగోళిక అనుకూలతలు**

హైడ్రోజన్‌ను దేశీయ అవసరాలతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి చేయాలనే లక్ష్యంతో పునరుత్పాదక ఇంధన వనరుల్ని 500 గిగావాట్లకు పెంచేలా కేంద్రం ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అందులో 20 హైడ్రోజన్ ఏపీలో ఉత్పత్తి చేయాలని సంకల్పించినట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. దీనికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయడానికి అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్2025 నిర్వహించామన్నారు.. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సదస్సులోనే 51,000 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. దీంతో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి కీలక అడుగులు పడినట్లైందని నిపుణులు అభిప్రాయమని సీఎం తెలిపారు.గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ సంబంధించి అమరావతి డిక్లరేషన్ ను ఇప్పటికే విడుదల చేసామన్నారు. 2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు కార్యాచరణ ప్రకటించారు. గ్రీన్‌హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను నెలకొల్పాలని డిక్లరేషన్‌లో తెలిపారు. 2027 నాటికి 2 గిగావాట్లు, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నారు. కిలో హైడ్రోజన్ గ్యాస్‌రూ. 460 నుంచి రూ. 160 తగ్గించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయనున్నారు. అంతేగాక, గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా అమరావతిని తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయించారు. ఇందుకోసం గ్రీన్‌హైడ్రోజన్ దిశగా 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని డిక్లరేషన్‌లో ప్రకటించారు.గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కిలోకు 4 డాలర్ల వరకు ఖర్చవుతోంది. దీన్ని 1.5 డాలర్లకు తగ్గించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. 2030 నాటికి 5 మిలియన్ టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రం భావిస్తోంది. ఐతే, ఇంధన తయారీలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలు తగ్గించటం కీలకం. ఈ క్రమంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ తగ్గేఅవకాశం ఉందని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి భౌగోళిక అనుకూలతలు ఉన్నాయి. గాలి, నీరు, సౌరశక్తితో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సౌర, పవన,జల విద్యుత్‌ను పునరుత్పాదక ఇంధన వనరులు ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ తయారు చేస్తారు. విద్యుత్ విశ్లేషణ ప్రక్రియ ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టటం ఇందులో కీలకం. ఈ ప్రక్రియలో తయారైన హైడ్రోజన్‌ని గ్రీన్ హైడ్రోజన్‌గా పిలుస్తారు. ప్రపంచ వ్యాప్తంగా దీన్నే క్లీన్ హైడ్రోజన్‌గా అత్యంత శుద్ధమైందిగా అభివర్ణిస్తారు. శిలాజ ఇంధనాలకు గ్రీన్ హైడ్రోజన్‌ని ప్రత్యామ్నాయంగా నిపుణులు చెబుతున్నారు.దీనికి ఖర్చు ఎక్కువయ్యే అవకాశం ఉన్నప్పటికీ పరిశోధనలుజరిగి ఉత్పత్తి పెరిగితే వ్యయం తగ్గొచ్చని నిపుణులు వెల్లడించినట్లు సీఎం వివరించారు.



## రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ పదవీ కాలం యేడాది పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 31,ప్రభాతవార్త:** భారతీయ రైల్వే బోర్డు చైర్మన్, సిఈఓగా పనిచేస్తున్న సతీస్ కుమార్ పదవికాలాన్ని మరో ఏడాది కాలం పాటు పొడిగిస్తూ కేంద్ర నియామకాల క్యాబినేట్ కమిటీ కార్యదర్శి మనిషా సక్సేనా ఆదేశాల జారీ చేశారు. ఐఆర్ఎస్ఎంఇ క్యాడర్‌కు చెందిన సతీష్ కుమార్ 1986-88బ్యాచ్ అధికారి. 1988లో వారణాసి లోని డీజిల్ లోకోమోటివ్ వర్క్స్(డిఎల్‌డబ్ల్యు) లో ఎఎంఇగా తనసర్వీసు ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా తన ప్రతిభా సామర్థ్యాలను కనబరిచి 2022లో నార్త్ సెంట్రల్ రైల్వే అలహాబాద్ జోన్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆయన 2024సెప్టెంబరు 1 నుంచి రైల్వే బోర్డు చైర్మన్/సిఇఓగా నియమించింది. సతీష్ కుమార్ ఆగస్టు 31నపదవి విరమణ చేయాల్సి ఉండగా, ఆయన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం సతీష్ కుమార్‌ను రైల్వే బోర్డుచైర్మన్‌గా 1-9-2025నుంచి మరో ఏడాది పాటు రైల్వే బోర్డు చైర్మన్,సిఇఓగా కొనసాగించాలని నిర్ణ

### ఎదురుమొండి గొల్లమంద రోడ్డుకు

## త్వరలో శంకుస్థాపన: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** నాగాయలంక మండలం ఎదురుమొండి గొల్లమంద వయా బ్రహ్మయ్యగారి మూల రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరుగుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రహదారికి శంకుస్థాపన చేయడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంగీ కరించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ నిధులు రూ.13 కోట్ల 88 లక్షలతో నిర్మించ తలపెట్టిన ఈ రోడ్డు టెండర్ ప్రక్రియ ముగిసినట్లు తెలిపారు. త్వరలో శంకుస్థాపన తేదీ ఖరారు చేస్తారని పేర్కొన్నారు. ఎదురుమొండి గొల్లమంద వయా బ్రహ్మయ్య గారి మూల రోడ్డు కోతకు గురి కావడం, ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించారని బుద్ధప్రసాద్ తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో అధ్వాన్న స్థితిలో ఉన్న ప్రధాన రహదారుల గురించి, అటవీ శాఖ సమస్యల గురించి వారి దృష్టికి తీసుకెళ్ళినట్లు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి డిప్యూటీ



సీఎం పవన్ కళ్యాణ్ అధికారులకు తగిన ఆదేశాలిచ్చారని తెలిపారు.

## ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ: కలెక్టర్ లక్ష్మీశ



పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యునిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్ లో ఎన్టీఆర్‌కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యం, ఆహ్లాదం.. ఆపై పర్యావరణ పరిరక్షణకూ సైక్లింగ్ చేయూతనిస్తుందని, చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యునిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్ లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజ్ సర్కిల్, రామవరప్పాడు, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మునిసిపల్ ఆఫీస్, ప్రకాశం బ్యారేజ్, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ. మేర సాగింది. దాదాపు 80 మంది సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొని ఐక్యతా మార్గంలో క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సైక్లింగ్ ను హాబీగా మార్చుకొని ముందుకువెళ్లాలని, ఓ మంచి అలవాటు ఎన్నో విజయాలకు సోపానమవుతుందని పేర్కొన్నారు. అందుకే అవగాహన పెంచుకొని సైక్లింగ్ ను అభిరుచిగా మార్చుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. లండన్ ఎడిన్బర్గ్ లండన్ (ఎల్ ఈ ఎల్) సైక్లింగ్ ఈవెంట్ 2025లో పాల్గొన్న నిశికాంత్ ను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిశికాంత్ తదితరులతో పాటు సీవైసీవో, డెకథ్లాన్ సైక్లింగ్ క్లబ్స్ సభ్యులు, సిటీ రన్నర్స్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా పేరులో విజయవాడను చేర్చండి

### బిజెపి నేత లక్ష్మీపతి రాజా

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లా పేరును, 'ఎన్టీఆర్ విజయవాడ జిల్లా'గా, మచిలీపట్నం కేంద్రంగాఉన్న కృష్ణాజిల్లా పేరును 'పింగళి వెంకయ్య కృష్ణాజిల్లా'గా మార్చాలని భారతీయ జనతాపార్టీ నేత కేవీ లక్ష్మీపతి రాజా సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖను రాసారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లా పేరును 'శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జిల్లా'గా మార్పు చేయవలసిందిగా విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్లు మార్పు చేర్పుల అంశంలో నియమించిన మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి ప్రజా వినతులు స్వీకరించుటకు ఇచ్చిన అవకాశం ఆధారంగా తాను ఈ లేఖను రాస్తున్నట్లు లక్ష్మీపతిరాజా పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్య కూడలి నగరమైన విజయవాడ నగరానికి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, రాజకీయ రంగాలతో పాటుగా విద్యను అందించే విజయవాడ నగరంగా పేరు ఉన్న సంగతి గమనించాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల మార్పులు, జిల్లా పేర్ల మార్పులు, కొత్త జిల్లాల ఏర్పాటు, ఇతర అంశములు పరిగణలోకి తీసుకుని సరిహద్దులు మార్పు అంశాలు ప్రజల ఆశలకు అనుగుణంగా ఏర్పాటు చేయటానికి, ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు ఈ అంశం సమగ్రంగా పరిశీలించి తగు సానుకూల నిర్ణయం తీసుకుంటారని కోరుకుంటున్నాము.

## రూ. 2,746.52 కోట్ల భరోసా పెన్షన్ నిధులు విడుదల

### స్పౌజ్ పెన్షన్‌ల కోసం అదనంగా రూ.3.15 కోట్లు విడుదల: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం కింద సెప్టెంబర్ ఒకటవ తేదీన 63,61,380 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ. 2,746.52 కోట్లు గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ,, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా మంజూరైన 7,872 మంది స్పౌజ్ పెన్షన్ లబ్దిదారులకు సెప్టెంబర్ 1న పెన్షన్ పంపిణీ చేయడానికి రూ. 3.15 కోట్లు కూడా విడుదలచేశామని మంత్రి చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పింఛన్ల కోసం రూ. 32,143 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీకి రూ. 16,366.80 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ కోసం రూ. 10,000 కోట్లకు మించి కేటాయించడం లేదని తెలియజేశారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ అందించడం తోపాటు వారి జియోకోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్



పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు.

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ (విజయవాడ)లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 1 పోస్ట్, సైకో సోషల్ కౌన్సెలర్ 1 పోస్ట్ భర్తీ చేసేందుకు గత ఏడాది అక్టోబర్ 16ననోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని అయితే ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారిచేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. కాంట్రాక్టు/ఔట్సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరాల వయస్సు గలిగిన మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల గరిష్ట వయస్సు సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ గవ్నట్ ఇన్ నుండి దరఖాస్తులు డౌన్లోడ్ చేసుకొని.. పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్ళను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి.. ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 31429/ఏ, గద్దె పూర్ణచంద్రరావు వీధి, మారుతీనగర్ సెకండ్ లేన్, విజయవాడ కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా సమర్పించాలన్నారు.

## విజయవాడ ఠాగూర్ లైబ్రరీలో ధ్యాన శిక్షణ

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం ధ్యానం తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో ధ్యానంను భాగం చేసుకోవాలని, ధ్యానం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ప్రతీ రోజు కనీసం 5 నిమిషాలు చేయాలన్నారు. ఇకపై గ్రంథాలయంలో నిర్దిష్ట సమయాల్లో ధ్యాన్య శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంలోనే ఆర్అండ్‌బీ ఇంజినీర్లు ఎం.హరిబాబు, శశిరేఖ, ప్రోత్సాహంతో 100మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కల్పించినట్లు తెలిపారు. బిషప్ హాజరయ్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపా ధ్యాయురాలు నిర్మలమా విద్యార్థులకు పుస్తక పఠనం పెంపొందించుట కొరకు మాకు కొన్ని పుస్తకాలు తమ గ్రంథాలయం నుంచి ఇవ్వగలరు అని కోరామన్నారు. ఈ విషయం హరిబాబు దంపతులకు తెలియజేయగా లైబ్రరీకి ఎంతో ప్రోత్సాహం ఇస్తున్న దంపతులు వెంటనే వందమంది విద్యార్థులకు తాము శాశ్వత సభ్యత్వం కడతామని ముందుకు వచ్చారన్నారు.రూ. 5000 తమకు అందజేసినట్లు తెలిపారు.దాంతో 100 మంది పిల్లలతో శాశ్వత సభ్యత్వం కట్టించినట్లు తెలిపారు.

## ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి

### ఎక్స్‌రే జాతీయ సాహిత్య పురస్కారాల ప్రధాన సభలో పలువురు వక్తలు



ఎక్స్‌రే కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్ తదితరులు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** కవులు సమాజంపట్ల బాధ్యత వహించి చైతన్యవంతమైన, ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం సృజన చేయాలని మెప్మా మాజీ అధికారి, విశ్రాంతఐఎఎస్ ఎఎండి ఇంతి యాజ్ అన్నారు. ఆదివారం జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలకు 2024 -ఎక్స్ రే అవార్డుల.. ప్రదాన కార్యక్రమం ..విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి హాల్‌లో జరిగింది.ఎక్స్ రే.. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎ ఎమ్ డి ఇంతియాజ్ ప్రసంగం కొనసాగిస్తూ సామాన్యులకు కూడా అర్థమయ్యే భాషలో కవిత్వం రావాలి అన్నారు. మన పూర్వికులు అద్భుతమైన సాహిత్యాన్ని మనకందించారని, వాటిని అవగాహన చేసుకుని ప్రభావితం కావాలి అన్నారు. కవులు అద్భుత పద ప్రయోగం చేసాము అని ఉత్సాహపడక, తన సాహిత్యం ఎంతమంది చదవగలుగుతున్నారు అని ఆలోచించాలి అన్నారు. వేమన, గుర్రం జాషువా, మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని ఇంతియాజ్ విశదపరిచారు. మహిళలు కూడా కవిత్వ రచనలో ముందుండాలని డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి అన్నారు. దైనందిన జీవితంలో సామాన్యుడి కష్టాలను కవిత్వంలో చూపాలని కృష్ణవేణి అన్నారు. ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరి తన అధ్యక్షోపన్యాసంలో గత 44 సంవత్సరాలుగా ఈ కవితల పోటీలు నిర్వహిస్తుందన్నారు. నిజాయతీగా, నిష్కర్షగా న్యాయ నిర్ణేతలచే విజేతలనుఎంపిక చేస్తామన్నారు. కవుల జీవితంలో చిరస్థాయిగా గుర్తుండేలా అవార్డు ప్రదానం, సత్కారం చేస్తామన్నారు. వర్తమాన సమస్యలను ప్రతిబింబిస్తూ చేసే రచనలు చిరకాలం ప్రజల మనస్సుల్లో ఉంటాయని ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలుకుతూ అన్నారు. ప్రధాన అవార్డు గ్రహీతగా కన్నీటి రణం.. కవిత రచించిన మానుకోట కు చెందిన అక్షరం ప్రభాకర్ కు 12 వేల నగదు, జ్ఞాపిక, శాలువ తో వేదికపై ఉన్న కలెక్టర్ల చే సన్మానం జరిగింది. ఉత్తమ కవులుగా మామిడిశెట్టి శ్రీనివాస రావు(దొడ్డిపట్ల), శ్రీధర్ బాబు(నెల్లూరు), చిత్రాడ కిషోర్ కుమార్(విజయవాడ), జగరావు శంకరరావు(గజపతి నగరం), శ్రీకంఠస్ఫూర్తి (విజయవాడ), దువ్వూరి రమేష్ బాబు(నెల్లూరు), ధవళేశ్వరపు రవికుమార్(విశాఖ పట్నం), డాక్టర్ కోరుప్రోలు హరనాథ్(హైదరాబాదు) లు వెయ్యి రూపాయిలు నగదు, జ్ఞాపిక, శాలువా అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పోటీల్లో విజేతల కవితలతో ప్రచురించి ఎక్స్ రే కవితా సంపుటిని ఇంతియాజ్ ఆవిష్కరించారు. వేదికపై శ్రీశ్రీ సాహిత్యానిధి సింగంపల్లి అశోక్ కుమార్, హెచ్ఆర్పిఎస్ నేషనల్ కమిటీ కంచర్ల ముత్యప్రసాద్, కవి కె వి శ్యాంసుందర్, నందనోదయ ప్రసంగించారు. న్యాయనిర్ణేత, కవి, జర్నలిస్ట్ సర్వజిత్ బహుమతి కవితలను విశ్లేషించారు. విజేతలైన కవులు తమ స్పందన వినిపించారు. సభ ప్రారంభంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బి వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## తిరుపతిలో ప్రశాంతంగా గణేశ విగ్రహాల నిమజ్జనాలు

**తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు వినాయకసాగర్‌లో వందలాది విగ్రహాలు ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. తిరుపతిలోని వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సిఐ రామకిశోర్ సిబ్బందితో,వినాయక కమిటీ సభ్యులు ఉదయం నుండి సాగర్‌కెళ్ళే మార్గాల్లో ప్రత్యేక శిబిరాల నుండి ప్రశాంత నిమజ్జనానికి సహకరించారు. ఆయా విగ్రహాల మండపాల కమిటీలకు నిర్వాహకులకు ముందుగానే సూచించిన రూట్‌మ్యాప్,సమయం మేరకు విగ్రహాలను నిమజ్జనానికి భక్తిశ్రద్ధలతో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంలో తరలించారు. యువత నృత్యాలు చేస్తూ డ్రమ్స్‌వాయిస్తూ జై బోలో గణేశ్‌మహారాజ్ కీ జై ..జై గణేశ్ అంటూ క్రమపద్ధతిలో నిమజ్జనం చేశారు.వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గోపీనాథరెడ్డి, భాస్కర్‌నాయుడు, నవీన్‌కు మార్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, తొం డమనాటి సుబ్రమణ్యంరెడ్డి,చెంగారెడ్డి,సురేశ్ స్వామి, చంగల్‌రాయలు,నిమజ్జనం చేయించారు,

# తిరుమల సమాచారం

## బాలాజీని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

### త్రిసేనల లార్డ్‌బుద్ధ సర్క్యూట్ యాత్రబృందం

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని (బాలాజీస్వామిని) దర్శించుకోవడం ఆనందంగా ఉందని త్రిసేనల లార్డ్‌బుద్ధసర్క్యూట్ మోటార్‌సైకిల్ యాత్ర బృందం కన్వీనర్ రాహుల్‌పాటిల్ తెలిపారు. స్వామివారిని దర్శించుకునే భాగ్యం కల్పించిన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. భారతరక్షణ మంత్రిత్వశాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు యాత్రద్వారా భగవాన్ బుద్ధుని శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వంను భారతదేశం అంతటా వ్యాపించేటట్లు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. బుద్ధ సర్క్యూట్ పేరుతో పురాతన సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషించడానికి ఈ మోటార్‌సైకిల్ యాత్ర ఉపకరిస్తుందన్నారు. త్రిపుర రాష్ట్రం నుండి మొదలైన ఈ యాత్ర విజయవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగి తిరుమల బాలాజీస్వామిని దర్శించుకోవడం జరిగిందన్నారు. తిరుపతి స్థానిక ప్రజలు అందించిన ప్రోత్సాహం, ఆతిధ్యానికి బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.ఈ యాత్ర ఆదివారం తిరుపతి నుండి బయలుదేరి చిత్తూరుమీదుగా కర్నాటకకుచేరుకుంటుందని రాహుల్‌పాటిల్ తెలిపారు.తిరుమల ఆలయ అధికారులు చక్కటి దర్శనం చేయించారని కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం



**తిరుమల,ఆగస్టు31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే మనసు ఆనందం కలుగుతుందని, స్వామివారి ఆశీస్సులతో అందరికీ అంతా మంచి జరగాలని ప్రార్థించినట్లు ఆంధ్రప్రదేశ్ మాజీ ఎస్ఇసి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, న్యూఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎకెఎస్ విజయన్ తెలిపారు. స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోపలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం ఆయన విగ్రహానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. ఎస్వీ సంగీతనృత్యకళాశాలలోని ఆయన విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల, డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘురామ్, సంగీత కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## భగవంతుని అనుగ్రహానికి భక్తి ఒక్కటే మార్గం: మేడసాని

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భగవంతుని అనుగ్రహం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని మేడసాని మోహన్ తెలిపారు. భగవంతుని నమ్మిచెడిపోయిన వారు లేరని అన్నారు. హరి అంటే చేసిన పాపాలు పటాపంచలైపోతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భక్తులలో ప్రథమస్థానంలో ప్రహ్లాదుడు ఉన్నారన్నారు. ఆదివారం ఉదయం ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలు మహతి ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా హరికథ ప్రాశస్త్యంపై డిపిపి కళాకారులు ఆదిపట్ల నారాయణ దాసు జీవితం,కీర్తనలపై గోష్ఠిగానం చేశారు. హరికథ ధర్మప్రచారంపై డాక్టర్ వై.వెంకటేశ్వర్లు భాగవతులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో భాగవతారిణి పి.వరలక్ష్మి, డాక్టర్ ఎంవి సింహాచలశాస్త్రి, ఎం.రాముడు, విజయకుమారి, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ కార్యదర్శి రామగోపాల్, ఎఇఒ సిహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## భక్తాగ్రేసరులలో తిరుమలనంబి ప్రసిద్ధి

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని పలురకాలుగా తమ తమ స్థాయిలో కొలిచి తరించిన భక్తాగ్రేసరులలో తిరుమలనంబి ప్రసిద్ధిచెందారని హిందూ ధార్మికప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్ కొనియాడారు. తిరుమలలో ఆది వారం ఉదయం తిరుమలనంబి 1052 అవతా రమహోత్సవాలు వేడుకగా జరిగాయి. ఆలయ దక్షిణ మాఢవీధిలోని తిరుమలనంబి ఆలయంలో ఈసం దర్భంగా 16మంది పండితులు జీవిత చరిత్రపై ఉపన్యసించారు. భగవద్రామానుజులకు స్వయాన మేనమామ. గురుతుల్యులు, శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరు తిరుమలనంబి. శ్రీవారికి అభిషేకానికి సంబంధించిన పవిత్రజలాలను తీసుకువచ్చి విశేష సేవచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండితులు, అర్చకులు, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.




## టిటిడి ట్రస్ట్‌లకు భూరి విరాళాలు

### బర్డ్ ట్రస్ట్‌కు రూ.3.04కోట్లు, అన్నప్రసాదంకు రూ.10లక్షలు



**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు ,పథకాలకు దాతలైన శ్రీవారి భక్తులు భూరీ విరాళాలందిస్తున్నారు. ఆదివారం ఉదయం ఇద్దరు దాతలు తమవంతుగా 3.04కోట్ల రూపాయలు విరాళాలను టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు అందించారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్‌బి రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ 2.93కోట్లు రూపాయలు డిడిలను, ఆర్ఎస్ బ్రదర్స్ జ్యువలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 1.10కోట్ల రూపాయలు డిడిలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆయా సంస్థల ఎండిలు పొట్టి వేంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి,టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారిలు అందజేశారు. అలాగే నర్సారావుపేటకు చెందిన జె.రామాంజనేయులు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు విరాళంఅందించారు. దాతలను ఈ సందర్భంగా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అభినందించారు.



వార్త


ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యసనకు మూడు ముఖ్య స్తంభాలు.

-ఎమర్సన్

# మత్తుపై చేతల్లో చూపాలి


మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తున్నదని దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని, ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు సెలవిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదికి యేడాది విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇటీవల కాలంలో పదహారు, పదిహేడేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతున్నారు. అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా డాక్యుమెంట్ల ద్వారా జరిగిన మత్తుమందుల వ్యాపారంలో ఆసియా ఖండం వాటా పద్నాలుగా శాతానికిపైగా పెరిగిపోయినట్లు చెప్తున్నారు. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. భారత్‌లో రెండు దశాబ్దాల క్రితం కోటి డెబ్బైలక్షల మంది మత్తుమందు వాడకందార్లు ఉండగా ప్రస్తుతం పదకొండు కోట్లకుపైగా చేరుకున్నదని అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పదిహేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తుమందులపై ఖర్చు పెడుతున్నారనే అంచనాలు వెలువడుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ఇంకొకపక్క గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణలో ఖమ్మం, వరంగల్ తదితరజిల్లాల్లో అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. ఇక విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రపోర్టులో ఇరవైఒక్కవేల కోట్ల రూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. మత్తు మందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదసంస్థలకే చేరుతుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కాశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తుమందుల సరఫరా దారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నవి వందోవంతు కూడా ఉండకపోవచ్చు. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడంవల్ల ప్రపంచ వ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు, ఉగ్రవాదులు మాదకద్రవ్యాల ఉత్పత్తి,రవాణాను వ్యాపారంగా మలుచుకుంటున్నాయి. మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. భారతదేశంలో ఈతరహా మందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. అందుబాటులోకి వస్తున్న ఆధునిక, సాంకేతికపరిజ్ఞానాన్ని ఈ మత్తుమందు వ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టో కరెన్సీ' వాడకం సైతంపెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండా పోయింది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా వాడకందార్లు నమ్మకం ఉన్నవ్యాపారులనే సంప్రదించేవారు. మత్తుమందు తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు. ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెచ్చి అప్పగించేవాడు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్న నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒకదగ్గర దొరికిపోయేవారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని మత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వవచ్చు. మత్తు మందు రవాణా, చెల్లింపు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజాగా మట్టిగాజులు, డిక్షనరీలు పార్సిల్లో డ్రగ్ పెట్టి సరఫరా చేస్తున్న విషయం హైదరాబాద్‌లో బయటపడింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా యేడాదిలో వందకోట్ల రూపాయలకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు వెలుగుచూసింది. హైదరాబాద్‌లోని ప్రముఖప్రతిష్టాకరమైన యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్‌దందా బట్టబయలు అయింది. సరఫరాలో పాలుపంచుకున్న ముగ్గురు విద్యార్థులతోసహా మరొక ప్రైవేట్ వ్యక్తిని కూడా దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా మూడు, నాలుగువేల టన్నుల వరకు సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. పట్టుబడిన కేసు ల్లో కూడా పటిష్టంగా వ్యవహరించకపోవడం వల్లనో, లేక చట్టంలో ఉన్న లొసుగులో ఏమోకానీ జైలు నుంచి బయటకు వచ్చినవారు తిరిగి అదేవ్యాపారంలో కొనసాగుతున్నారు. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది.

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.



షేక్‌స్పియర్

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

## ప్రజావాక్కు



### పెద్దలు ఆలోచించాలి

ఉపరాష్ట్రపతిగా మాజీ జడ్జి పోటీయే సరికాదని మాజీ ప్రధాననాయమూర్తులు జస్టిస్ పి.సదాశివం,జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వెలుబుచ్చారు. రిటైరైన తరువాతసదాశివం కేరళ గవర్నరయ్యారు. గొగోయ్ రాజ్య సభ మెంబరయ్యారు కదా. అవి మరచిరెడ్డి మీద విరుచుకుపడడం ఎందుకు? మరొక వాస్తవం ఏమంటే 1967లో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి కోకా సుబ్బారావు గారు తన పదవికి రాజీనామా చేసి భారత దేశ అధ్యక్షునిగా పోటీ చేసారు. 1982 లో సుప్రీంకోర్టు జడ్జి హెచ్.ఆర్. ఖన్నాగారు కూడా దేశ ప్రథమ పౌరుని పదవికి పోటీ చేసారు. అలాగే 1969లోసి.జె.ఐ.గా ఉన్న హిదయతుల్లా గారు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవిని అలంకరించ లేదా? ఇప్పుడు విపక్ష కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేయడం సరికాదనడం అనేక కేసులను పర్యవేక్షించి తీర్పులిచ్చిన వారికిది తగునా? విజ్ఞులు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### చరిత్రాత్మక మలుపు

చైనా, రష్యా,బ్రెజిల్ దేశాలు అమెరికా వాణిజ్య యుద్ధానికి ఎదురు నిలుస్తున్న వేళ, భారత్ కూడా వెనుకడుగు వేయకపోవడం విశేషం. ట్రంప్ చూపిస్తున్న వ్యతిరేకత రాజకీయ అహంకారంపైనే ఆధారపడినట్లు భారత్– పాకిస్థాన్‌మధ్య యుద్ధాన్ని తానుఆపినట్టన్న అతని వ్యాఖ్యలను రెండు దేశాలు ఖండించడం నిరూపిస్తోంది. తక్షణ ప్రభావం ప్రతికూలమైనా, దీర్ఘకాలంలో ఈఆంక్షలు భారత్‌ను ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తాయి. స్వదేశీ పరిశ్రమలు, రైతు ఆధారిత ఉత్పత్తులు బలపడతాయి.

- సి. హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అన్ని రాష్ట్రాలకు మిజోరం ఆదర్శం

మిజోరం రాష్ట్రంలో ఉన్న భిక్షాటకులను పూర్తిగా ఆ పని నుండినిరోధించి వారికిప్రత్యేకంగా పునరావాసం కలిగిస్తూ ఏర్పాట్లు చేస్తూ కొత్త చట్టం చేశారు. ఇది మంచిదే. చట్టం వల్ల, దాని అమలు,పునరావాసం బట్టి మార్పులు వస్తాయి. ఏ ఆధారం లేని వ్యక్తులు అలా మారుతున్నారు. అది వారికీ, సమాజానికి చిన్నతనమే. కావున తగిన పునరావాస ఏర్పాట్లుఉంటే, కచ్చితంగా ఈ ఆలోచన గొప్పదే.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ 2025 సెలెక్షన్‌కు సంబంధించి ఎంపికయిన అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఆన్లైన్లో కాల్ లెటర్లు డౌన్లోడ్ చేసుకునేలా చేసారు. అందరికీ ఒకేసారి అందరికీ కాల్ లెటర్స్ డౌన్లోడ్ చేసుకునే ఏర్పాటు జరగలేదు. కొందరు మెరిట్ మార్క్స్ వచ్చినప్పటికీ కాల్ లెటర్స్ రాక ఆందోళన చెందారు. అభ్యర్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారు. అధికారులు సరైన విధానంలో స్పందించడం లేదు. కనీసం వెరిఫికేషన్ జాబితాలు కూడా అందరికీ అందుబాటులోకి ఉంచకపోవడంతో డిఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపిక జాబితా ప్రకటించి ఉంటే ఈ పరిస్థితులు ఎదురయ్యేవి కావు. గతంలో డిఎస్సీ ఎంపిక జాబితా ముందుగా విడుదల చేసి తర్వాత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరిగేది. కానీ నియామకాలకు సంబంధించి గతంలో లాగా ఎంపిక జాబితా విడుదల చేయలేదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### సరదా వెనుక దాగిన సవాళ్లు

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్,మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్ద ప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి. కానీవినోదం వెనుకదాగిఉన్న మానసిక,శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ ప్రారంభంలో వినోదం కోసం ఆడినా, తరువాత అవి వ్యసనంగా మారుతున్నాయి.

- వెంకటరమణ, గిలకత్తుల

### హామీలు పత్రికల ప్రకటనల వరకేనా?

పశ్చిమగోదావరి జిల్లాఅత్తిలి మండల పరిధిలోని 'ఊరదాళ్ళ పాలెం' గ్రామ ప్రధాన రహదారి మీదుగా రహదారుల మరమ్మతులికి రూ.3.50 కోట్లు మంజూరైనట్లు, టెండర్లు పిలిచి రోడ్లు మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ జూలై 17న పత్రికల ముఖంగా తెలిపారు. కలెక్టర్ హామీ ఇచ్చి నెల పైనే గడిచినా హామీలు పత్రికా ప్రకటనల వరకే గానీ ఆచరణకు నోచుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామీణ వ్యవస్థకు ఆధునిక టెక్నాలజీ వరమే

*కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, విని యోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సుల భతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరు కునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.*

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచీకరణ నేపథ్యం జీవన విధానాల్లో వస్తున్న మార్పులు, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేరుగా గ్రామీణ వ్యవస్థపై ప్రభావితం చూపిస్తున్నాయి. గ్రామీణ జానపద, సంస్కృతి సంప్రదాయాలపై ఆధునిక టెక్నాలజీ తీరు తెన్నెలు క్రమక్రమంగా పెరుగుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం టెక్నాలజీపై ఆసక్తి చూపుతున్న గ్రామీణ జీవన విధానంలో పెనుమార్పులు కనిపిస్తున్నాయి. సాంకేతికత పరిజ్ఞానం, మానవుని అవసరాలకు కావలసిన పనులను సరళీకృతం చేయడానికి అవసరమైనప్పటికీ, ప్రత్యక్ష భౌతిక మానవ సంబంధాల మధ్య తీవ్ర ఆగాదాన్ని పెంచుతుందని అనిపిస్తుంది. మితిమీరిన సాంకేతికత తరచుగా మానవ జీవన విధానాలపై ప్రభావితం చూపిస్తుంది అనే వాదనలు బలంగా వినిపిస్తున్నప్పటికీ రాను రాను మానవుడు ప్రతి చిన్న విషయానికి సాంకేతికత మీదనే ఆధారపడే పరిస్థితులు వస్తుండటం, సహజ సిద్ధమైన మానవమేధస్సు స్వయంగా ఆలోచించే ధోరణి కుదించకపోయేపరిస్థితి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదనే భిన్న వాదనలు సమాజంలో తెరపైకి వస్తున్నాయి. కంప్యూటర్లు సెల్‌ఫోన్లు నూతన సాఫ్ట్‌వేర్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి టెక్నాలజీ ఆధునిక మానవుని అవసరాలకు ఉపయుక్తంగాఉన్నప్పటికీ, భవిష్యత్ తరాల్లో వాటి ఆధిపత్యమే మానవ జీవన విధానాలపై ఒత్తిడి పెంచేవిధంగా ఉంటుందేమో అనే సంశయం అన్నిరంగాల్లో విస్తరించిన టెక్నాలజీ వినియోగం తీరు పరిశీలిస్తే అవగతం కాకమానదు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో మారుమూల గ్రామాలకు సైతం సమాచార వ్యవస్థ దూసుకుపోతుంది. వివిధ మాధ్యమాలు సాంకేతిక పరికరాలు నేటి గ్రామీణ జీవనశైలిని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామీణ జీవన విధానాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల దగ్గర సమావేశాలు, ఆత్మీయ పలకరింపులు కలుపుగోలుతనం లాంటి మానవ సంబంధాలు చాలావరకు క్రమక్రమంగా తొలగిపోతున్నాయా అనే సంశయం నేటి గ్రామీణ జీవన విధానాల్లో గోచరిస్తుంటుంది. దీనికి కారణం ప్రధానంగా విరివిగా ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని గ్రామీణులు అన్నిరంగాల్లో ఉపయోగించుకోవడం వలన గ్రామీణ వ్యవస్థలో మానవ సంబంధాల మధ్య దూరం పెరుగుతుందా అనే సంశయం కలగకమానదు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామీణులు ఎక్కువగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కంప్యూటర్లు సెల్‌ఫోన్లు ఇంటర్నెట్ లాంటి సాంకేతికతను వినియోగిస్తుండడంతో ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా అధిక సమయాల్లో వివిధ ఆధునిక సాంకేతిక మధ్యమాలతో అనుబంధాన్ని పెంచుకుంటున్న గ్రామీణులు ఎక్కువగా సెల్ఫోన్ టెక్నాలజీతో దృశ్య శ్రవణ ఆధారిత సంభాషణలకే పరిమితం అవుతున్నారేమో అనిపిస్తుంది. ప్రత్యక్ష మానవ అవసరాల్లో టెక్నాలజీ ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ,సహజ సిద్ధమైన మానవ జీవనశైలితో టెక్నాలజీ విడదీయరాని బంధంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోకి వేగంగా పురోగమిస్తుండడం విశేషం. తరచుగా యంత్ర పరికరాలతో వస్తువులు తయారు కావడం,రెడీమేడ్ వస్తువులు ఆన్‌లైన్ అమ్మకాలు, గ్రామాల్లోకి చొచ్చుకు రావడంతో కులవృత్తుల ఆర్థిక స్థితిగతులు క్రమంగా తగ్గిపోవడం లాంటి పరిస్థితుల్లో దారిద్ర రేఖకు దిగువన ఉన్నటువంటి గ్రామీణ కులవృత్తుల వారు ఎక్కువగా బ్రతుకుతెరువు కొరకు పనులు వెతుక్కుంటూ వేరే ప్రాంతాలకు వలసలుగా బయలుదేరుతున్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీ ప్రభావం కూడా ప్రసరిస్తూనేఉంది. వ్యవసాయదారులు చాలావరకు ఆధునిక పోకడలతో యంత్రాలు, సాంకేతికతను ఉపయోగించుకొని పాత పద్ధతులకు భిన్నంగా వ్యవసాయం చేస్తూ ఉండడం గ్రామీణ వ్యవస్థలో సాధారణంగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువగా సంపన్నులైన వారే అధికంగా యంత్ర పరికరాలను టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ఉపయోగిస్తుండడంతో ప్రత్యామ్నాయంగా వ్యవసాయంలో కూలీలు అవసరం తక్కువైపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులు తగ్గిపోతున్నాయి. తద్వారా గ్రామాల్లోని ఆర్థికపరిస్థితులు సరిగాలేని జనాలు కావాల్సినంత పని దొరకకపోవడంతో వ్యవసాయేతర పనులు వెతుక్కుంటూ పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, కాటన్ పిక్కింగ్, రోబో సిస్టం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి అనేక సాంకేతిక ఆధునిక యంత్ర పరికరాలు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో రైతులకు అధికంగా మేలు జరుగుతుండటం ఒక ఎత్తుఅయితే, దైనందిన గ్రామీణ జీవన విధానంలో టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ సాగు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఆధునిక యంత్రాల వినియోగంపై రైతులకు నిర్దిష్టమైన శిక్షణను అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత గోచరిస్తుంది. పరిశ్రమలు ఆధునీకరించబడి వస్తుఉత్పత్తి అధికం కావడంతో నేటి గ్రామీణ వ్యవస్థలోకి విరివిగా కంపెనీ వస్తువులు, రెడీమేడ్ వస్తువులు రావడం స్థానిక గ్రామీణ వనరులను తగ్గిం చిందని చెప్పవచ్చు. గ్రామీణులు ఇలాంటి వస్తువులపై ఆకర్షితులవుతున్నారు క్రమంగా కులవృత్తుల వారికి పనులు తక్కువైపోయి చేసిన పనికి గిట్టుబాటు ధర లేకపోవడం ఆధునికరించబడిన పరిశ్రమలలో పనుల కొరకు గ్రామీణులు పట్టణాలకు వలస వెళ్తున్న దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో సర్వసాధారణమైపోతున్నాయి. కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, వినియోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సుల భతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరుకునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అంది పుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. •



# ర్యాగింగ్ 'భూతా'నికి వైద్యం చేయలేమా?

జి. అజయ్ కుమార్


తెలుగు రాష్ట్రాల్లో విద్యా ప్రాంగణాల్లో మళ్లీ ర్యాగింగ్ భూతం చాప కింద నీరులా విస్తరిస్తుంది. ఇటీవల నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, పల్నాడు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్న సంఘటనలు సీనియర్స్ జూనియర్స్‌పై వ్యవహరించిన తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. విద్యాలయం అనగానేస్నేహం, విజ్ఞానం, నమ్మకం, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకాలు గుర్తొచ్చేలా ఉండాలి. కానీ భయం, అవమానం, ఆత్మనూన్యత భావం, కన్నీళ్లు కాదు. అది విద్యాసంస్కృతికి మచ్చలా మారుతుంది. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుంది. కొంత మంది సీనియర్లు ర్యాగింగ్‌ను ఇప్పటికీ సరదాగా తీసుకుంటున్నారు. ఇంటరాక్షన్ పేరుతో జూనియర్లతో శాడిస్ట్ లాగా జుగుప్సాకరంగా ప్రవర్తిస్తున్నారు. కానీ వాస్తవానికి అది మానసిక హింస, శారీరక దాడి, సామాజిక అవమానం, చాలా పెద్ద నేరంగా పరిగణించబడుతుంది. నేషనల్ క్రైమ్ రికార్ట్స్ బ్యూరో (గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దేశంలో వందల కొద్దీ ర్యాగింగ్ కేసులు నమోదవుతున్నాయి. చాలా కేసులు పోలీస్ స్టేషన్లలోకి రాకుండానే ఆగిపోతున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 200 మంది విద్యార్థులు ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అదే సమయంలో వేలాది మంది విద్యార్థులు మానసిక ఒత్తిడితో చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది. ఇంత పెద్ద నేరాన్ని సరదాగా తీసుకోవడం సమాజానికి అస్సలు మంచిదికాదు. ఇది జూనియర్స్‌తో పాటు సీనియర్స్ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. పాఠశాలల నుండి విలువలతో కూడిన విద్య అందకపోవడం, తల్లిదండ్రులు పిల్లలకు సామాజిక విలువలు నేర్పకపోవడం, పక్కవాళ్లతో ఎలా మెలగాలో చెప్పకపోవడం, మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వడం వంటివి వారి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కళాశాలలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలున్నా వాటి అమలు సరిగా లేకపోవడం కళాశాల యాజమాన్యాలు చూసి చూడనట్టు వదిలివేయడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వంటివి చట్ట అమలు బలహీనత వుండడం, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించకపోవడం వంటివి. ఇంకా ర్యాగింగ్ సాధారణమైన విషయంగా నేటి సమాజం తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భావించడం వంటివి కూడా దీనికి కారణంగా ఉన్నాయి. ఇలా అన్ని వర్గాలు మౌనంగా ఉండటంతో ర్యాగింగ్ అనే రాక్షసం మళ్లీ మళ్లీ తలెత్తుతోంది. సీనియర్లు అంటే జూనియర్లకు దారి చూపే మార్గదర్శకులు. ప్రోత్సహించే వారు, స్నేహ హస్తం అందించేవారు, భరోసా కల్పించేవారు,కానీ నేటి పరిస్థితుల్లో కొందరు సీనియర్లు జూనియర్లను భయపెట్టడమే తమ గౌరవంగా భావిస్తున్నారు. అది సీనియారిటీ కాదు వారి దురహంకారం. జూనియర్ల భవిష్యత్తు సీనియర్ల చేతుల్లో ఉంటుంది వారు మార్గదర్శకులుగా ఉండాలి. అందుకే సీనియర్ విద్యార్థులు తమ బాధ్యతను మరచిపోకూడదు. సుప్రీంకోర్టు ఇప్పటికే ర్యాగింగ్‌ను నేరంగా ప్రకటించింది. యూజీసీ 2009 ఆంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్ల ప్రకారం ర్యాగింగ్ చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసు తప్పదు. కళాశాల నుంచి బహిష్కరణ తప్పదు, స్కాలర్‌షిప్ రద్దు చేయబడుతుంది. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, హెల్ప్‌లైన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. కానీ అసలు సమస్య అమలులోనే ఉంది. కొన్ని కళాశాలలు కమిటీలు పేరుకే ఉంటాయి. కానీ అవి పనిచేయవు. ర్యాగింగ్ ఫిర్యాదులు బయటపడితే కళాశాల పేరు చెడిపోతుందనే భయంతో వాటిని దాచేస్తారు. ఇదే ఇంకా ర్యాగింగ్ పెరగడానికి కారణం అవుతుంది. కళాశాలల్లో జీరో టాలరెన్స్ పాలసీని కఠినంగా అమలు చేయాలి. సి సి టీవీ పర్యవేక్షణ తప్పనిసరి. సీనియర్లు భయాన్ని కలిగించడం కాదు భరోసా ఇవ్వండి. సీనియారిటీ మార్గదర్శకత్వంలో, భరోసాని కల్పించడంలో ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలి. జూనియర్లు ర్యాగింగ్ ఎదురైతే మౌనంగా ఉండకుండావెంటనే సంబంధిత అధికారులకు,తల్లిదండ్రులకు తెలియచేయడం, హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయడం చేయాలి. తల్లిదండ్రులు, సమాజం పిల్లల్లో ధైర్యం నింపాలి. ర్యాగింగ్‌ను సహించరాదని స్పష్టంగా నేర్పాలి. ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయాలి. •

# అంగడి సరుకుగా మారుతున్న అమ్మతనం



మేకిరి దామోదర్

ఆధునిక సమాజం వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య ఎంతగానో నలిగిపోతుంది. నిజమైన స్వేచ్ఛకి పరిమితులుంటాయి. అవి లేని దాన్ని విశృంఖలత్వం అంటారు. ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దానితో ప్రాణం తీయవచ్చు. శస్త్రచికిత్స చేసి ప్రాణం కాపాడవచ్చు. సామాజిక బాధ్యతలు గల పాలకులు,డాక్టర్లు ఆధునిక సాంకేతిక ఫలాలు సామాన్యుడి వికాసానికి, సామాజిక విలువలు పెంచినప్పుడే దానికి సార్థకత. దేశవ్యాప్తంగా, అలాగే రాష్ట్రంలో అబార్షన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సృష్టికి ప్రతి సృష్టి చేసే అమ్మతనం పేగు బంధాన్ని తెంచేసుకుంటోంది!. మారుతున్న సామాజిక పోకడలు పాశ్చాత్య సంస్కృతి,భయమో,భారమో, బాధ్యతారాహిత్యమో గర్భస్థ శిశువుల్ని తల్లులు కడుపులోనే చిదిమేస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లు, ఉరుకు పరుగుల ఒత్తిడిలో,ఆధునిక సామాజిక పోకడలతో ఓవైపు మహిళల్లో పునరుత్పత్తి శక్తి సన్నగిల్లుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆధునిక టెక్నాలజీతోమారుతున్న ఆలోచనలతో గర్భిణులు బిడ్డల్ని వద్దనుకునే కారణాలు అనేకం!. ఈ తరహా పెడధోరణులు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఓవైపు భారతదేశంలో ఉత్తరాది, దక్షిణాది ఆధిపత్య రాజకీయాల్లో ఉత్తరాది పెత్తనం పెరిగిపోతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచాలని ఆయా ప్రభుత్వాలు ప్రజల్ని కోరుతున్నాయి. గతంలో కుటుంబ నియంత్రణ పాటిస్తే ఇచ్చిన ప్రయోజనాల కంటే ఎక్కువమంది పిల్లల్ని కంటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న అబార్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 2020-21లో తెలంగాణలో 2,282 అబార్షన్లు నమోదయ్యాయి. 2024-25 నాటికి ఈ సంఖ్య పదిరెట్లు పెరిగి 16,059 అబార్షన్లు జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఈ లెక్కలన్నీ పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోనే హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్ఎంఐఎస్) వెల్లడించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో అబార్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. ఈ రాష్ట్రంలో 2020-21 ఆర్థికసంవత్సరంలో 2,282అబార్షన్లు జరగగా 2024-25 నాటికి ఈ సంఖ్య10,676కు పెరిగింది. దేశవ్యాప్తంగా అబార్షన్లు అధికంగా జరిగిన టాప్5 రాష్ట్రాల వివరాలను హెచ్ఎంఐఎస్ ప్రకటించింది. అబార్షన్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలోఉంది. ఈ రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,07,019 అబార్షన్‌లు జరిగాయి. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు 1,01,414, అస్సాం 76,642, కర్ణాటక70,241, రాజస్థాన్ 53,714 ఉన్నాయి. అయితే ఈ అబార్షన్ల వెనక అనేక విషాద ఘటనలు ఉన్నాయి. మెడికల్ అన్‌ఫిట్‌తో అబార్షన్లు కావడం వేరు, ఉద్దేశ్యపూర్వకంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడంవేరు. సమాజంపై ముఖ్యంగా మహిళల మానసిక,శారీరక ఆరోగ్య పరిస్థితులపై అబార్షన్లు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.



అబార్షన్లకు కారణాలు పరిశీలిస్తే, యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, కోలివింగ్ లాంటి పాశ్చాత్య సంస్కృతి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో తెలిసి తెలియని వయసులో మైనర్ బాలికలు గర్భం దాల్చడం, పరువుపోతుందనే భయంతో తల్లిదండ్రులు కులపంచాయతీలు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించడం ఇంకా కొనసాగుతోంది. మరోవైపు ఆదివాసీ గిరిజన ప్రాంతాల మహిళలకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వంటివి కూడా అబార్షన్ల పెరుగుదలకు కారణమవుతున్నాయి. మరోవైపు ఆర్థిక భద్రత ఉన్నవారు, ఇప్పట్లో సంతానం వద్దనుకునే దంపతుల సంఖ్య పెరిగిపోతుంది. ఉన్నంతకాలం ఎంజాయ్ చేద్దాం అనే ధోరణి ప్రబలుతోంది. గర్భం దాల్చినట్టు తెలియగానే అబార్షన్ చేయించుకుంటున్నారు. ఈ తరహా ధోరణులు సమాజంలో ఆందోళన కలిగించే అంశాలుగా మారుతోంది. ఈమధ్య మన రాష్ట్రంలో బయటపడ్డ అటు సరోగసీ ఇటు స్పెర్మ్ కలెక్షన్ యువతే లక్ష్యంగా వీర్యకణాల దందా స్పెర్మ్ ఇస్తూ డబ్బులు ఇవ్వ (తీసుకో)వడం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఐవీఎఫ్ సెంటర్లు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా ఉంది. ఇలా ఫెర్టిలిటీ సెంటర్లు పెట్టి స్పెర్మ్ కలెక్షన్ బ్యాంకులో అమ్మతనాన్ని అంగడి సరుకుగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నోరూల్స్,నో హ్యూమానిటీ అంతా (ఓన్లీ)మనీ అన్నట్టుగా వసూళ్ల దందా కొనసాగుతోంది. పెరుగుతోన్న సంతానలేమి సమస్యతో ఐవీఎఫ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పిల్లలు లేని దంపతుల తాపత్రయాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో ఐయూఎఫ్, ఐవీఎఫ్ చికిత్సల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. కాస్త పేరు గాంచిన సెంటర్లు రెట్టింపుగా వసూలు చేస్తున్నాయి. సంతానలేమి దంపతులు చికిత్సలు,మందులు వాడినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ సెంటర్లు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్లలో వీర్యకణాల బ్యాంకులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సరిపోగా మిగిలిన వీర్యకణాలను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో ఐవీఎఫ్ ట్రీట్మెంట్స్ తీసుకునేవారికే ఇప్పుడు అనుమానాలు వ్యక్తమయ్యేపరిస్థితులు వస్తున్నాయి. వారికి పుట్టిన బిడ్డలు నిజంగా వారికి పుట్టిన వారేనా! లేక వేరే డిఎన్ఏ ఉందా అని సందేహాలు వెంటాడుతున్నాయి. ఇలా ఒక సంస్థ చేసే తప్పుడు పనులతో చాలామంది తల్లిదండ్రుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. పేద మహిళలను లక్ష్యంగా చేసుకొని సరోగసీ కోసం ఒప్పందాలు చేసినట్టు అప్పటి ఆరోపణలే, ఈమధ్య బయటపడిన సంఘటనలతో నిర్ధారించబడ్డాయి. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ సేకరణలకు నిర్దిష్టమైన చట్టాలు ఉన్నాయి. కమర్షియల్ సరోగసీ మన దేశంలో పూర్తిగా నిషేధం. కేవలం ఆల్ట్రా యిస్టిక్ సరోగసీ అంటే మెడికల్ ఖర్చులు, ఇన్సూరెన్స్ మినహా ఆర్థిక ప్రతిఫలం లేని సరోగసీ అనుమతి ఉంటుంది. అలాగే సరోగసీ మదర్ భారత్ పౌరులై ఉండాలి. 25నుంచి 35ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఇది ఒక్కసారి మాత్రమే సరోగెట్‌గా ఉండగలదు. విదేశీ జంటలకు మన దగ్గర అనుమతి లేదు. 30 ఏళ్లలోపు యువతీ యువకుల నుంచి సేకరించినఅండాలను, శుక్రకణాలను పిల్లల కోసం పరితపించే దంపతులకు అంటగడుతూ డబ్బులు సొమ్ము చేసు కుంటున్నారు. ఏఆర్‌టి చట్టం ప్రకారం,స్పెర్మ్ సేకరణ కోసం ఏ ఆర్‌టీ బ్యాంకులు నేషనల్ రిజిస్ట్రీఆఫ్ బ్యాంక్స్ అండ్ క్లినిక్స్‌లో రిజిస్టర్ అయి ఉండాలి. స్పెర్మ్‌డోనర్లు 21-55ఏళ్ల వయసు కలిగిఉండాలి. స్పెర్మ్‌నిల్వల కోసం క్రయోట్యాంకులు 196సీ వద్ద నిర్వహించబడాలి. ఒకవేళ ఈనిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం10ఏళ్ల జైలు శిక్ష,రూ.10 లక్షలజరిమానా విధించవచ్చు. అయితే ఈ చట్టాలు కఠినంగా ఉన్నా సరైనపర్యవేక్షణ లేకపోవడంతో సరోగసీ సెంటర్లు రెచ్చిపోతున్నాయి. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించుటకు ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. •

# విజయవాడ వార్త



# కమాండ్ కంట్రోల్ రూం నుండి నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించిన సిపి

## నిమజ్జన ప్రాంతాల్లో డ్రోన్,సిసి కెమేరాల ఏర్పాటు అధికారులకు,సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సూచనలు

విజయవాడ క్రైం,ఆగస్టు 31,ప్రభాతవార్త: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లను కమాండ్ కంట్రోల్ రూం నుండి సిపి రాజశేఖరబాబు స్వయంగా పరిశీలించారు. ఐదవ రోజైన ఆదివారం కావడంతో అత్యధికంగా వినాయక స్వామి నిమజ్జన ఊరేగింపులు ఉన్నందున ఆయన ప్రజలకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కల్గకుండా,ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా



భక్తులందరూ ఆనందోత్సాహాలతో శాంతిభద్రతల మధ్య ప్రశాంతమైన వాతావరణలో వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసారు. ఊరేగింపులు జరిగే అన్ని ప్రదేశాల్లో,నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ డ్రోన్ కెమేరాలు,సిసి కెమేరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. ఆయన స్వయంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు అధికారులకు,సిబ్బందికి సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి ఎవిఎల్ ప్రసన్నకుమార్,ఎస్బి ఏసిపి భాను ప్రకాష్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి వేడుకల సందర్భంగా నృత్య పోటీలు, విజేతలకు బహుమతులు

జగ్గయ్యపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త :వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా జగ్గయ్యపేట ఆకుల వారి వీధిలో గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన చిన్నారులకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 28 సంవత్సరాల కాలంగా నిర్విఘ్నంగా వినాయక పందిరి ఏర్పాటుచేస్తూ, కోవిడ్ సమయంలో కూడా తగిన జాగ్రత్తలు పాటిస్తూ నవరాత్రులను భక్తిప్రపత్తులతో కమిటి వారు నిర్వహించటం స్ఫూర్తిదాయకమన్నారు. భారతీయులందరిని సంఘటితపరుస్తూ నవరాత్రుల వేడుకలు నిర్వహించుకోవటం మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించటం అవుతుందని సంతోషం వ్యక్తంచేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు పెద్దాపురపు వాగ్దేవి, మంగళగిరి హిరణ్య, ఇక్కుర్తి అస్మిత వరుస బహుమతులు సాధించారు. వినాయక పందిరిని కళాత్మకంగా తీర్చిదిద్దిన ఇక్కుర్తి బాబీని ప్రత్యేకంగా అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో కాకర్ల లక్ష్మీ నారాయణ, రంగాపురం మణికంఠ, ఉత్సవ కమిటి సభ్యులు, నివాసిత ప్రాంతవాసులు పాల్గొన్నారు.



## ఘనంగా గణేష్ విగ్రహ నిమజ్జనం



గుంటూరు విద్య, ఆగస్టు 31, ప్రభాతవార్త: సిటీలో ఆదివారం నాడు గణేష్ విగ్రహాల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిపారు. ముందుగా వేద పండితులైన తాతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, హోమములు నిర్వహించి సంగడిగుంట పురవీధుల నందు చెక్కభజనలు మరియు మహిళల కోలాటములతో అత్యంత వైభవంగా జరిగినది ఈ సందర్భంగా జరిగిన లడ్డూపాట పెద్ద లడ్డు అప్పల శ్రీరాములు మరియు చిన్న లడ్డు వాగ్దేవి కైవసం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, మద్ది రవికుమార్, అనిల్, శేఖర్, కిషోర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## 'ఆంగ్ల మాధ్యమం విశ్వ విజేతలను చేస్తుంది'

గుంటూరు విద్య, ఆగస్టు 31, ప్రభాతవార్త: మాతృభాష తో పాటు అంతర్జాతీయ సంబంధాలను, విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విశ్వ విజేతలుగా గుర్తింపు పొందాలంటే ఇంగ్లీష్ భాష పై చక్కటి అవగాహన పట్టు సాధించాలని అలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని "మేక్ యువర్ బేబీ జీనియస్" సంస్థ డైరెక్టర్ ఎస్ అశ్విని పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడి టెక్నో పాఠశాల లో ఆంగ్ల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో చదవడం వ్రాయటం పై ఒక్కరోజు ఉన్నత స్థాయిలో ఒరియంటేషన్ తరగతులు నిర్వహించారు. అశ్విని మాట్లాడుతూ తమ సంస్థ "భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, తిరుపతి" ఆధ్వర్యంలో రెండు, మూడు తరగతులు చదివే విద్యార్థుల పఠన తరగతి పుస్తకాలు అలవోకగా చదివి ఆకళింపు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకులు భాస్కర్ రాజు, పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ , రాఘవయ్య మాస్టారు, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## 'మధుసూదనరావు సేవలు అభినందనీయం'


గుంటూరు విద్య , ఆగస్టు 31, ప్రభాతవార్త: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) శాఖలో మధుసూదనరావు అందించిన సేవలు అభినందనీయమని ఆర్పిఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ షమ్ముగం పడివేలు పేర్కొన్నారు. ఆదివారం పట్టాభిపురంలోని డి.ఆర్.ఎం కార్యాలయంలో జరిగిన డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనికి అసిస్టెంట్ కమిషనర్ శైలేష్ కుమార్ అధ్యక్షత వహించారు. పడివేలు మాట్లాడుతూ.. శాఖ పరంగా మధుసూదనరావు కు దక్కిన్ని అవార్డులు, రివార్డులు మరే అధికారికి దక్కలేదన్నారు. మధుసూదనరావు మాట్లాడుతూ..కష్టపడితే ఏదైనా సాధించవచ్చున్నారు. ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనన్నారు. ఆర్ పి ఎఫ్ అధికారులు శైలేష్, పవన్ సింగ్, చెంచయ్య, మర్రి సాంబశివరావు, అశ్వేశ్వరరావు, మురళీకృష్ణ, రమాకాంత్, చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, నారాయణ కుటుంబ సభ్యులు గోళ్లమూడి భాస్కరరావు, శ్రీనివాస్, సుశీల, బోడెపూడి అనిల్, జ్యోతి, గుమ్మడి సుబ్బారావు, భార్గవి పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ సేవలు అభినందనీయం

విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త : విదేశాల్లో తక్కువ ఖర్చుతో డాక్టర్లను తీర్చిదిద్దుతున్న ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ విజయవాడ ఫోకల్ పాయింట్ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు అన్నారు. విజయవాడలో ఆదివారం ఈ ఏడాది నూతన విద్యార్థులకు వైట్ కోట్ సెర్మోని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విదేశాల్లో డాక్టర్ కోర్సు చేయడానికి కోట్లు ఖర్చవుతాయని, కానీ అతి తక్కువ ఖర్చుతో పాటు స్కాలర్‌షిప్ కల్పిస్తూ తోడ్పాటు నందిస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంవత్సరానికి 200 మందిని పంపుతూ, 2వేల మందిని డాక్టర్లుగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. తక్కువ ఖర్చుతో విదేశాల్లో డాక్టర్లు అయిన వీరు తక్కువ ఖర్చుతో వైద్యమందించాలని కోరారు. సంస్థ నిర్వాహకురాలు జ్యోతి నాగిశెట్టి మాట్లాడుతూ ఇప్పటివరకు 2వేల మందిని డాక్టర్ కోర్సు చేయించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



## ప్రజాసేవ చేసిన మహనీయుల పేర్లు జిల్లాలకు పెట్టాలి



విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త : ప్రజాసేవకు అంకితమై సేవలందించిన మహనీయుల పేర్లను జిల్లాలకు పెట్టాలని ఆదివారం విజయవాడలో సోషల్ జస్టిస్ ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాపు ఐక్యవేదిక , బీసి ఐక్యవేదికలతో సంయుక్తంగా జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం కు సర్దార్ గౌతులచ్చన్న, కృష్ణాకు వంగవీటి మోహనరంగా, గుంటూరుకు గుర్రం జాషువా, పల్నాడుకు కన్నెగంటి హనుమంతు, కర్నూలుకు దామోదరం సంజీవయ్య, అనంతపురంకు శ్రీకృష్ణదేవరాయ జిల్లాలుగా నామకరణం చేయకుంటే సంయుక్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫోరం వర్కింగ్ చైర్మన్ జంగాల సింగారయ్య యాదవ్, మానాతుల శ్రీనివాస్, దాసగౌడ్, బొడపాటి పెదబాబు, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టాటా ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ నుండి డోడియో

విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త వరిలో పాముపొడ తెగులును తమ కొత్త ఉత్పత్తి 'డోడియో' సమర్థంగా నివారిస్తుందని టాటా ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ సౌత్‌ఈస్ట్ సేల్స్ హెడ్ పి రాజా, సౌత్ మార్కెటింగ్ హెడ్ వై రవికృష్ణ ప్రకటించారు.

# మంత్రి లోకేష్‌కు మరో అరుదైన గౌరవం



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 31:** విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు శ్రీకారం చుట్టిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్ కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం.. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేష్ ను కోరింది. గత 20 ఏళ్లలో భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని, 2001లో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా ఠీజుశిలో భాగస్వాములయ్యారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుందని భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## స్ఫూర్తిప్రదాత ప్రభుత్వ డాక్టర్ అనిల్‌కుమార్ : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త :క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం, సేవా తపనలతో నిర్వర్తించే వైద్యవృత్తి పూజ్యనీయమని, ప్రభుత్వ వైద్యాధికారిగా నేటి తరానికి స్ఫూర్తి–ఆదర్శాలను అందించిన ఉత్తమ వైద్యులు నోముల అనిల్‌కుమార్ అంటూ స్థానిక ఎమ్మెల్య శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అభినందించారు. దాదాపు మూడు దశాబ్ధాలపాటు ప్రభుత్వ వైద్యాధికారిగా విధులు నిర్వర్తించిన అనిల్‌కుమార్ పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన, సన్మాన సభలో ఎమ్మెల్యే రాజగోపాల్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. వివాద రహితులని, పేదలకు వైద్యసేవలు అందించటం, సామాజిక వైద్య అవగాహన సదస్సుల ద్వారా అనేకమార్లు యువతను చైతన్యపర్చటం, ప్రభుత్వ వైద్యవిధివిధానాలు, పథకాలను అమలుపర్చటంలో విశేషమైన పరిశ్రమచేసి అనిల్‌కుమార్ పర్యావరణ పరిరక్షణ విషయంలో కూడా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని, వారి సేవలు చిరస్మరణీయమని శ్లాఘించారు. డాక్టర్ అనిల్‌కుమార్ తన స్నేహితుడు కావటం గర్వకారణమన్నారు. కాగా సభలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, పలు ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.



### నీట్ పిజిలో ఆల్ ఇండియా క్యాటగిరిలో 248వ ర్యాంక్ సాధించిన నిఖిల్ జాదవ్

జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాలోతు శ్రీహరి కుమారుడు మాలోతు నిఖిల్ జాదవ్ నీట్ పిజిలో ఆల్ ఇండియా క్యాటగిరిలో 248వ ర్యాంక్ సాధించటంపట్ల ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అభినందించారు. ఎయిమ్స్ భూపాల్‌లో ఎంబిబిఎస్ చదువు పూర్తిచేసుకుని నీట్ పిజీలో జాతీయ స్థాయిలో 248వ ర్యాంక్ సాధించటం జగ్గయ్యపేటకు గర్వకారణమన్నారు. కాగా ఈకార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కూడా పాల్గొని శ్రీహరిని, ఆయన కుమారుడు నిఖిల్ జాదవ్‌ను అభినందిస్తూ సత్కరించారు.

# గణపతి విగ్రహాల నిమజ్జనంలో డిజె సౌండ్‌లు, రికార్డింగ్ డ్యాన్సుల హోరు!

అమరావతి, ఆగస్టు 31, ప్రభాతవార్త: మండపూడి గ్రామంలో శనివారం రాత్రి ఊరంతా మారుమోగేలా డీజే సౌండ్లతో మహిళలు అసహ్యించుకునేలా రికార్డింగ్ డాన్స్ లతో గణనాథుడు ఊరేగింపు ముందుకు సాగిందని స్థానిక మహిళలు మహిళా సంఘాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న ఘనపయ్యను నిమజ్జనం నిమిత్తం తరలించే సమయంలో యువత స్టేజి డాన్సర్లను ఏర్పాటు చేసి విందు చిందు మందు ఘన నాధుడి సాక్షిగా సేవించి ఆటలు పాటలు అరుపులు కేకలు తో ఊరంతా మారుమోగిందని ప్రజలన్నారు. దైవభక్తిని చాటాల రక్తిని కట్టించే డాన్స్ ను చూడాలా అర్థం గాక మహిళా భక్తులు వెనుతిరిగిపోయామన్నారు.



## గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,ఆగస్టు31,ప్రభాతవార్త: గణేష్ ఉత్సవాల్లో భాగంగా పట్టనంలోని వివిధ ప్రాంతాల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండలాలను ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆదివారం సందర్శించారు. స్వామివారికి జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా మండపాల వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను జీ.వీ ప్రారంభించారు. ఈ సందర్భ ంగా జీ.వీ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై,ప్రతి కుటుంబంపై ఉండాలన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.



## కోలాహలంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం



సత్తెనపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త: చవితి పూజలందుకున్న గణనాథుని నిమజ్జనం వేడుకలను పట్టణంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి, పరిసన ప్రాంతాల నుంచి నిమజ్జనం కోసం విచ్చేసిన గణనాథుల ఊరేగింపుతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. రఘురామ్ నగర్‌లోని భారీ గణనాధుని నిమజ్జనం వేడుకలు వైభవంగా నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా సాగిన పూజల అనంతరం భారీ గణేషుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో బాణాసంచా, సాంస్కృతిక నృత్యప్రదర్శనలతో సాగింది.స్థానిక ప్రముఖులు, తదితరులు పర్యవేక్షించారు.





# నగరపాలక సంస్థకు చెందిన సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయండి : కమీషనర్

విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 31,ప్రభాతవార్త: నగరపాలక సంస్థకు చెందిన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు దాఖలు చేయచ్చని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను




కార్పొరేషన్ ప్రదాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలంలో కూడ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులు జోనల్ కార్యాలయాలతో పాటు ప్రదాన కార్యాలయంలో కూడ అందుబాటులో ఉంటారని,కావున ప్రజలందనూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వరద ముంపులో గృహాలు

ఎ కొండూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం తిరువూరు జాతీయ రహదారికి ఎం కొండూరు మండలం కంభంపాడు అయ్యప్ప హోటల్ అరుణ చికెన్ సెంటర్‌ల నుండి వెళ్లే గ్రామ పంచాయతీ అంతర్గత రహదారి డ్రైన్‌తో పాటు హైవే–30 జాతీయ రహదారి డ్రైనేజి పూడిపోవడంతో వరద నీరు అక్కడ నివాసం ఉండే ప్రజల ఇళ్లు వరద ముంపుకు గురై బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల అవస్థలు పడుతున్నారు. ఇటీవల దంచికొడుతున్న వర్షాల వల్ల ఈ ఆవాస ప్రాంత వాసులకు పూడిపోయిన గ్రామ పంచాయతీ డ్రైన్ ఎన్‌హెచ్–30 జాతీయ రహదారి డ్రైనేజిలకు వెంటనే పూడిక తీసి వరద ముంపు నివారణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఈ ప్రాంత వాసులు బాధితులు గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్‌హెచ్–30 అధికారులకు విజ్ఞప్తి చేశారు.





## 'కూటమి' ప్రభుత్వం ప్రజాకంఠ పాలన: వైకాపా కన్వీనర్ స్వామిదాస్ విమర్శ



ఎ కొండూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజా కంఠక పాలన కొనసాగిస్తూ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం రూ.19వేల కోట్ల భారం వేసి సూపర్–6 పథకాలు సూపర్ హిట్ స్వంత డబ్బా కొట్టుకోవడం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పాలనకు నిదర్శనమని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ ఎ కొండూరు క్రాస్ రోడ్డు పాలేటి నాగేశ్వరరావు మ్యాంగో మార్కెట్ వద్ద ఆదివారం జరిగిన వైకాపా మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో స్వామిదాస్ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పార పట్టారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జెఎస్‌పి బిజెపి ప్రజలపై ముప్పేట దాడి చేసి అమలుకాని హామీలతో అధికారం చేపట్టి ప్రజలను నట్టేట ముంచారని స్వామిదాస్ విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మారుపేరు మాట తప్పడ మడమ తిప్పడని ప్రజలకు ఏ హామీలైతే ఇచ్చారో ఆ హామీలనే అమలు చేసిన సింగిల్ సింహం జగన్ అన్నారు. సచివాలయాల వ్యవస్థ వాలంటీర్ల వ్యవస్థ లాంటి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగింట్లోకి తెచ్చిన ఘనత జగన్‌దేనని తెలిపారు. మహానేత డా॥వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరు గార్చారని పేద ప్రజల సంక్షేమం గాలికొదిలేసి పెరిగిపోయిన నిత్యవసర ధరలతో ప్రజల జీవనం పాతాళానికి తొక్కేశారని స్వామిదాస్ పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రజాధనంలో చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌లు ప్రభుత్వ ప్రత్యేక విమానాలు హెలికాప్టర్లలో విహంగయాత్రలు చేస్తున్నారని ఎద్దేవ చేశారు. పవన్‌కళ్యాణ్ భారత రాజ్యాంగస్ఫూర్తికి డిసిఎంగా పనిచేస్తూ కాషాయ వస్త్రాలు ధరించడం సనాతన ధర్మం అంటూ చెప్పడం విరుద్ధమని స్వామిదాస్ విమర్శించారు. ఇంకా ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జనరల్ సెక్రటరీ నరెడ్ల వీరారెడ్డి, ఎంపిపి కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు (రాడ్డు), వజ్రాల బ్రహ్మారెడ్డి, తుమ్మూరు వెంకటేశ్వరరావు (ఇంజనీర్‌రెడ్డి) తిరువూరు నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కోడూరు సర్పంచ్ తేళ్లూరి సురేష్ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధర్మా, మండల వైసిపి అధ్యక్షుడు భూక్యా గనియా, సర ్పంచ్ కోలా శ్రీను, కేశానాయక్, ఎ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్ల నిర్మాణం ఎప్పటికో?

ఎ కొండూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో ఎస్సీ బజార్‌లో రెండురెడ్ల బజార్‌లో ఒక సిసి రోడ్డు నిర్మాణం నిమిత్తం గ్రామ పంచాయతీ అధికారులు తీర్మానం కాపీ ఇచ్చి 8 నెలలు కావస్తున్నా అధికార కూటమి (గుత్తేదార్లు నాయకులు సిసి రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించక పోవడాన్ని ఆయా వర్గాల ప్రజలు అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్య వైఖరిని ఆక్షేపించారు. ఇకనైనా ఈ మూడు చోట్ల గ్రామ పంచాయతీ అధికారులు తీర్మానం చేసిన ప్రదేశాల్లో ఆవాస ప్రాంతాల్లో అధికార కూటమి నాయకులు (గుత్తేదారు) సిసి రోడ్ల నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుని తమ అసౌకర్యానికి ఇబ్బందులు తొలగించి ఆదుకోవాలని ఈ ప్రాంత ఎస్సీ ఓసి వర్గాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పిఆర్‌ఎఇ పోస్టు భర్తీ ఎన్నడో ?

ఎ కొండూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ ఏఇ పోస్టు గత గతేడాది నుండి ఖాళీగా ఉండడంతో మండల ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మండలంలో పనిచేసిన ఎఇ'ని జి కొండూరుకు గతేడాది బదిలీ చేయగా నేటివరకు ఎఇ పోస్టు భర్తీ చేయకపోవడం గంపలగూడెం పిఆర్ శాఖ ఎఇని ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఇన్‌చార్జ్ ఎఇ అందుబాటులో ఉండడం లేదని వివిధ పనులపై మండలానికి వెళితే ఎఇ అందుబాటులో ఉండడం లేదని మండల ప్రాంత ప్రజలు ఆరోపించారు. ఇకనైనా ఈ మండలంలో గతేడాది నుండి ఖాళీగా ఉన్న ఎఇ పోస్టు రెగ్యులర్‌ను వెంటనే నియమించి తమ కష్టాలను తొలగించాలని 21 గ్రామ పంచాయతీల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

## 'ఐద్వా' తిరువూరు పట్టణ మహాసభ

తిరువూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త : అఖిల భారతప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తిరువూరు పట్టణ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ ఒక పార్టీపోయి మరొకపార్టీ అధికారంలోకి వచ్చినా దేశంలో గాని రాష్ట్రంలో గాని మహిళలకు రక్షణ లేకుండా పోతోందని పాలకులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. పోరాడి సాదించుకున్న హక్కులను కూడా కాలరాస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఐద్వా తిరువూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శుల పదవులకు ఎస్.కుమారి, ఎం.లక్ష్మీ ఎన్నికయ్యారు.




## శాంసంగ్ కార్యాలయాల్లో కిడ్స్‌డే సందడి

విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త : కిడ్స్ డే ఎట్ శామ్‌సంగ్ 2025ను నిర్వహించినట్లు శాంసంగ్ ఇండియా పీపుల్ టీం హెడ్ రిషబ్ నాగ్‌పాల్ తెలిపారు. గురుగ్రాంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఉద్యోగులు వారి పిల్లలు, జీవిత భాగస్వాములు ఒకేవేదికపైకి తెచ్చి వేడుకలు నిర్వహించామన్నారు. చిరస్థాయిగా నిలిచే జ్ఞాపకాలనందించడమే కాక తదుపరి తరాన్ని కలలు కనడానికి, ఆవిష్కరించడానికి, సాంకేతికతను అన్వేషించడానికి స్ఫూర్తినిచ్చేలా నిర్వహించామన్నారు.



వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

BUSINESS

★ AI based Cyber Forensics Cyber Experts 65B 63(4)(B) Electronic Evidence KYC KYB WhatsApp Evidence services cyberprivilege.com 8977308555 (Ro.No.20963)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# పల్నాడు జిల్లా వార్త



## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు31,ప్రభాతవార్త: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్‌లో జరిగిన శారద మున్సిపల్‌ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నార్నె విజయశ్రీ ఉద్యోగ విరమణ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గత 34 సంవత్సరాల సర్వీస్ కాలంలో వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన విజయశ్రీని అభినందించారు. తాను ఎక్కడ పనిచేసినా విద్యార్థుల అభివృద్ధితో పాటు, పాఠశాల అభివృద్ధికి కూడా ఎంతో పాటుపడ్డారని ఈ సందర్భంగా వివరించారు. రోటరి ద్వారా సమాజసేవలో, ప్రముఖ జర్నలిస్ట్‌గా వివిధ పత్రికలలో 34 సంవత్సరాలుగా పనిచేస్తూ ప్రజలకు, దండా గోపి తన వంతు సేవలు అందిస్తున్నారని ఈ సందర్భంగా అభినందించారు. ఈ దంపతులిద్దరూ తన కుటుంబానికి ఎంతో ఆత్మీయులని అన్నారు. అనంతరం నార్నె విజయశ్రీ,దండా గోపి దంపతులను శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు,కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, జోతిర్మయి ఇండస్ట్రీస్ గ్రూప్ ఛైర్మన్ దండా బ్రహ్మానందం, రోటరి సెంటినరీ గవర్నర్ జాష్టి రంగారావు, చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు,చిలకలూరిపేట మండల విద్యాశాఖాధికారి బి సత్యనారాయణ సింగ్, పట్టణంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయ బృందం, చిలకలూరిపేట రోటరిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామ సుబ్బారావు, ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి చెన్నుపాటి చైతన్య, రోటరి డైరక్టర్లు ముత్తినేని వెంకటేశ్వర్లు, తోటకూర వెంకటనారాయణ, ఎన్ చంద్రశేఖర్ రావు, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, కందిమళ్ల అంజిబాబు, గల్లా సాంబశివరావు, గోగినేని నాగేశ్వరరావు, చిలుకూరి శ్రీనివాసరావు,కాపు వెంకట్రావు, జంపని భాస్కరరావు, డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు, డాక్టర్ ముప్పాళ్ల శైలజచంద్ర, పట్టణ సిఐ పి రమేష్, రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, విశ్రాంత అద్యాపకులు బైకా నాగిరెడ్డి, బి కోటిరెడ్డి, పండరీపురం రోటరి కార్యదర్శి దోరడ్ల మనోజ్‌కుమార్, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని దండా గోపి దంపతులను సత్కరించి అభినందనలు తెలియచేశారు.





## డాక్టర్ బైరా సుజాత విద్యా సేవలు ఎనలేనివి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు31,ప్రభాతవార్త: డిఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన డాక్టర్ బైరా సుజాత విద్యార్థులకు చేసిన సేవలు ఎనలేనివని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో డాక్టర్ బైరా సుజాత పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బైరా సుజాత ఇంగ్లీష్ లెక్చరర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకున్నారని, ప్రస్తుత పరిస్థితిలలో ఇంగ్లీష్ ల్యాంగెజీ ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని, వారి జీవితాలలో అత్యున్నత స్థానంలో వెళ్లడానికి ప్రధానంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ముందుకు సాగాలంటే ఇంగ్లీష్ అవసరమని, అలాంటి ఇంగ్లీష్ బోధన చేస్తూ పదవీ విరమణ చేస్తున్న డాక్టర్ బైరా సుజాతకు ప్రత్తిపాటి అభినందనలు తెలిపారు. అలాగే బైరా కుటుంబంతో తనకున్న అనుభంధం ఎప్పటికి మరువలేనిదని, బైరా దిలీప్ తెలుగుదేశం పార్టీ గెలుపులో తనవంతు కృషికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏదో విదంగా గుర్తింపు ఇస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి మైలవరపు శివానందకుమార్, సహయ కార్యదర్శి బేతంచర్ల రామకోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు, మక్కెన నరసింహరావు, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొని సుజాతను సత్కరించారు.



## సిపిఐ నేత సాంబయ్యకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ నివాళి

చిలకలూరిపేట,ఆగస్టు31,ప్రభాతవార్త: మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు వూట్ల సాంబయ్య ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ వారి నివాసానికి వెళ్లి సాంబయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాజశేఖర్‌తో పాటు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, నార్నె హనుమంతరావు, పఠాన్ అక్బర్, కె హనుమంతరావు, కె నాగేశ్వరరావు, పి వెంకటేశ్వర్లు, చింతల సింగయ్య, టి వెంకట్రావు, టి బుచ్చియ్య, వెంకయ్య, భీమయ్య, యడవల్లి రామారావు, యం పుల్లారావు, కె బసవయ్య, కృష్ణమోహన్, జి సాంబయ్య, జి సుబ్బారావు, కె శ్రీనివాసరావు, వై రాజేష్‌లు పాల్గొని నివాళులు అర్పించారు. అదేవిధంగా సిపిఐ నాయకులు పేలూరి రామారావు, నాగబైరు సుబ్బాయమ్మ, బొంతా రాజారావు, బొంతా శేషయ్య, బొంతా భగత్‌సింగ్‌లు వూట్ల సాంబయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.





## జెవివి ఆధ్వర్యంలో మహాకవి ఆరుద్ర శతజయంతి

చిలకలూరిపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త: జనవిజ్ఞానవేదిక, షేక్ లాలూసాహెబ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో మహాకవి ఆరుద్ర శతజయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ పివి సుబ్బారావు పాల్గొని ఆరుద్ర జీవిత విశేషాలు, వారు వ్రాసిన రచనలు గురించి విద్యార్థులకు వివరించారు ఆరుద్ర వ్రాసిన పాటలు పాడి వినిపించారు. ఈ సందర్భంగా రూ 1000 విలువైన 25 రకాల బాలసాహిత్య పుస్తకాలను హాస్టల్ గ్రంథాలయానికి అందించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్దాంతి కరిముల్లా, వైయస్సిఐ గౌరవ అధ్యక్షుడు ముక్కా విన్సెంట్‌పాల్, హాస్టల్ వార్డన్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



## పాలకుల మంచిని, కష్టాన్ని ప్రజలకు తెలియజేయడం మన బాధ్యత : ప్రత్తిపాటి

యడ్లపాడు, ఆగస్టు 31, ప్రభాతవార్త: తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలతో కూటమి ప్రభుత్వం మహిళల మనసులు గెలిచిందని, ఇప్పటికీ పథకం లబ్ధి తమకు అందలేదనే అర్హులకు న్యాయచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చంద్రబాబు 15నెలల్లో చేసిన మంచిని ప్రజలకు గమనించాలని మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. యడ్లపాడు సంగం డెయిరీ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు డెయిరీ తరుపున అందించే బోనస్ పంపిణీ ప్రారంభించి, లబ్ధిదారులకు నగదు చెక్కుల్ని అందించారు. అనంతరం అన మాట్లాడుతూ జగన్ అధికారం దక్కించుకున్న అహంకారంతో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని తప్పులు చేశాడని, అఖరికి రైతుల భూముల్ని కూడా కాజేయడానికి సిద్ధమయ్యాడన్నారు. కేవలం ప్రజల ఆస్తులు, భూములు కొట్టేయడానికి ఆయన తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను అధికారంలోకి రాగానే చంద్రబాబు రద్దుచేశారన్నారు. పదిమందికి సాయపడిన వారి గురించి సాయం పొందిన వారితో పాటు ప్రజలు పదికాలాల పాటు చెప్పుకుంటారని, సిఎం ఒక మంచి ఆలోచనతో ప్రవేశపెట్టిన పీ 4 పథకంలో సంపన్నులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదకుటుంబాలను ఆదుకోవడంలో కేవలం ప్రభుత్వ సాయం మాత్రమే కాదని, మంచిఆలోచనలు మంచి విధానాలు నలుగురికి తెలియచేసి, వారి జీవితాలను బాగుచేయడం కూడా పీ 4 కిందికే వస్తుందన్నారు. ప్రధానమంత్రి , ముఖ్యమంత్రి పదవికంటే ఒక గ్రామ నాయకుడిగా ఊరిప్రజల మన్ననలు పొందడమే కష్టమన్నారు. తమ పనితీరుతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల్ని మెప్పించడం అంత తేలికైన విషయం కాదన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర నాయకత్వంలో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం సంతోషం కోసం పనిచేస్తోందని, డెయిరీ యాజమాన్యం పశుపోషకులకు అన్ని వేళలా అండగా ఉంటోందన్నారు. పాల ఉత్పత్తిదారులకు 7.84లక్షల విలువైన బోనస్ చెక్కుల్ని ప్రత్తిపాటి స్వయంగా పంపిణీ చేశారు. పాడిరైతు బండారు గోవింద్ ఇటీవల మరణించినందున అతని భార్య గోవిందమ్మకు సంగం డెయిరీ తరుపున 60వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు వీరారెడ్డి, సొసైటీ ఛైర్మన్ పోపూరి రాఘవయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, పోపూరి వెంకయ్య, పోపూరి శివరాం ప్రసాద్, కజ్జా కోటిరెడ్డి, పోపూరి రామారావు, పోపూరి రత్తయ్య, కల్లూరి శ్రీరాములు, హరిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కార్య నిర్వహణాధికారి నలబోతు మాధవిదేవి తెలియజేశారు. బుచ్చిపాపన్నపాలెం గ్రామానికి చెందిన గానుగపంట వీరారెడ్డి - విజయలక్ష్మిలు, వారి కుమార్తె అంజన హర్షితారెడ్డి రూ.1,00,116లను అందజేశారు. అదే విధంగా నరసరావుపేటకు చెందిన పూనూరి కోటిరెడ్డి - రమాదేవి దంపతులు వారి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి, కుమార్తె ప్రియాంకలు రూ.1,01,116లను చెక్కులను అందజేశారు. వారు అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి శేషవస్త్రాన్ని ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి అందించారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందజేస్తున్న భక్తులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందించే విరాళాలకు సంబంధించి ప్రభుత్వం ఆదాయపుపన్ను మినహాయింపును అందజేస్తుందని ఈవో మాధవిదేవి తెలియజేశారు.

## పల్నాడుకు గుర్రం జాషువా పేరు నామకరణం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు నాయకత్వంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. తెలుగుభాషకు, మన సంస్కృతికి గుర్రం జాషువా నిలువెత్తు నిదర్శనం అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదన వచ్చినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని ఖచ్చితంగా పరిగణలోకి తీసుకుంటుందన్నారు. భావితరాలకు గుర్రం జాషువా ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో అనేక పుస్తక రచనలు, కావ్యాలు రచించారని తెలిపారు. మహోన్నత కవి జాషువా అని పేర్కొన్నారు. మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా పేరు పల్నాడుకు పెట్టడం కనీస బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, బాదుగున్నల శ్రీనివాసరావు, కొరివి వినయ్‌కుమార్, చీతిరాల మీరయ్య, బాలాజీ, గోదా జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప ..సముదాయంలో అన్ని సమస్యలే!

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : పట్టణంలోని 26వ వార్డు పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్ప సముదాయంలో పారిశుద్ధ్యం, మంచినీరుతో పాటు అన్ని సమస్యలేనని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆదివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని నిర్వహించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌రోడ్డు, రామిరెడ్డిపేట, శృంగేరి శంకరమఠం, పెద్దచెరువులోని 25,26 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులకు ఒకసారి రాజీవ్ గృహకల్ప నివాసితులకు మంచినీరు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రతి ప్లాట్ నుండి మంచినీటి కోసం మాజీ కౌన్సిలర్ కుమారుడు రూ.200ల వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. నీటి నిమిత్తం కనీసం మోటార్ సైతం వేయడం లేదన్నారు. స్థానికులు నీరు అడిగితే బూతులు తిడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు అక్కడ బోరింగ్ పంపు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా పట్టణంలో ఎక్కడా చూసినా తాగి పడవేసిన బీర్ బాటిల్స్ దర్శనం ఇస్తున్నాయన్నారు. మరో వైపు రామిరెడ్డిపేటలో సన్నిధి ఫంక్షన్‌హాలు వెనుక డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణం మొత్తం దారుణంగా ఉందని, కనీస మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులకు మనస్సు రావడం లేదని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన ఉమ్మడి జిల్లా కార్యదర్శి

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకావారి సుబ్బరత్తమ్మ తనిఖీ చేశారు. గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ, సిబ్బందితో ఆమె మాట్లాడారు. పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాలలో పురాతన గ్రంథాలు, విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, సైన్స్ పుస్తకాలు, నిరుద్యోగులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుబ్బరత్తమ్మ సూచించారు. అదే విధంగా సెస్ బకాయిలను వసూలు చేయాలని తెలిపారు. గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ, సిబ్బంది పి.కోటేశ్వరి, వై.సునీల తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండలో విత్తన బంతులు

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : మండలంలోని కోటప్పకొండలో విత్తనబంతులు వెదజల్లే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సేవ్ ఎర్త్ - సేవ్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అడవి జంతువులు, వన్యప్రాణులు, పక్షుల ఆహార అవసరాలను తీర్చేందుకు ఈ సంస్థను డాక్టర్ జి.నాగిరెడ్డి కార్యక్రమం నిర్వహించడం సంతోషమన్నారు. కేంద్ర, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత ప్రకృతి ప్రకాష్, ఆలయ ఈవో చంద్రశేఖరరావు కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన జీవనంలో అడవులు అంతర్భాగమని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ వంటి జీవన ఆధారాలను అడవుల ద్వారానే అందించడం జరుగుతుందన్నారు. సేవ్ ఎర్త్ - సేవ్ లైఫ్ సంస్థ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా అభినందించారు.

## ఆర్యవైశ్య మెరిట్ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

నకరికల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త : పేద ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెనుగొండ వెంకటేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్, వాసవి మిత్రమండలి, మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం ఏర్పాటు చేయడం సంతోషమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, ఊరా భాస్కరరావు, అత్తులూరి సుబ్బారావు, టిడిపి సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.3 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అందజేశారు. సేవా సంస్థలు గత 15 సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం ఎంతో సంతోషమని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వం కూడా తమవంతు మద్దతు అందిస్తుందన్నారు. ప్రతి ఉన్న పేద విద్యార్థులు కేవలం ఆర్థిక సమస్యలతో చదువును ఆపివేయకూడదన్నారు. అన్నిస్థాయిలలో విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం చేస్తున్నామని తెలియజేశారు.

## శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షునిగా అంజయ్య

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షునిగా తొర్లకొండ అంజయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపిపి తొర్లకొండ మంగమ్మ - అంజయ్య దంపతులకు సభ్యులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర్, శ్రీనివాస్, కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేరాసి ఈశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కుల అభివృద్ధి, విద్య, ఆర్థిక అభివృద్ధి, సంఘం అభివృద్ధి చెందేందుకు సహకారం అందించాలన్నారు. నూతన అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో కుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండలు, రంగయ్య, రోశయ్య, వీరబ్రహ్మం, రమేష్, వెంకటఅప్పారావు, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్న వైఎస్సార్‌సీపీ

నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని, ఇటువంటి వైఖరి సమాజానికి కీడు చేస్తుందని తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య అన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రౌడీషీటర్లను జైల్లో పరామర్శించి ఎటువంటి సంకేతాలు ప్రజలకు పంపుతున్నారని ప్రశ్నించారు. తెలుగుదేశంపార్టీ నాయకులు అమాయక ప్రజలపై కేసులు పెడుతున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవం అన్నారు. పద్నాలుగు నెలల పాలనలో ఎక్కడా ఎవరిపై కేసులు పెట్టలేదన్నారు. అమాయకులు అని చెప్పున్న నిందతులపై గతంలో తొమ్మిది కేసులు ఉన్నాయన్నారు.

వాటిలో వైకాపా హయాంలోనే ఆరు కేసులు నమోదయ్యాయన్నారు. మర్డర్ కేసుతో పాటు హత్యాయత్నం కేసులు సైతం ఉన్నవారికి మద్దతు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ నాయకులు తమ వెంట రౌడీషీటర్లను తిప్పుకుంటూ వారే నాయకులు అని ప్రజలకు చూపించడం వారి నీచ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. గడిచిన 14 నెలల కాలంలో పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఎవరిపై తాము కేసులు పెట్టించలేదని గుర్తు చేశారు. ప్రకటనలు చేసే ముందు కనీస అవగాహనతో మాట్లాడాలని హితవు పలికారు. పోలీసులకు ప్రత్యేకంగా ఎవరిపై కేసులు పెట్టాలని చెపాల్సిన అవసరం లేదని, ఖచ్చితంగా నేరాలు చేసే వారిపై పోలీసుల నిఘా ఉంటుందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యంపరాల ఖాశిం సైదులు, మక్కెన ఆంజనేయులు, బండారుపల్లి విశ్వేశ్వరరావు, పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పలుకుతున్న లడ్డూ వేలం పాటలు



యడ్లపాడు, అగస్టు 31, ప్రభాతవార్త : గణపతి నవరాత్రులలో భాగంగా గణ నాధులు నిత్య పూజలందుకుంటున్నారు. ఇందులో భాగంగానే నిమర్జనానికి తరలిస్తున్నారు. ఇందులో ప్రధానంగా గణపతి వద్ద ఏర్పాటు చేస్తున్న లడ్డూ పాటలు అంచనాలకు మించి ధరలు పలుకుతున్నాయి. యడ్లపాడు గ్రామంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన కల్లూరి అదినారాయణ 1.1లక్ష, రెండవ లడ్డు బత్తుల జగదీష్ 31వేలకు పాడటం జరిగింది. యడ్లపాడులోనే మరో లడ్డు వేలం పాట 1.5లక్షలు పాడటం జరిగింది. అదేవిధంగా వంకాయలపాడు గ్రామంలోని గణనాధుని వద్ద జరిగిన వేలం పాటలో అడపాల శ్రీను 33వేలకు లడ్డూ వేలం పాట పాడటం జరిగింది. చెంఘీస్కాన్‌పేట గ్రామంలోని పోలేరమ్మ గుడివద్ద ఏర్పాటు చేసిన గణనాధుని లడ్డూ బశల గోపికృష్ణ 23వేలకు పాడటం జరిగింది. గ్రామాలలో ఘనంగా గణ నాదుల శోభాయాత్ర డప్పువాయిధ్యాలతో, భాణా సంచారాలతో నిర్వహించుతున్నారు.

## కోతముక్క ఆడుతున్న వారిపై దాడులు : పోలీసుల అదుపులో ఆరుగురు



యడ్లపాడు, అగస్టు 31, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలో అక్రమంగా కోత ముక్క ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం అరుగురిని అదుపులోకి తీసుకోవటం జరిగిందని, వారి వద్ద నుండి 14700నగదును స్వాధీనం పర్చుకోని వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామని ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఇలాంటి అక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## గోనుగుంట్లను సత్కరించిన కె.ఎన్.ఆర్.విద్యాసంస్థలు


రాజుపాలెం, ఆగస్టు 1 ప్రభాతవార్త : రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు విదేశీ పర్యటన ముగించుకొని సదేశానికి వచ్చిన సందర్భంగా కొండమోడు పి.ఎస్.ఆర్. డిగ్రీ కాలేజ్ నందు కళాశాల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు, అధ్యాపకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ముందుగా ఆయనకు కళాశాల యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ కె.ఎన్.ఆర్.విద్యాసంస్థలు తనను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కృష్ణమ్మ ఒడి చేరిన గణనాధుడు

అమరావతి, ఆగస్టు 31 ప్రభాతవార్త : పంచారామ క్షేత్రాలలో ప్రథమమైన శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వరస్వామి కొలువై ఉన్న క్షేత్రం ఒడ్డున కృష్ణానది ప్రవహిస్తుంది. ఐదు రోజులు పూజలందుకున్న గణనాధుని నిమజ్జనం నిమిత్తం తరలించారు. కృష్ణానదిలో నిమజ్జనం చేస్తే పుణ్యం లభిస్తుందని భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అమరావతి చేరుకొని కృష్ణానదిలో గణనాథుని నిమజ్జనం చేపట్టారు. 3వ రోజు పూజలు అందుకొని బొజ్జ గణపయ్య కృష్ణమ్మ ఒడిలో చేరారు. ధరణికోట సమీపంలో నిమజ్జనానికి స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పడవల ద్వారా నదిలోకి తీసుకువెళ్ళి నిమజ్జనానికి వచ్చిన గణనాధుని నిమజ్జనం చేస్తున్నారు. గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేశామని సి.ఐ. అచ్చయ్య తెలిపారు. యువత మద్యం సేవించకుండా నిమజ్జనానికి రావాలని నలుగురికి మించి పడవలో వెళ్లరాదని భక్తులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని, ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా చూడాలని సి.ఐ. అచ్చయ్య అన్నారు.

## మల్లేశ్వరరావు మాస్టారుకు ఘన సన్మానం

వినుకొండ,ఆగస్టు31,ప్రభాతవార్త: నూజెండ్ల మండలం పాతనాగిరెడ్డి జెడ్పి స్కూల్ నందు ఉపాధ్యాయులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన మేడూరి మల్లేశ్వరరావు మాస్టారుకు అభినందన సన్మాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విఎల్ఎస్ నందు జరిగిన ఈ కార్యక్రమానికి బి.వి నాగేశ్వరరావు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా వినుకొండ మండల ఎంఈవో జఫ్రుల్లా, నూజెండ్ల ఎంఈవో సత్యనారాయణలు హాజరై మల్లేశ్వరరావు మాస్టారును పూలమాలలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో 300 మందికి పైగా ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## 'స్త్రీశక్తి' మహాసభను జయప్రదం చేయండి

### - టీడీపీ సువర్ణ అధ్యాయాన్ని సృష్టించిన రోజు సెప్టెంబర్ 1

### -గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 31 ప్రభాతవార్తః పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులో సెప్టెంబరు 1వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు జరగబోయే స్త్రీశక్తి మహాసభకు మహిళలు అధికంగా తరలివచ్చి జయప్రదం చేయాలని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం తయన మాట్లాడుతూ టీడీపీ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని సృష్టించిన రోజు సెప్టెంబరు 1 అన్నారు. రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిన రోజు ఆనాడు హైదరాబాద్‌ను ఐటీకి కేరాఫ్‌గా మార్చిన హైటెక్ సిటి రూపకర్త, సైబరాబాద్ సృష్టికర్త, అమెరికా అధ్యక్షుడితో సహా ఆశ్చర్యపోయేలా హైదరాబాద్ సిటీ రూపురేఖలు మార్చిన అద్భుతాల శిల్పి, అభివృద్ధిలో నిరంతర శ్రామికుడు, రాజకీయ దురందరుడు, అవినీతి మచ్చలేని నాయకుడు, ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి నిలబడే నాయకుడు, కష్టకాలంలో ఒంటి చేత్తో టీడీపీని ముందుకు నడిపిన వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు 1995 సెప్టెంబర్ 1 అన్నారు. ఆ మరుపురాని ఘట్టంలో చిన్న వాడినైన తాను గురజాల శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయడం తన అదృష్టంగా బావిస్తున్నానన్నారు. అలాగే సెప్టెంబరు 1, 2013వ తేదీన విభజన వాదంతో తెరపైకి వచ్చిన ఉద్యమంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అగమ్మ గోచరంలో పడడంతో అవమానాన్ని అవకాశం మార్చుకొని ఆత్మ విశ్వాశాన్ని ఆయుధంగా మార్చుకొని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఆత్మ గౌరవ సభ ద్వారా చాటిచెప్పిన నిరంతర శ్రామికుడు చంద్రబాబునాయుడు అన్నారు. గురజాల నియోజకవర్గం పొందుగుల గ్రామం నుంచి ఆత్మగౌరవ యాత్రను మొదలుపెట్టారన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నోసారఉ్లు ఆత్మగౌరవయాత్రను ప్రస్తావించారని గుర్తు చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల అభివృద్ధికి రూపకల్పన చేశారన్నారు. గురజాల నియోజకవర్గంలో వరుసగా ఏడుసార్లు పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించడం పట్ల తాను అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. ఎన్టీఆర్ తనకు గురజాల శాసనసభ్యునిగా పోటీ చేసే అవకాశం కల్పించడం, ఆ తరువాత చంద్రబాబునాయుడు నాయకత్వంలో నడవడం అదృష్టగా బావిస్తున్నానన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు పుట్టించుకొని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి కోట్లు గడించారన్నారు. కూటమి ప్రభుత్వం వీటన్నింటిపై విచారణ జరుపుతుందన్నారు. పింఛన్ పెంపుదల, అన్నా క్యాంటిన్, స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత సిలిండర్లు అందిస్తున్నామన్నారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు బుద్ధి మార్చుకోవాలన్నారు. స్త్రీ శక్తి బహిరంగ సభకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ పార్లమెంట్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్‌బాబు, పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, సీనియర్ నేత బాబావలి, వడ్డపల్లి సర్వేశ్వరరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, పిల్లి చెన్నారావు, మాజీ కౌన్సిలర్ పనితి రవికుమార్, కాంతారావు, జనసేన నేతలు కటకం అంకారావు, రమేష్‌బాబు, బీజేపీ నేతలు డాక్టర్ వెంకయ్య, ఆత్మకూరి కాశీ తదితరులు పాల్గొన్నారు.



## రికార్డు ధర పలికిన గణేష్ లడ్డూ ప్రసాదం వేలం

గురజాల, ఆగస్టు 31 ప్రభాతవార్తః పట్టణంలోని రెడ్డిబండ సెంటర్ వద్ద కాకతీయ గణేష్ ఉత్సవ కమిటి (ఆర్ఆర్‌సీ యూత్) ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి నివేదించిన లడ్డు ప్రసాదానికి ఆదివారం వేలంపాట నిర్వహించారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో లడ్డు ధర పలికింది. రూ. 1,81,000లకు పోటు శ్రీకారం లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. పట్టణ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో లడ్డు ప్రసాదం ధర పలకడం ఇదే మొదటిసారి.



## మాన్‌సింగ్ నాయక్‌కు తెలుగుతేజం పురస్కారం

కారంపూడి, ఆగస్టు 31 ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహితీవేత్త, కవి, రచయిత బి.మాన్‌సింగ్‌నాయక్‌కు



తెలుగుతేజం పురస్కారం వరించింది. అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డా॥ కత్తిమండ ప్రతాప్‌కుమార్, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా నరసరావుపేట భువనచంద్ర హాలులో ఆదివారం జరిగిన తెలుగుభాషా దినోత్సవ వేడుకల్లో పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాన్‌సింగ్‌నాయక్‌ను పాఠశాల సిబ్బందితోపాటు మండల విద్యాశాఖాధికారులు, సంఘ సభ్యులు, భాషాభిమానులు అభినందనలు తెలిపారు.

## 'ప్రభుత్వ రాయితీతో విద్యుత్ అదనపులోడు పెంచుకోవచ్చు'

కారంపూడి, ఆగస్టు 31 ప్రభాతవార్త: గృహ విద్యుత్తు వినియోగదారులు తక్కువ లోడుతో విద్యుత్తు కనెక్షన్లు తీసుకొని అధికంగా వినియోగించడం వల్ల తరచుగా మీటర్లు ట్రిప్ అవుతున్నాయి. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లోడును పెంచుకునే అవకాశాన్ని మరోసారి కల్పించినట్లు విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు. 50 శాతం రాయితీతో వినియోగదారులు తక్కువ ఖర్చుతోనే లోడును పెంచుకోవచ్చన్నారు.

**డిసెంబరు 31 వరకు అవకాశం**

విద్యుత్తు వినియోగదారులు డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. గరిష్టంగా అయిదు కిలోవాట్ల లోడును పెంచుకునే అవకాశం ఉంది. ఇప్పటికే చాలామంది వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు.

**రుసుము వివరాలు:** లోడు పెంపు కోసం తీసుకునే అదనపు రుసుంపై ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. ఒక కిలోవాట్‌కు 2250 ఉండగా దానిలో సగం 1250 రాయితీ ఇస్తుంది. ఈ విధంగా వినియోగదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవచ్చు.

విద్యుత్తు ఏఈ వీరాంజనేయులు మాట్లాడుతూ... మండలంలోని ప్రతి వినియోగదారుడు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి. రాయితీతో వచ్చే ఈ అవకాశం వినియోగదారులకు బాగా ఉపయోగపడుతుందన్నారు.

## గణపతి ఉత్సవాల్లో భాగంగా 2న డాన్స్ బేబీ డాన్స్ పోటీలు

మాచర్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త: స్థానిక సీతారామ గణేష్ సేవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గణపయ్య శనివారం రాత్రి వనగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 2వ తేదీన మంగళవారం డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు ఒరుగంటి పురుషోత్తం, వాసవీదత్ తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు, మూడో బహుమతిగా రూ.2 వేలు ఉంటుందన్నారు. శ్రీకృష్ణ జనరల్ హాస్పటల్ ఎండీ డా॥ గుర్రం



రాజశేఖరరెడ్డి, ప్రతిభ, వికాస్ కళాశాలల నిర్వాహకులు, ఎస్ఎస్ డెంటల్ నిర్వాహకులు స్పాన్సర్లుగా ఆర్యవైశ్య సంఘం నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జానపద, కల్చరల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. సోలో డాన్స్, డ్యూయెట్ డాన్స్, గ్రూప్‌డాన్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. పోటీల్లో పాల్గొనే వారు 1వ తేదీలోపు పేర్లను ఇవ్వాలని తెలిపారు. వివరాలకు 9030428896, 9490332454 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలన్నారు.

## గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు

మాచర్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త: గుర్తు తెలియని మృతదేహానికి మాచర్ల స్వామి వివేకానంద



ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. దుర్గి మండలం అడిగొప్పల గ్రామ శివారు పంటపొలాల్లోని పాడుపడ్డ బావిలో గుర్తు తెలియని శవం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి దుర్గి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. నాలుగు రోజులైనా సంబంధికులు ఎవరూ రాకపోవడంతో దుర్గి ఎస్సై ఎల్.సుధీర్‌కుమార్ మాచర్లకు చెందిన స్వామి వివేకానంద ట్రస్టు ఫౌండర్, ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డికి తెలియజేయడంతో గుర్తు తెలియని శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులను ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో టీచర్ గంద్రకోట శివసుందరప్రసాద్, వినయ్, యశ్వంత్, సురేంద్ర, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో ఘనంగా వినాయకుని విగ్రహ నిమజ్జనాలు

మాచర్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త: వినాయక నిమజ్జన కార్యక్రమాలు మాచర్లలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కోలాహలంగా జరిగాయి. ఆదివారం అయిదో రోజు కావడంతో చాలా వరకు వినాయక విగ్రహాలను



భక్తులు నిమజ్జనం చేశారు. ముందుగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ట్రాక్టర్లలో, లారీలపై ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఊరేగింపులో డీజేలు, తీన్మార్లతో జైజై వినాయక అంటూ పట్టణ పురవీధులు హోరెత్తాయి. ఊరేగింపులో మహిళల కోలాలు, కుర్రాళ్ల డ్యాన్సులు అలరించాయి. మాచర్లకు సమీపంలోని కుడి కాలువలో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

## గణేష్ విగ్రహాల నిమజ్జనం

పెదనందిపాడు ఆగస్టు 31 (ప్రభాతవార్త) మండల కేంద్రమైన పెదనందిపాడు లావు వారి చెరువు కట్టపై . పెదనందిపాడు ఏకదంత యూత్ వారి ఆధ్వర్యంలో. మూడవసారి ఏర్పాటుచేసిన గణపతి కి గత ఐదు రోజుల నుంచి అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి విగ్రహాన్ని బాపట్ల సూర్యలంకలో నిమగ్నం చేసేందుకు. గ్రామ వీధులలో ఎలక్ట్రికల్ లైటింగ్లతో. భాజా భజంత్రీలతో



ఘనంగా ఊరేగించారు. ఈ వినాయక చవితి ఉత్సవాల లో. ప్రముఖులు రావి శివరామకృష్ణయ్య, ధూళి పాళ్ళమోహన్ రావు. వెలినేని శివయ్య, మచ్చ పున్నారావు, మచ్చ స్రవంతి, లక్ష్మీ మైత్రి.వెలినేని సునీత. వెంకాయమ్మ. దివి నాగరాజు. కొండపాటూరు నాగేశ్వరరావు.లావు సుబ్బారావు. తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషణకు ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి: పత్తిపాటి

పత్తిపాడు ఆగస్టు 31 (ప్రభాతవార్త). నియోజకవర్గ కేంద్రమైన పత్తిపాడు లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న నందమూరి తారక



రామారావు మెమోరియల్ రాష్ట్రస్థాయి పశు బల ప్రదర్శన పోటీలను .ఆదివారం మాజీ మంత్రి చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కామదేనువు లాంటి పశువుల పోషణకు. ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందజేసే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లానని. ఈ ఆలోచన మంచిదైనప్పటికీ. గత ప్రభుత్వం నిధుల లోటు చూపించి మన ప్రభుత్వాన్ని ఇబ్బందులు పాలు చేసిందని. ఈ సూచన పట్ల భవిష్యత్తులో చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతి రావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బొందలపాటి అమరేశ్వరి. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన తెలుగుదేశం . జనసేన. బిజెపి. కూటమి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ దాసరి రమేష్‌కు జాతీయ పురస్కారం

పత్తిపాడు ఆగస్టు 31. (ప్రభాతవార్త): పత్తిపాడు మండలం కొండెపాడు లోని డాక్టర్ దాసరి రమేష్ సదరన్ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ వారిచే ప్రతిష్టాత్మక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్



జాతీయ ప్రతిభా పురస్కారం ప్రదానానికి ఎంపికైనట్లుగా సంస్థ నిర్వాహకులు, గౌరవ అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణ రావు గారు మరియు సంఘ అధ్యక్షులు డా. నాగయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యా రంగంలో ఉపాధ్యాయులుగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు . ఈ పురస్కారాన్ని అందజేశారు. లాం గ్రామ పరిధిలో గల చలపతి విద్యా సంస్థల ప్రాంగణం లో డాక్టర్ దాస రమేష్ కు అధికారికంగా అవార్డు ప్రదానం చేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనోత్సవాలు

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఐదు రోజు ఆదివారం పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి గణపతులను నిమజ్జనోత్సవానికి తరలించారు. పొన్నూరు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచే కాకుండా చేబ్రోలు, గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద



ఎత్తున వినాయక విగ్రహాలను చేబ్రోలు కొమ్మమూరు కెనాల్‌కు తరలించారు. వివిధ ప్రాంతాల నుంచి వినాయకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపైకి వేంచేపుచేసి బాణా సంచా కాలుస్తూ, డప్పు విన్యాసాలు చేస్తూ, గులాములు చల్లుకొంటూ ఆనందంతో కేకలు వేస్తూ నిమజ్జనోత్సవానికి చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా భారీగా తరలి వచ్చి కాలువలో స్వామివారికి నిమజ్జనోత్సవం కానిచ్చి కాలువలో స్నానాలను ఆచరించి ఎవరి గమ్యస్థానాలకు వారు చేరారు. వివిధ ప్రాంతాల నుంచి చేబ్రోలు బ్రిడ్జి వద్దకు విగ్రహాలు రావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. గణపతి బప్పామోరియా....జై గణపతి....జైజై గణపతి...జై గణేష్ మహరాజ్‌కీ జై.....జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ పెద్ద పెట్టున భక్తుల నినాదాలు దారి పొడవునా మిన్నంటాయి. దీంతో చేబ్రోలు బ్రిడ్జి వద్ద రెండు వైపులా సుమారు కిలో మీటరు పొడవు వాహనాలు నిలిచిపోయాయి. పొన్నూరు రూరల్ సిఐ యాదల కోటేశ్వరరావు నేతృత్వంలో పొన్నూరు, చేబ్రోలు ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. నిడుబ్రోలు యూనియన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి కూడా ఆదివారం నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సంబంధించిన లడ్డూ, పలక, బలపం, గొడుగు తదితర వస్తువులకు వేలం పాటలు నిర్వహించారు. స్వామివారి వస్తువులను వేలంలో సొంతం చేసుకొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు.

## గురువు దైవంతో సమానం

**-చలపతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ వైవి ఆంజనేయులు**

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: గురువు దైవంతో సమానమని, అలాంటి గురువులను గుర్తించి, వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తున్న ఘనత సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్, కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులకే చెల్లుతుందని చలపతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ వైవి ఆంజనేయులు అన్నారు. గుంటూరులోని లాం చలపతి



ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవి ఆంజనేయులు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే గురువులు ఎక్కడైనా గుర్తింపుబడతారన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గురువు పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల చేష్టలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో చాలా మంది విద్యార్థులు వివిధ రకాల అవలక్షణాలకు బానిసలువుతున్నారన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంత కీలకమైందో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమైందన్నారు. చదువు ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. స్ప్లెల్టో ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించిన తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలపై అధికారం ఉన్నా, లేకున్నా తనవంతు పోరాటం చేస్తామన్నారు. స్ప్లెల్టో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య మాట్లాడుతూ స్ప్లెల్టో ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రతిభా అవార్డులను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం సంస్కృత అధ్యాపకులు, మధురకవి, ఆధ్యాత్మిక ప్రవచకులు ఎస్ఏటిఎస్ ఆచార్యను ఘనంగా సత్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 120మందికి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాన్వితులుగా హాజరైన డాక్టర్ కె.మోజస్, పి.రాణి శ్రీ అమృతవర్షిణి, డాక్టర్ కన్నా మాస్టార్, కాటూరి వెంకటేశ్వరరావు, జిపి రెడ్డి, ఎండి మున్ను, టి.మస్తాన్‌రావు, ఎంజివి రవీంద్రనాథ్, మాధవీలత, కెఆర్ శేషాద్రిరావు, ఎంఎ గఫార్, జి.జనార్ధనరెడ్డి, పి.జస్వంత్‌కుమార్ ప్రసంగించారు. స్ప్లెల్టో కార్యవర్గ సభ్యులు ఎన్‌విఎస్ రఘుప్రదీప్, కె.గోవిందరాజులు, మెడతోటి రాకేష్, కొండపల్లి విల్సన్, పి.ఎస్ ఆదిత్య, పిఆర్ రత్నకుమార్, డి.నాగమణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రహీం సాహెబ్‌కు ఘన సన్మానం



పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: స్థానిక ఆర్టీసి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న షేక్ రహీంసాహెబ్‌కు ఘన సన్మానం జరిగింది. తెలుగు బాషా దినోత్సవం సందర్భంగా నెల్లూరులో తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రహీంసాహెబ్‌ను సత్కరించారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా అచ్చ తెలుగు అనే కవితను వేదికపై తన స్వీయ గానంతో రచన చేసి ఆహుతులను అలరింపచేశారు. దీంతో రహీంసాహెబ్‌ను సంస్థ నిర్వాహకులు సత్కరించారు. పద్మశ్రీ బిరుదాంకితులైన కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా సన్మానాన్ని పొందారు. ఈ సందర్భంగా రహీంసాహెబ్‌ను పలువురు అభినందించారు.

## అవసరార్థులను ఆదుకోవడం మానవ ధర్మం

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: అవసరార్థులను ఆదుకోవడం మానవ ధర్మమని వాసవిక్లబ్ జోన్ ఛైర్మన్ కిషోర్ అన్నారు. స్థానిక నేతాజీనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మణికిషోర్‌కు వాసవిక్లబ్ తరపున రూ.13వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సేవా, స్నేహం అనే నినాదంతో వాసవిక్లబ్‌లు పనిచేస్తున్నాయన్నారు. ఆపదలో



ఉన్నవారిని ఆదుకోవడమే ధ్యేయంగా వాసవిక్లబ్ సభ్యులు పనిచేస్తున్నారన్నారు. సమాజాన్ని అన్ని రంగాలలో చైతన్యం చేయడంలో కూడా వాసవిక్లబ్‌లు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వాలు కూడా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోద్రేజ్ శివ, ఎవిఎం రూపేష్, కొమ్మూరు కస్తూరి, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, సాధు పూర్ణ, రాచపూడి మోహనరావు, వంశీకృష్ణ, పల్లపోతు గణేష్, పోలిశెట్టి విజయ్‌కుమార్ తదితరులున్నారు.

## మత సామరస్యానికి ప్రతీక వినాయక ఉత్సవాలు

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయని అంజుమన్ కమిటి మాజీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము) అన్నారు. స్థానిక ఇటింకపాడు రోడ్డులోని వైకాపా ట్రేడ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు వట్టిప్రోలు రంగారావు ఇంటి వద్ద



ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో మాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాము మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను వాడవాడలా, వీధి వీధిన నిర్వహించేందుకు కారణం బాలగంగాధర తిలక్ మహాశయుడన్నారు. బాలగంగాధర్ తిలక్ మొట్టమొదటిసారిగా వీధుల్లో ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేసి వినాయక ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారన్నారు. ఆయన పిలుపు మేరకు వినాయక చవితి ఉత్సవాలు ప్రతి వీధిలు, వాడవాడలా ఒక పండుగలాగా, తిరునాల లాగా జరుగుతున్నాయన్నారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు పాల్గొంటున్నారన్నారు. ఇది జాతీయ సమైక్యతకు నిదర్శనమన్నారు. అంజుమన్ కమిటి మాజీ అధ్యక్షుడు షేక్ మామును వట్టిప్రోలు రంగారావు దుశ్శాలువాలతో, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.


## రక్తదాన శిబిరం

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: పేదల వైద్యునిగా పేరుగాంచిన వైద్యుడు స్వర్గీయ డాక్టర్ నల్లమోతు రవీంద్రనాథ్ ఠాగూర్ ఐదవ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10గంటలకు రవి హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ ఠాగూర్ అభిమానులు, వైకాపా నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసిన వారము అవుతామన్నారు. రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వర్గీయ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘనమైన నివాళి ఇవ్వాలని రూత్‌రాణి కోరారు.

# జయ..జయ గణేషా!

### వాడవాడలా గణేష్ మహోత్సవాలు: శోభిల్లుతున్న మండపాలు





కొల్లిపర,అగష్టు 31 ప్రభాతవార్త: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విదు యృత్ కాంతులతో గణపతి మండపాలు శోభిల్లుతున్నాయి.వినాయకుని భక్తి గీతాలు మండల గ్రామాల్లో మారుమ్రోగుతున్నాయి.విగ్రహాల వద్ద మహిళలు,పిల్లలు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు.మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నామస్మరణతో మార్మోగుతున్నాయి. మండల కేంద్రం కొల్లిపరలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు.ఇదేవిధంగా కొల్లిపర బ్రహ్మణ ఐక్య వేదిక భవనం నందు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందివెలుగు పణి మాస్టరు,రమాదేవి దంపతులు,కల్వకుంట్ల వీరభద్రయ్య దంపతులు,పోగుల రామలింగేశ్వరశర్మ దంపతులు,పరాశరం జగన్నాధాచార్యులు దంపతులు,పావులూరు బోగేశ్వరరావు దంపతులు గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు.ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.విద్యుత్ దీపాలతో,ప్రసాదాల వితరణతో చవితి పందిళ్ళ వద్ద సందడి నెలకొంది.మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తూ సందడి చేసారు.

# వర్షపు జల్లులతో పంటలు కళకళ....

**దిగుబడులపై రైతుల ఆశలు...పంటలసాగుకు వెనుకాడకుండా పెట్టుబడులు..**

కొల్లిపర,ప్రభాతవార్త: వర్షపు జల్లులతో పంటలు కళకళలాడుతున్నాయి.గత నాలుగు రోజుల నుంచి మండలంలో వర్షాలు జల్లులు కురుస్తున్నాయి..మండలంలోని కొల్లిపర,వల్లభాపురం, మున్నంగి,పిడపర్రు,పిడపర్తిపాలెం,బొమ్మువానిపాలెం,దావులూరువారిపాలెం,తూములూరు గ్రామాల పరిధిలోని మెట్టప్రాంతాలలోపసుపు,కంద,అరటి పంటలు అధిక విస్తీరణంలో రైతులు సాగుచేపట్టారు.అన్నవరం,అన్నవరం గౌడపాలెం పంటపొలాలలో సుమారు 225 ఎకరాలు విస్తీర్ణం





కూరగాయలసాగు చేసినట్లు తెలిసింది.పసుపు ధరలు మరింత పెరగవచ్చని ఆశతో రైతులు మాత్రం క్రమం తప్పకుండా పసుపుసాగు చేస్తునే ఉన్నారు.కాలం కలిసి రాకపోతుందా..మరలా పసుపుకు మరింత మంచి ధరలు రాకపోతాయా...అదృష్టం పట్టకపోతుందా..అనే ఆలోచనలో పసుపు సాగుపై మక్కువ పెంచుకుని ఖర్చుకు వెనుకాడకుండా సాగు చేస్తున్నారు.ప్రస్తుతం ధరలు కాస్తంత అనుకూలంగా పలకటంతో రైతులు పసుపు పంటను పెంచటంపై మరింత దృష్టి చూపుతున్నారు.మరలా రాబోయే కొత్త పసుపు సీజన్‌నాటికి క్వింటా పసుపు ధర రూ.13 వేలకు పైగా వ్యాపారవర్గాల అంచనాగా ఉంది.ఇదిలా ఉంటే కూరగాయలు సాగుకు పెట్టింది పేరుగా నిలిచిన అన్నవరం,అన్నవరం గౌడపాలెం గ్రామాల పంట పొలాలలో కూరగాయలు వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయి.చిరుజల్లులకు రోజుకో విధంగా పంట స్వరూపాలు మారటంతో మంచి దిగుబడులు అందుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు.పండించిన కూరగాయలను చుట్టు ప్రక్కల పట్టణాలు అయిన తెనాలి,గుంటూరు,మంగళగిరి,విజయవాడ వంటి పట్టణాలకు తీసుకెళ్ళి రైతులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.కందసాగుకు ప్రస్తుత వాతావరం అనుకూలంగా ఉండటంతో పంట పెరుగుదల బాగుంది.వర్షాలకు కొత్తగా వేసిన అరటి పంట కూడా బాగా పెరిగి గెలలు వచ్చి మరో నెల రోజులలో మార్కెట్‌కు రావటానికి సిద్దంకాబోతున్నాయి.ఖరీఫ్‌లో వెద సాగుచేపట్టిన వరిసాగు వర్షపు జల్లులు పడటంతో ఏపుగా పెరుగుతుంది.ఏపుగా పెరగటంతో కొందరురైతులు ఇప్పటికే రెండవ దఫాగా ఎరువులు కూడా వేయటానికి సిద్దం అవుతున్నారు.మండలంలో ఈ ఏడాది వెద పద్దతిలోఅధిక శాతం విస్తీరణం వరిసాగు చేపట్టారు.ప్రస్తుతం ఉన్న వాతావరణానికి పంటలు బాగుండటంతో దిగుబడులు ఆశాజనంగా రావచ్చని రైతులు భావిస్తుస్తున్నారు.ఏదైనా పంటలు బాగుండి మంచి దిగుబడులు రావాలని..రైతుల లోగిళ్ళు నిండాలని..ఆనందమైన సంక్రాంతిని ప్రతి కుటు ంబం జరుపుకోవాలని కోరుకుందాం.

## కొనసాగుతున్న వరద..లంకవాసులు అప్రమత్తం

కొల్లిపర,అగష్టు 31 ప్రభాతవార్త: ప్రకాశం బ్యారేజీ నుండి 2 లక్షల 98 వేల క్యూసెక్కులు నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయటంతో మండల యంత్రాంగం అప్రమత్తం అయ్యారు.కొల్లిపర తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ లంకవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.మండలంలోని బొమ్మువానిపాలెం,కొల్లిపర,అన్నవరం గ్రామాల్లోని రేవులను రెవిన్యూ అధికారులు సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు.కృష్ణానదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసారు.పడవ నడిపే జాలర్లకు తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.పడవ నడిపే జాలర్లు తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

కొల్లిపర,అగష్టు 31 ప్రభాతవార్త: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు.మండలంలోని మున్నంగి,వల్లభాపురం,తూములూరు,కొల్లిపర గ్రామాలలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పంచాయతీ కార్మికులు రోడ్లను శుభ్రపరిచి.. బ్లీచింగ్‌ను చల్లించి గ్రామాల్లో దోమల నివాకరణ కొరకు మందులను పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ గ్రామాలలో మురుగునీరు నిల్వలేకుండా చూచుకోవాలన్నారు. పారిశుద్ధ్యం పట్ల గ్రామీణ ప్రజలు సహకరించాలన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల

తెనాలిటౌన్, ఆగస్టు 31చ ప్రభాతవార్త: పట్టణంలోని పినపాడు గ్రామములో,చెరువువద్ద ఆదివారం,నూతన "స్మార్ట్ రేషన్ కార్డుల" పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కార్డులు అందజేసిన స్థానిక శాసన సభ్యులు,రాష్ట్ర ఆహార,పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్.అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ,రాష్ట్రవ్యాప్తంగా ఒకకోటి నలభైఆరు లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించబో తున్నామని,సెప్టెంబర్ 15వ తేదీలోపు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి కార్డులు పంపిణీ పూర్తిచేస్తామన్నారు.గుంటూరు జిల్లాలో 5.85లక్షల మందికి తెనాలి నియోజకవర్గంలో 83వేలమందికి కార్డులు పంపిణీ చేయనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు మైలా సుధీర్ బాబు, షేక్ పీర్‌అహ్మద్,శ్యాం, బీజెపి నాయకులు మైలా హరికృష్ణ,ఇతర కూటమి నాయకులు,అధికారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో 4కోట్ల మందికి రేషన్ కార్డు సేవలు: మంత్రి మనోహర్

తెనాలి. ఆగస్టు 31చ ప్రభాతవార్త: నిజాయితీ లేని గత ప్రభుత్వ దుష్ట ప్రచారాలు నమ్మవద్దని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.పండుగ వాతావరణంలో ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం నందివెలుగులో మంత్రి నాదెండ్ల మనోహర్, గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా కోటి 46 లక్షల మందికి స్మార్ట్ కార్డ్ సేవలు అందిస్తున్నాము.తద్వారా రాష్ట్రంలోనే నాలుగు కోట్ల మందికి పైగా ప్రజలకు రేషన్ కార్డు సేవలు అందుబాటులోకి వస్తున్నాయి అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు పుష్కలంగా అందుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు.మహిళలకు దీపం2 పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం అందరికీ సిలిండర్ల సబ్సిడీ అందజేస్తున్నాము అని వివరించారు.ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నాం అన్నారు. అర్హులైన లబ్ధిదారులు గుర్తించే విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలన్నారు.

అందరం కలిసికట్టుగా పనిచేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామన్నారు.ప్రతి ఇంటికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. గత మూడు నెలలుగా 65 సంవత్సరముల పైబడిన వృద్ధులు, వికలాంగులకు ప్రతినెల ఐదు రోజులు ముందుగా వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేస్తున్నామన్నారు.సెప్టెంబర్ 15 లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తాం అన్నారు. కార్డులోని కోడ్ స్కాన్ చేస్తే లబ్ధిదారుడు ఎప్పుడు సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే ప్రభుత్వానికి చేరుతుందన్నారు.రాష్ట్రంలోని 29 వేల చౌక ధర దుకాణాల ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమలు ప్రజలకు అవసరాన్ని బట్టి పంపిణీ చేస్తున్నాం అన్నారు. ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967 ద్వారా సంప్రదించవచ్చు.పోర్టబులిటీ సౌకర్యం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులు పొందవచ్చు అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా స్మార్ట్ కార్డులను ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా అమలులోకి తీసుకొస్తున్నామని,అలాగే పెన్షన్లు రూ. 4వేలను అందించడం అనేది యావత్ దేశంలో ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతుందని,తల్లికి వందనం ద్వారా ఒకే రోజున రూ. పదివేల కోట్లను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు.

అన్నదాత సుఖీభవ ద్వారా దాదాపు రూ. 3,175 వేల కోట్లకు పైగా నగదు రైతులకు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని,వీటికి తోడు అభివృద్ధి ఎక్కడా ఆగకుండా అమరావతి, పోలవరం గాని, రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు గానీ చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.

ఎన్నికలకు ముందు మేము తెనాలి నియోజకవర్గం నందివెలుగులోకి రావాలంటే ఎంత ఇబ్బంది పడ్డామో మాకు,మనోహర్ కి బాగా తెలుసని,కానీ ఇవాళ రోడ్లు ఎలా ఉన్నాయనేది ఒకసారి అందరూ గమనించాలని,ఇలా అన్ని వర్గాలను మెప్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు కూటమినాయకులు, కార్యకర్తలు,పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# అభిమానుల ప్రేమ వల్లే ఈ రికార్డుల్ని సాధించా

**ఉఫ్ఫ్ యే సియాపా:** బాలీవుడ్ కథా కథనాన్ని ఒక కొత్త పంథాతో చెప్పబోతున్న బోల్డ్ సైలెంట్ కామెడీ. 40 సంవత్సరాల తర్వాత తిరిగి కమల్ హాసన్ నటించిన పుష్పక విమానం వలె, డైలాగులేని, నిజం చెప్పాలంటే డైలాగ్ అవసరపడని సినిమా. నాలుగైదు జనరేషన్స్ మిస్సయిన ఒక అద్భుతం. భారతీయ సినిమా ప్రయోగాలకు కొత్తేమీ కాదు, కానీ ప్రధాన స్రవంతి సినిమాకు, సంభాషణలకు ఉన్న అవినాభావ సంబంధం అందరికీ తెలిసిందే. అలాంటి సినిమా నుండి సంభాషణలు లేకుండా ధైర్యం చేయడం చాలా అరుదు. జి. అశోక్ దర్శకత్వం వహించి లవ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై లవ్ రంజన్, అంకుర్ గార్గ్ నిర్మించిన 'ఉఫ్ఫ్ యే సియాపా' నియమాలను తిరిగి రాస్తోంది. సెప్టెంబర్ 5 న విడుదల కానున్న ఈ డార్క్ కామెడీథ్రిల్లర్ డైలాగ్ లేకుండా ఒక కథని చెప్పడానికి ప్రయత్నం చేస్తోంది. పూర్తిగా హావభావాలతో, పర్ఫామెన్స్ ని ఆధారంగా తీసుకొని హాస్యంతో కూడుకున్న దృశ్య మాలికకు ఇండియా గర్వకారణమైన ఆస్కార్ విన్నర్ ఎ. ఆర్. రెహమాన్ యొక్క ఉత్తేజకరమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడం ఇంకా విశేషం. ఉఫ్ఫ్‌యే

## సెప్టెంబర్ 5న 'ఉఫ్ఫ్ యే సియాపా' విడుదల



సియాపా యొక్క కేసరి లాల్ సింగ్ (తుంబడ్ ఫేమ్ సోహుమ్ షా), అతని జీవితం గందరగోళంలోకి తిరుగుతుంది, పొరపాటున జరిగిన ఒక పార్సిల్ డెలివరీ, వరుస అపార్థాలు అతని ఇంటిని నేరస్థలంగా మారుస్తాయి. అతని భార్య పుష్ప (నుష్రత్ భరుచ్చ) అతను తమ పొరుగున ఉన్న కామిని (నోరా ఫతేహి)తో సరసాలాడుతున్నా డని అనుమానిస్తుంది,అలిగి పుట్టింటికి వెళ్ళిపోతుంది. ఆమె వెళ్లిన తరువాత అతని జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు ఎటువంటి ఆసక్తిని ఎంతటి హాస్యాన్ని కురిపిస్తాయి అన్నది మిగతా కథ.మాటలు మాట్లాడని చిత్రంలో, సంగీతం ప్రధాన దశకు చేరుకుంటుంది. ఎ. ఆర్. రెహమాన్‌కు, ఇది ఒక సవాలు, అవకాశం రెండూ. తన అనుభవాన్ని ప్రతిబింబిస్తూ, అతను ఈ చిత్రం గురించి ఇలా పంచుకున్నాడు.






### వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై నందమూరి బాలకృష్ణ

**నందమూరి నటసింహం** బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఆయన పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అరుదైన గౌరవానికి ఎంపికైన తొలి హీరో బాలకృష్ణనే కావడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం కల్పించినట్టుగా సీఈవో సంతోష్ శుక్లా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ బాలకృష్ణను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎపి ఐటీ మినిస్టర్‌నారా లోకేష్, సహజ నటి జయసుధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లోనే నందమూరి బాలకృష్ణ తెలంగాణ రాష్ట్రంలో వరదలకు అతలాకుతలం అయిన ప్రాంతాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి యాభై లక్షల ఆర్థిక విరాళాన్ని కూడా ప్రకటించారు.

కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ, నాకు ఇంతటి ధన్యమైన జన్మనుఇచ్చిన దైవాంశ సంభూతుడు, నా గురువు, నా దైవం నటరత్న, పద్మశ్రీ నందమూరి తారకరామారావు, నా తల్లి బసవతారకంకి ధన్యవాదాలు. ఈ రోజు ఈ కార్యక్రమానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి, ఎపి ఐటీ, ఎడ్యుకేషన్ మినిస్టర్ నారాలోకేష్‌కి, సహజ నటి జయసుధకి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సీఈఓ సంతోష్ శుక్లాకి, జాయింట్ సెక్రటరీ ఓలాకి, ఉస్మాన్‌కి కృతజ్ఞతలు. నేను ఇండస్ట్రీలో 50 ఏళ్ల సుదీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేశాను. అందరి సహాయ సహకారాలతో క్యాన్సర్ హాస్పిటల్‌ను నడిపిస్తున్నాను. నేను నా హిందూపురం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఎపిలోనూ ఫిల్మ్ ఇండస్ట్రీని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాను. నేను 13 ఏళ్ల వయసులోనే 'తాతమ్మ కల' మూవీ చేశాను. 50 ఏళ్లలో 110 చిత్రాలు చేశాను. నేను చిత్ర సీమకు చేసిన సేవకుగానూ ఈ గుర్తింపుదక్కడం ఆనందంగా ఉంది. నేను మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా సేవలందిస్తున్నాను. ఇవన్నీ నా దర్శక, నిర్మాతలు, కుటుంబ సభ్యులు, అభిమానులు అండగా నిలిచారు. కేంద్రం నుంచి రీసెంట్‌గా పద్మ భూషణ్ అవార్డు లభించింది. 'భగవంత్ కేసరి'కి ఉత్తమ జాతీయ తెలుగు చిత్రంగా అవార్డు వచ్చింది. నేను చేసిన 'అన్ స్టాపబుల్' షో అరుదైన రికార్డులు సాధించింది. ఈ జర్నీ ఇంకాకొనసాగుతూనే ఉంటుంది అన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, బాలకృష్ణకి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది. ఈ రోజు ఇలా బాలకృష్ణకి గౌరవం లభించడం తెలుగు వారికిగర్వ కారణం. బాలకృష్ణ ఇంకా ముమ్ముందు ఇదే జోష్‌తో కొనసాగాలని, ఎన్నెన్నో రికార్డులు సృష్టించాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను అన్నారు.

ఏపీ ఐటీ మినిస్టర్ నారా లోకేష్ మాట్లాడుతూ, చరిత్ర రాయాలన్నా? మళ్లీ తిరిగి రాయాలన్నా? అది కేవలం బాలయ్య బాబు వల్లే అవుతుంది. 50 ఏళ్లు సినిమా రంగంలో, రాజకీయాల్లో ప్రత్యేక స్థానంసాధించుకున్నారు. అన్‌స్టాపబుల్ షోతో దేశంలోనే అరుదైన రికార్డు క్రియేట్‌చేశారు. బాలయ్య ఎప్పుడూ అన్ స్టాపబుల్. ఆయనకు ఈ గుర్తింపు రావడం మనందరికీ గర్వకారణం అన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్ సీఈవో సంతోష్ శుక్లా మాట్లాడుతూ .. 'బాలకృష్ణ గారి గురించి గత కొన్ని రోజులుగా గూగుల్, యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటూనే ఉంటున్నాను. నేను ఈ రోజు ఆయన్ను కలిసిన తరువాత ఆయన గొప్పదనం ఏంటో అర్థమైంది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్‌లో ఆయన పేరు ఉండటం సంతోషంగా ఉంది అన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్ జాయింట్ సెక్రటరీ డా. ఓలా మాట్లాడుతూ ,చిత్ర సీమలో 50 ఏళ్లుగా హీరోగా చేసిన సేవలకు గుర్తింపుగా నందమూరి బాలకృష్ణ పేరుని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కించాం. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఆయన రికార్డులు సృష్టించారు. అలా ఆయన సినీ, పొలిటికల్, సోషల్ సర్వీస్ విషయంలో ఎన్నెన్నో రికార్డులున్నాయి. ఈ రోజు మేం ఆ సర్టిఫికేట్‌ను ఆయనకు అందిస్తుండటం సంతోషంగా ఉంది అని అన్నారు.

సహజ నటి జయసుధ మాట్లాడుతూ,నందమూరి బాలకృష్ణకు ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం, ఈ కార్యక్రమంలో నేను పాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. కేవలం నటుడుగానే కాకుండా ఆయన గొప్ప వ్యక్తి. ఆయన ఇంకా ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలి. ఇలాంటివెన్నో ఆయనకు రావాలి అని అన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ,బాలకృష్ణ హీరోగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం ఆనందంగా ఉంది. ఇది తెలుగు సినిమా ఇండస్ట్రీకి, తెలుగు వారికి గర్వ కారణంఅని అన్నారు.

గోపీచంద్ మలినేని మాట్లాడుతూ ,బాలయ్య బాబు ఈ 50 ఏళ్ల సినీ జర్నీలో నేను కూడా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. బాలయ్య బాబు 2.ఓని చూడబోతోన్నారు అన్నారు. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ,బాలయ్య బాబు ఎప్పుడూ రికార్డులు బ్రేక్ చేస్తుంటారు. ఆయన ఇలానే ఇంకెన్నో రికార్డులు బ్రేక్ చేస్తూ ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, బాలయ్య బాబు నిజంగానే ఓలెజెండ్. కష్టపడి పనిచేస్తూ వెళ్తుంటే.. ఫలితం వెనకాలే వస్తుందని కృష్ణ పరమాత్ముడు చెప్పారు. బాలయ్య ఎనర్జీ నాకు తెలుసు. ఆయన ఇంకెన్నో ఇలాంటి అవార్డులు, రివార్డుల్ని సాధిస్తారు అన్నారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ ,బాలయ్య బాబు ఎప్పుడూ ఫిల్టర్ లేకుండా ఉంటారు. ఆయన డాక్టర్ కాలేకపోయినా యాక్టర్‌గామారి ఎంతో మందికి వినోదం రూపంలో మెడిసిన్ ఇస్తున్నారు. ఆయనకు ఈ గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ,బాలయ్యకి పని చేస్తుండేటప్పుడు వేరే ప్రపంచంలోకి వెళ్తుంటాను. ఇలా బుక్ రికార్డులే కాదు.. రేపు వచ్చే మా'అఖండ 2'అన్ని రికార్డుల్ని చెరిపేస్తుంది. నా మ్యూజిక్‌కు బాలయ్య పునర్జన్మను ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. ఆయనతో పని చేస్తుంటే గుడికి వెళ్లినట్టుగా అనిపిస్తుందిఅని అన్నారు.

నందమూరి మోహన కృష్ణ మాట్లాడుతూ, సినీ రంగంలో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేసిన నా తమ్ముడు బాలకృష్ణకి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది. మా నందమూరి వంశానికి మకుటం మా నాన్న అయితే.. ఆ మకుటానికి వన్నె తెచ్చే కలికితురాయి మా బాలకృష్ణ. అతడిలా ఇంకెన్నో సాధించాలని కోరుకుంటున్నానుఅని అన్నారు.



## 'ఆర్‌వి ఫిల్మ్ హౌస్' బ్యానర్ 'కొక్కొరొకో' ప్రారంభం..

**ప్రముఖ దర్శక, నిర్మాత** రమేష్ వర్మ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు గానూ 'ఆర్‌వి ఫిల్మ్ హౌస్' అనే బ్యానర్‌ను స్థాపించారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ ప్రొడక్షన్ కంపెనీ మీద నిర్మిస్తున్న మొదటి ప్రాజెక్ట్ 'కొక్కొరొకో'ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముహూర్తపు షాట్‌కు నిర్మాత రేఖ వర్మ క్లాప్ కొట్టగా.. నిర్మాత కూరపాటి శిరీష కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రమేష్ వర్మ స్క్రిప్ట్‌ను దర్శకుడు శ్రీనివాస్ వసంతలకు అందజేశారు. ఈ మూవీతో శ్రీనివాస్ వసంతల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. వినూత్నమైన కథతో, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ అందించేలా శ్రీనివాస్ వసంతల ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ప్రముఖ స్క్రీన్ రైటర్ జి. సత్యమూర్తి కుమారుడు, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ సోదరుడు ప్రముఖ నేపథ్య గాయకుడు జివి సాగర్ ఈ మూవీకి సంభాషణలు రాసే బాధ్యతను స్వీకరించారు. తన తండ్రి వారసత్వాన్ని అనుసరించి 'రాక్షసుడు' తర్వాత రచయితగా రెండో ప్రాజెక్ట్‌ని సాగర్ చేపట్టారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆకాష్ ఆర్ జోషి, లండన్‌కు చెందిన ఒక యంగ్ అండ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ డైరెక్టర్‌గా సంకీర్తన్ పని చేయనున్నారు. ఈ చిత్రాన్ని రేఖ వర్మ, కూరపాటి శిరీష నిర్మాతలుగా, నీల్లాద్రి ప్రొడక్షన్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి పని చేయనున్నారు.ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లేను రమేష్ వర్మ స్వయంగా రూపొందించారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ బ్యానర్‌లో మొదటి చిత్రంగా తెలుగులో ఓ చక్కటి ఆంథాలజీ కానుందని, అద్భుతమైన విజువల్స్, మంచి ఎమోషన్స్‌తో 'కొక్కొరొకో'ని రూపొందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది .

# దుబాయిలో వైభవంగా గామా అవార్డ్స్

### ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ చిత్రంగా పుష్ప 2



**ప్రతిష్టాత్మమైన గామా అవార్డ్స్‌కు** టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగ రంగ వైభవంగా జరిగాయి. తాజాగా వైభవ్ జ్యువెలర్స్ సమర్పణలో 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్ లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో అతిరథ మహారథుల సమక్షంలో మరింత గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో టాలీవుడ్ పరిశ్రమ నుంచి పలువురు సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు గారు, సీఈఓ సౌరభ్ కేసరి గారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అత్యంత వైభవంగా ఈ అవార్డుల కార్య క్రమం ఘనంగా జరిగింది. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ. కోదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ దర్శకులు బి. గోపాల్ ఆధ్వర్యంలో వివిధరంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్‌కళాకారులకు, సినిమాలకు అవార్డ్స్ బహుకరించబడ్డాయి.

**గామా అవార్డు గ్రహీతలు:** బెస్ట్ యాక్టర్ 2024 – అల్లు అర్జున్ (పుష్ప2 ది రూల్). బెస్ట్ హీరోయిన్ – మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్), బెస్ట్ మూవీ –పుష్ప 2, బెస్ట్ డైరెక్టర్ – సుకుమార్ (పుష్ప 2),బెస్ట్ ప్రొడ్యూసర్ – అశ్విని దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ (కల్కి 2898ఎడి), బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ – దేవిశ్రీప్రసాద్ (పుష్ప 2), బెస్ట్ కొరియోగ్రఫీ : భాను మాస్టర్ (నల్లంచు తెల్లచీర.. మిస్టర్ బచ్చన్), బెస్ట్ ఎడిటర్ : నవీన్ నూలి (లక్కీ భాస్కర్), బెస్ట్ సినిమాటోగ్రఫీ : రత్న వేలు (దేవర),బెస్ట్ లిరిసిస్ట్ – రామ జోగయ్య శాస్త్రి, బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్: అనురాగ్ కులకర్ణి (సుట్టమలా సూసి.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి) బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ :మంగ్లీ (కళ్యాణి వచ్చావచ్చా.. ఫ్యామిలీ స్టార్) బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ క్రిటిక్ : సమీరా భరద్వాజ్ (నల్లంచు తెల్లచీర.. మిస్టర్ బచ్చన్) బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ : రజాకాం, బెస్ట్‌యాక్టర్ క్రిటిక్: తేజసజ్జా, బెస్ట్ పెర్ఫార్మన్స్ యాక్టర్ జ్యూరీ:రాజా రవీంద్ర (సారంగదరియా), బెస్ట్ యాక్టర్ జ్యూరీ :కిరణ్ అబ్బవరం (క), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్: రోషన్ (కోర్ట్), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్ ఫిమేల్ : శ్రీదేవి (కోర్ట్), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్ ఫిమేల్ : మానస వారణాశి,బెస్ట్ ఆస్పైరింగ్ డైరెక్టర్ : అప్సర్ (శివం భజే),గద్దర్ మెమోరియల్ మ్యూజిక్ అవార్డ్: మట్ల తిరుపతి,బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్: వినయ్‌రాయ్ (హనుమాన్),బెస్ట్ సపోర్టింగ్ పెర్ఫార్మన్స్ అవార్డ్ : హర్ష చెముడు (సుందరం మాస్టర్), బెస్ట్ సపోర్టింగ్ కామెడీ రోల్ : బాలిరెడ్డి పృథ్వీరాజ్, బెస్ట్ డెబ్యూ యాక్టర్ ఫిమేల్ : నయన్ సారిక (ఆయ్, క), బెస్ట్ డెబ్యూ యాక్టర్ జ్యూరీ : ధర్మ కాకాని (డ్రింకర్ సాయి), బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ : యదు వంశీ (కమిటీ కుర్రాళ్ళు), బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్ : నిహారిక కొణిదెల (కమిటీ కుర్రాళ్ళు), గ్లోబల్ కమెడియన్‌గా ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం గారు స్పెషల్ అవార్డును అందుకున్నారు.



## చంద్రహాస్ నూతన చిత్రం కాన్సెప్ట్ పోస్టర్ విడుదల

**ఆటిట్యూడ్ స్టార్** చంద్రహాస్ మొదటి చిత్రంలోనే తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు బరాబర్ ప్రేమిస్తా అంటూ ఆడియెన్స్‌ను మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక ఇప్పుడు చంద్రహాస్ నూతన చిత్రానికి సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ మేరకు సందీప్ కిషన్ ఈ కొత్త చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కాన్సెప్ట్ పోస్టర్ చూస్తుంటే ఇదేదో రెగ్యులర్ కమర్షియల్ చిత్రంలా కనిపించడం లేదు. ఈ కథలో దేశ భక్తికి సంబంధించిన అంశాల్ని కూడా జోడించినట్టుగా అనిపిస్తోంది. ఐదు రూపాయల బిళ్ల, వాటి చుట్టూ ఉన్న బుల్లెట్లు, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు చూస్తుంటే మంచి పవర్ ఫుల్ స్టోరీతోనే సినిమా రాబోతోందని అర్థం అవుతోంది. జైరామ్ చిటికెల ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రాన్ని పివికె ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. చంద్రహాస్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతోన్నారు.

# కంటెంట్ ఉన్న సినిమాలు రావాలి


### 'కానిస్టేబుల్' ట్రైలర్ ఈవెంట్‌లో డా.రాజేంద్ర ప్రసాద్

**జాగృతి మూవీ మేకర్స్** బ్యానర్ పై వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మించిన థ్రిల్లర్ చిత్రం 'కానిస్టేబుల్'.ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్ పేట్ లో ఎఎ మల్టీ ప్లెక్స్ థియటర్‌లో ఘనంగా జరిగింది.. సీనియర్ నటుడు డా: రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా: రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,గతంలో నేను కూడా పోలీస్ పాత్రలు చేశాను. అయితే ఆ పాత్రలు కామెడీ ప్రధానంగా సీరియస్ నెస్ సాగేవి. కానీ ఈ సినిమా కంటెంట్ నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. వరుణ్ సందేశ్ కూడా తన పాత్రలో ఒదిగి పోయి ఉంటాడని భావిస్తున్నానని అన్నారు. అతిథులు తెలంగాణ కల్చరల్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నటుడు శివారెడ్డిలు మాట్లాడుతూ, కంటెంట్ ఉన్న సినిమాలకు నేడు అధిక ప్రాధాన్య ఉంది. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలకే బ్రహ్మరథం పడుతున్నారు. పోలీస్ వారు మన భద్రతకు అహర్నిశలు ఎంత శ్రమ పడుతున్నారో మనకు తెలిసిందే. అలాంటి కథను సెలెక్ట్ చేసుకొని తీసిన ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, ఈ కథను డైరెక్టర్ ఆర్యన్ సుభాన్ నాకు చెప్పినప్పుడు కానిస్టేబుల్ క్యారెక్టర్‌ను ఊహించుకొని చెయ్యగలననే నమ్మకం ఏర్పడిన తరువాత ఈ సినిమా చెయ్యడం జరిగింది. తప్పకుండా మా అంచనాలను నిలబెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. చిత్ర నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, కంటెంట్‌ను నమ్మి ఈ సినిమా చేశాము.ఈ కథకు వరుణ్ సందేశ్ అయితే బాగుంటుందని ఆయన్ని సంప్రదించాము. ఒక వ్యక్తికి అవమానం జరిగినప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందో అనే అంశానికి సందేశాన్ని మిళితం చేసి ఈ సినిమాను చేశాము అని అన్నారు.దర్శకుడు ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ,మా అందరి కేరీర్‌ను మలుపుతిప్పే చిత్రమవుతుంది.వరుణ్ సందేశ్‌కు కూడా కమ్ బ్యాక్ చిత్రమవుతుంది అన్నారు.



# 'ఘాటి' లో అనుష్క విశ్వరూపం చూపించాం

### - ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి



**క్వీన్ అనుష్క శెట్టి** మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ...'కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. ఘాటి అలాంటి కథ. తూర్పు కనుమలు,ఆ పర్వత శ్రేణులు అక్కడ ఉన్న ఒక తీవ్రమైన భావోద్వేగాలు చాలా గట్టి మనుషులు గొప్ప మనస్తత్వాలు ఇవన్నీ కలగలిపి ఒక మంచి కథ చెప్పడానికి ఆస్కారం దొరికింది. నేను స్వీటీ వేదం సినిమాలో కలిసి పనిచేశాం. అందులో సరోజ పాత్రను పోషించింది. ఇప్పుడు ఘాటిలో శీలావతిగా మనందరి ముందుకు రాబోతుంది. ఘాటిలో కూడా చాలా ఎక్స్ట్రార్డినరీగా చేసింది. అనుష్క విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. ఈ కథ రాస్తున్నప్పుడే శీలావతి పాత్ర అనుష్క గారు చేయాలని నేను మా ప్రొడ్యూసర్ రాజీవ్ గారు సాయిబాబా గారు విక్రమ్ ప్రమోద్ వంశీ డిసైడ్ అయ్యాం. దేశిరాజు క్యారెక్టర్‌లో విక్రమ్ ప్రభుని ఊహించుకుని రాశాను. ఆయనే ఈ పాత్రకు తన సొంత వాయిస్‌తో డబ్బింగ్ చెప్పుకున్నారు. జగపతిబాబు గారి క్యారెక్టర్ ఈ సినిమాకి ఒక సూత్రధారిలాగా ఉంటుంది. ఇందులో యాక్షన్ సీక్వెన్స్ చాలా ఎక్సైటింగ్ గా ఉంటాయి. ఘాటి సినిమాలో ఒక అందమైన సోల్ ఉంది. ఆడియన్స్ ఆ సోల్ ని మనసులో నింపుకుని వెళ్తారు. సెప్టెంబర్ 5న తప్పకుండా అందరూ ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి అన్నారు.

యాక్టర్ జగపతిబాబు మాట్లాడుతూ.. అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు కానీ. ఈ సినిమాల్లో చాలా ఘాటుగా ఉండబోతుంది. అన్ని రియల్ లొకేషన్స్‌లో చేసిన సినిమా ఇది. దాదాపు ఒక 40 నిమిషాలకు రోడ్డు మీదే నిలిచి ఉండిపోయాం. అలాంటి లొకేషన్స్‌లో చేశాం. ఈ సినిమాలో నేను పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను. నేను క్రిష్ ఎప్పటినుంచో మంచి ఫ్రెండ్స్. ఫైనల్‌గా ఈ సినిమాతో కలిసి వర్క్ చేసాం. రాజీవ్ నిజాయితీఉన్న ప్రొడ్యూసర్. తన మాటంటేమాటే. ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అన్నారు.

హీరో విక్రమ్ ప్రభు మాట్లాడుతూ... ఘాటీ నా ఫస్ట్ తెలుగు సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ క్రిష్ గారికి, నిర్మాత రాజీవ్ గారికి ధన్యవాదాలు. దేశి రాజు క్యారెక్టర్‌లో నన్ను ఊహించుకొని రాయడం చాలా ఆనందాన్నిచ్చింది. రాజీవ్ చాలా జెన్యూన్ ప్రొడ్యూసర్. ఆయన టీం విజన్ చాలా అద్భుతంగా అర్థం చేసుకున్నారు. ఈ టీంలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సెప్టెంబర్ 5న ఘాటీ వస్తుంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.

యాక్టర్ చైతన్య రావు మాట్లాడుతూ.. ఘాటీ సెప్టెంబర్ 5న థియేటర్స్ లోకి రాబోతోంది. మన అందరి ఫేవరెట్ క్వీన్ అనుష్క చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్తో వస్తున్నారు. నాకు క్రిస్ గారు అంటే చాలా ఇష్టం. క్రిస్ గారి సినిమాలో ఒక అద్భుతమైన పాత్ర చేయడం కల నెరవేరినట్లు అయింది. నాక్యారెక్టర్ ని స్క్రీన్ మీద చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. జగపతి బాబు గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. విక్రమ్ చాలా వైవిధ్యమైన సినిమాల చేస్తుంటారు. సెప్టెంబర్ 5న ఘాటి థియేటర్స్ లోకి వస్తుంది. సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కాబోతోంది.

ప్రొడ్యూసర్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. ఘాటిలో అనుష్కని రియల్ క్వీన్‌గా చూస్తారు. విక్రమ్ గారు అద్భుతమైన పర్ఫామెన్స్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగమైన జగపతిబాబు గారికి చైతన్యకి ధన్యవాదాలు. చాలా అద్భుతమైన సినిమా చేశాము. ఈ సినిమాపై మేమందరం చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. సెప్టెంబర్ 5న థియేటర్స్‌లో కలుద్దాం అన్నారు.

# భారత్‌పై ఆంక్షలు విధించండి..

## ఐరోపా యూనియన్‌ను కోరిన అమెరికా



**బ్రస్సెల్స్, ఆగస్టు 31:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను కోరినట్లు సమాచారం. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపి వేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం. భారత్ నుంచి చమురు, సహజ వాయువు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని, అమెరికా తరహాలో ఆంక్షలు విధించాలని శ్వేత సౌధం కోరినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయని పక్షంలో రెండో దశ సుంకాలను విధించాలని కూడా సూచించినట్టు సమాచారం. తమపై 50 శాతం సుంకం విధించడాన్ని భారత్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనాను వదిలి తమపై సుంకాలు విధించడం ఏంటని భారత్ ప్రశ్నిస్తోంది. ఐరోపా దేశాలు కూడా రష్యా సహజవాయువును కొనుగోలు చేస్తున్న తీరును భారత్ లేవనెత్తింది. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్న ట్రంప్ ప్రయత్నాలకు కొందరు ఐరోపా నేతలు బహిరంగంగా మద్దుతు పలుకుతూ తెర వెనుక మాత్రం పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని శ్వేత సౌధం భావిస్తోంది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా మండిపడుతున్నా ఐరోపా దేశాలు మాత్రం మౌనం వహించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు బహిరంగంగా ఎలాంటి మద్దతు ప్రకటించలేదు. 'ఐరోపా నేతల విషయంలో శ్వేత సౌధం సహనం నశిస్తోంది' అని ఓవల్ ఆఫీసు ఉన్నతాధికారి ఒకరు కామెంట్ చేశారు. మరింత మెరుగైన డీల్ కోసం వేచి చూడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడిని తెర వెనక ఉండి ఐరోపా దేశాలు ప్రోత్సహిస్తున్నట్టు వైట్ హౌస్ వర్గాలు భావిస్తు న్నాయి. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొనేందుకు చైనాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా, రష్యా అధ్యక్షు లతో ప్రత్యేకంగా చర్చలు జరిపే అవకాశం ఉన్న ట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో ట్రంప్ సుంకాలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రధాన అంశాలుగా ఉండనున్నాయని సమాచారం.



## భారత్ క్వాడ్‌సదస్సుకు ట్రంప్ డుమ్మా..

### తాజా పరిణామాల నేపథ్యంలో మనసు మార్చుకొన్న అమెరికా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్న నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాలు మరింత సంచలనంగా కలిగించాయి. భారత్‌లో పర్యటించాలన్న ప్లాన్‌ను ట్రంప్ తాజాగా పక్కన పెట్టేసినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సెప్టెంబర్-డిసెంబర్ మధ్య కాలంలో క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ గతంలో ప్రధాని మోదీకి చెప్పారట. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్లాన్స్‌ను పక్కన పెట్టేశారట. అయితే, ఈ విషయమై అటు అమెరికా, ఇటు భారత్ స్పందించలేదు. త్వరలో భారత్ వేదికగా క్వాడ్ కూటమి శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇక ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అమెరికాలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ప్రతిష్టంభన నెలకొందని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల సంబంధాలు కూడా తిరోగమనంలో ఉన్నాయని పేర్కొంది. భారత్, పాక్ మధ్య రాజీ కుదిర్చానన్న ట్రంప్ ప్రకటనతో వివాదం ముదిరిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. 'తనే రాజీ కుదిర్చానని ట్రంప్ పదే పదే చెప్పడం ప్రధాని నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. ట్రంప్ తీరుతో మోడీ సహనం నశిస్తోంది' అని తెలిపింది. ఇక కెనడాలో ఇటీవల జరిగిన జీ7 సమావేశాలకు అటు ట్రంప్ ఇటు ప్రధాని మోదీ ఇద్దరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య సమావేశం కూడా జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ అత్యవసరంగా అమెరికాకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీతో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ కాల్‌లో మాట్లాడారట. ఈ సందర్భంగా భారత్‌పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోమని ప్రధాని మోడీ స్పష్టం చేసినట్టు తెలిసింది. నోబెల్ ప్రైజ్‌కు పాక్ తనను నామినేట్ చేస్తున్న విషయాన్ని కూడా ట్రంప్ ఆకాల్‌లో పేర్కొన్నారని, భారత్ కూడా ఇదే చేయాలన్న పరోక్ష సూచనచేశారని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. ఈ కారణంగా ఇరు నేతల మధ్య ఎడం పెరిగినట్టుతెలిపింది. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి అమెరికా ఇంతవరకూ స్పందించలేదు.

# మహాకూటమి సిఎం అభ్యర్థిని నేనే..

## రాహుల్, అఖిలేష్ సమక్షంలోనే ప్రకటించిన తేజస్వి



**పాట్నా,ఆగస్టు 31:** బీహార్‌లో మహా ఘట్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి తానే అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఆరా జిల్లాలో 'ఓట్ అధికార్ యాత్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవేదికపై రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉన్నా తేజస్వి వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. సీఎం అభ్యర్థిని తానేనంటూ తేజస్వీ యాదవ్ వారి సమక్షంలో ప్రకటించగా వారు మాత్రం చప్పుడు చేయలేదు. ముఖ్యంగా రాహుల్ గాంధీ మాత్రం దీనిపై నోరు మెదపలేదు. అలాగే నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీదే పైచేయి అని తెలిపారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా, ఒరిజినల్ ముఖ్యమంత్రి కావాలా అంటూ ఆరాలో జరిగిన ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడతూ తాను ప్రకటించిన సంక్షేమ పథకాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తు న్నారని ఆరోపించారు. ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోందని ఎద్దేవాచేసారు. ఈ సభలోనే ప్రజలను ఓ సూటి ప్రశ్న అడిగారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా? అంటూ ప్రశ్నించారు. అలాగే మహా ఘట్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిని తానేనని తేజస్వి మరోసారి నొక్కి చెప్పారు. అయితే రెండోసారి చెప్పినప్పుడు కూడా రాహుల్ గాంధీ మౌనంగానే ఉండిపోయారు. బీహార్‌లో ఆర్జేడీదే కీలక పాత్ర పోషిస్తోంది. బీహార్‌లో కాంగ్రెస్ కంటే ఆర్జేడీ పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేజస్వీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే తమ పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. తేజస్వీ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సమక్షంలోనే ఆయన ఈ కామెంట్లు చేయగా వీరిద్దరూ నోరు మెదపకపోవడం గమనార్హంగా నిలిచింది. ముఖ్యంగా తేజస్వీ యాదవ్ మొదటి నుంచీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూనే వస్తున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లేనని మరి 75 ఏళ్ల సీఎం అవసరమా అంటూ వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్ సీఎం పదవి నుంచి తొలగిపోవాలంటూ పదే పదే డిమాండ్ చేశారు.



## దేశ భద్రతపై రాజీపడుతున్న ప్రధాని మోడీ

### జిన్‌పింగ్‌తో మోడీ భేటీపై కాంగ్రెస్‌నేత ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలుచేస్తోందని ఆయన ఆక్షేపించారు.

## యుపిఎస్‌సి మెరిట్ అభ్యర్థులకోసం 'ప్రతిభాసేతు' పోర్టల్

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** మెరిట్ జాబితాలో అవకాశం పొందలేకపోయిన ప్రతిభావంతుల కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోడీ వెల్లడించారు. వేలాది మంది సివిల్స్ ఆశావహ అభ్యర్థుల ప్రతిభకు ఇదొక వారధి లాంటిదని ప్రశంసించారు. యుపిఎస్‌సిలో ప్రిలిమ్స్, మెయిన్స్ అన్నీ క్లియర్ చేసినప్పటికీ తుది జాబితాలో అవకాశం చేజార్చుకున్న వారికి రెండవ ఛాన్స్ ఇచ్చేందుకు ఈ టాలెంటెడ్ పోర్టల్ ఉపకరిస్తుందని సివిల్స్ అభ్యర్థులకు ఇదొక ఆశాకిరణమని ఆయన అభివర్ణించారు. 125వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షలలో ఒకటైన సివిల్ సర్వీసెస్ పరీక్షను యూపీఎస్సీ (యుపిఎస్‌సి) నిర్వహిస్తుంది. ఎంత ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ పరిమిత అవకాశాల కారణంగా ఏటా వేలాది మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు సాధించలేక పోతున్నారు. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, శ్రమ, డబ్బు వెచ్చిస్తారు. ఏళ్ల తరబడి కఠినంగా శ్రమించి విజయపు టంచులకు చేరినప్పటికీ చివరి క్షణాల్లో ఎందరో ప్రతిభావంతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. అదే 'ప్రతిభా సేతు'. మన్ కీ బాత్ 125వ ఎడిషన్‌లో ప ప్రతిభా సేతు గురించి ప్రస్తావించారు. ఇందులో యూపీఎస్సీలో వివిధ పరీక్షల్లో అన్ని దశల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను సేవ్ చేస్తుంది. అర్హత గల అభ్యర్థుల వివరాలను ప్రతిభా సేతు పోర్టల్‌లో నమోదు చేస్తారు. తుది మెరిట్ జాబితాలో చోటు సంపాదించలేని వారి వివరాలను ప్రైవేట్ కంపెనీలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ పోర్టల్ లోని సమాచారం ఆధారంగా కార్పొరేట్ కంపెనీలు భారీ జీతాలు ఇచ్చి సివిల్స్ అభ్యర్థులకు కొలువు ఆఫర్ చేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు.

# నేను బతికే ఉన్నా..

## సోషల్‌మీడియా వైరల్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. కొన్ని రోజులుగా ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో మొదలైన ఊహాగానాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే, శనివారం ఉదయం ఆయన వైట్‌హౌస్‌లో ప్రత్యక్షమవ్వడంతో ఈ పుకార్లన్నీ అబద్ధమని తేలిపోయింది. ఐదురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశం తర్వాత ట్రంప్ మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. దీనికి తోడు, వారాంతంలో అధ్యక్షుడికి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు లేవని వైట్‌హౌస్ షెడ్యూల్ విడుదల చేయడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి హ్యాష్‌ట్యాగ్‌లు ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. ట్రంప్ ఆరోగ్యంపై రకరకాల కుట్ర సిద్ధాంతాలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8:45 గంటల సమయంలో ట్రంప్ వైట్‌హౌస్‌లో కనిపించారు. తెల్లటి పోలో షర్ట్, నల్ల ప్యాంటు, ఎర్రటి మాగా టోపీ ధరించి, తన మనవరాళ్లు కై ట్రంప్, స్పెన్సర్ ఫ్రెడరిక్ ట్రంప్‌లతో కలిసి వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో ఉన్న తన గోల్ఫ్ క్లబ్‌కు బయలుదేరారు. దీంతో ఆయన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని స్పష్టమైంది. అంతకుముందు కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. అమెరికా వాణిజ్య విధానాలకు సంబంధించి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. అన్ని టారిఫ్‌లు ఇంకా అమలులోనే ఉన్నాయి. పక్షపాతంతో కూడిన కోర్టు వాటిని తొలగించాలని చెప్పినా, అంతిమంగా అమెరికానే గెలుస్తుంది. ఈ సుంకాలను ఎత్తేస్తే దేశానికి పెను నష్టం జరుగుతుందని ఆయన పోస్ట్ చేశారు. ఇదే సమయంలో డైలీ కాలర్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ రీగన్ రీస్ కూడా ఈ వదంతులను ఖండించారు. నేను నిన్న మధ్యాహ్నం అధ్యక్షుడితోనే ఉన్నాను. ఆయన్ను గంటపాటు ఇంటర్వ్యూ చేశాను. ఆయన చనిపోయారని లేదా అనారోగ్యంతో ఉన్నారని ప్రచారం జరగడం ఆశ్చర్యంగా ఉందని ఆమె తెలిపారు. మొత్తానికి, ట్రంప్ ప్రత్యక్షం కావడంతో ఈ వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది.

## సరిహద్దు వివాదాలతో మరుగునపడిన పంచశీల ఒప్పందం



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌చైనా సంబంధాల గురించి చర్చ వచ్చినప్పుడల్లా 'పంచశీల ఒప్పందం' ప్రస్తావనకు వస్తున్నది. 'హిందీచీనీ భాయ్ భాయ్' నినాదాలతో స్నేహానికి ప్రతీకగా మొదలైన ఈ ఒప్పందం, చివరికి రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీయడం ఒక చారిత్రక విషాదం. సుమారు 70 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఒప్పందం వెనుక ఎన్నో ఆశలు, రాజీలు, ఆ తర్వాత తీవ్ర పరిణామాలు ఉన్నాయి. 1954లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాలో పర్యటించారు. మావో జెడాంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ దేశాన్ని సందర్శించిన తొలి కమ్యూనిస్టేతర నేత నెహ్రూనే. తన కుమార్తె ఇందిరా గాంధీతో కలిసి చైనాకు వెళ్లిన ఆయనకు చైనా ప్రభుత్వం అపూర్వ స్వాగతం పలికింది. బీజింగ్, షాంఘై వంటి నగరాల్లో పర్యటించిన నెహ్రూ.. అమెరికా, సోవియట్ యూనియన్ కూటములతో సంబంధం లేకుండా ఆసియా దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య కొత్త స్నేహానికి నాంది పలుకుతుందని ఆయన బలంగా విశ్వసించారు. నెహ్రూ పర్యటనకు రెండు నెలల ముందు, అంటే 1954 ఏప్రిల్ 29న, టిబెట్ ఒప్పందంలో భాగంగా భారత్‌చైనా మధ్య పంచశీల ఒప్పందం కుదిరింది. భారత రాయబారి ఎన్. రాఘవన్, చైనా ప్రతినిధి చాంగ్ హన్‌ఫు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒకరి సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను మరొకరు గౌరవించుకోవడం. పరస్పరం దురాక్రమణలకు పాల్పడకపోవడం. ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకపోవడం. సమానత్వం, పరస్పర ప్రయోజనాల కోసం పనిచేయడం. శాంతియుత సహజీవనం. అయితే, ఈ ఒప్పందంలో భారత్ ఒక చారిత్రక రాజీకి తలొగ్గాల్సి వచ్చింది. టిబెట్‌ను చైనాలోని టిబెట్ ప్రాంతంగా అంగీకరించి, దానిపై చైనా సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించింది. శాంతి మంత్రంలా కనిపించిన ఈ ఒప్పందం వెనుక చర్చల సమయంలోనే తీవ్ర భేదాభిప్రాయాలు తలెత్తాయి. ముఖ్యంగా హిమాలయాల్లోని వ్యాపార, యాత్రా మార్గాల విషయంలో చైనా మొండిగా వ్యవహరించింది. భారత్ ప్రతిపాదించిన పలు సరిహద్దు మార్గాలను తిరస్కరించింది. లడక్‌లోని డెమ్‌చోక్ మార్గాన్ని చేర్చాలన్న భారత అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ ఒప్పందం 1962 జూన్‌లో ముగిసింది. ఆ తర్వాత కొద్ది నెలలకే అక్సాయి చిన్, మెక్‌మహాన్ లైన్ వంటి సరిహద్దు ప్రాంతాలపై వివాదాలు ముదిరి రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి దారితీశాయి. దీంతో పంచశీల సూత్రాలు కాగితాలకే పరిమితమై, ఇరు దేశాల సంబంధాల్లో తీవ్రమైన అపనమ్మకానికి బీజం పడింది.



## నిశ్చితార్థంకోసం రమ్మని వరుడిని చితకబాదిన వధువు కుటుంబీకులు

### చికిత్సపొందుతూ వరుడు మృతి

**ముంబయి, ఆగస్టు 31:** మహారాష్ట్రలోని పూణేలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో తమ అమ్మాయిని వలలో వేసుకున్నాడనే కోపంతో ఓ కుటుంబం ఘోరానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పింప్రి చించ్వాడ్ లోని సాంఘ్వి ఏరియాకు చెందిన ఓ యువతి స్థానిక యువకుడు రమేశ్ ఘెంగాత్ ను ప్రేమించింది. ఈ విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. రమేశ్‌పై రేప్ కేసు నమోదైందని, పోస్కో కేసులోనూ నిందితుడని కూతురుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూతురు పట్టువిడవకపోవడంతో గత్యంతరం లేక పెళ్లికి ఒప్పుకున్నారు. పెళ్లి కుదుర్చుకునేందుకు రమ్మంటూ రమేశ్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చిన రమేశ్‌ను యువతి కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రేమ పేరుతో తమ కూతురును వలలో వేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన యువతి కుటుంబ సభ్యులు రమేశ్‌ను గదిలోకి లాక్కెళ్లి చితకబాదారు. తీవ్ర గాయాలతో రమేశ్ స్పృహ తప్పడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రమేశ్ మరణించాడు. రమేశ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు 9 మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదు



**నయారాయ్‌పూర్, ఆగస్టు 31:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పై కేసు నమోదు చేశారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారంటూ అమిత్‌షా పై మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో మహువాపై కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రాయ్‌పుర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఆ నాయ కుడు పేర్కొన్నాడు. 1971 సమయంలో రాయ్‌పుర్ లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేక మంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని తెలిపాడు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణా నగర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.

## టేకాఫ్.. అంతలోనే తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇండోర్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. విమానం కుడి ఇంజిన్‌లో మంటలు రేగినట్లు సూచన అందుకున్న పైలట్ ఆ విమానాన్ని వెంటనే ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీకి తిరిగొచ్చిన విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని అధికారులు చెప్పారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించామని ఎయిరిండియా అధికారులు తెలిపారు. ఆగస్టు 31న ఢిల్లీ నుంచి ఇండోర్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగొచ్చింది. కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది. ప్రామాణిక విధానాన్ని అనుసరించి, కాక్‌పిట్ సిబ్బంది ఇంజిన్‌ను ఆపేయాలని నిర్ణయించుకుని ఢిల్లీకి తిరిగొచ్చారు.

## విమానం గాల్లో ఉండగా టాయిలెట్లలో సమస్య..



**కాన్‌బెర్రా, ఆగస్టు 31:** బాలి నుంచి బ్రిస్బేన్‌కు వెళ్తున్న విమానంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్లతో సమస్య తలెత్తడంతో ప్రయాణికులకు నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. వర్జిన్ ఆస్ట్రేలియా బోయింగ్ (737 మాక్స్ 8) విమానం గురువారం మధ్యాహ్నం బాలిలోని డెన్‌పసర్ విమానాశ్రయం నుంచి బ్రిస్బేన్‌కు బయల్దేరింది. టేకాఫ్ తర్వాత అందులోని పలు టాయిలెట్లలో సమస్య ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. మొత్తం ఆరు గంటలు కాగా మొదటి మూడు గంటలు ప్రయాణికులు ఒక్క బాత్రూమ్‌నే వినియోగించుకున్నారు. మూడు గంటల తర్వాత అందులో కూడా సమస్య తలెత్తడంతో నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాలని విమానసిబ్బంది ప్రయాణికులకు సూచించారు. దీంతో ప్రయాణికులు విమాన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# రష్యానుంచి కొనుగోళ్లు.. ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్న భారత్

## 'నాఫ్టోరైనోక్' గణాంకాల జాబితా విడుదల



**క్యీవ్, ఆగస్టు 31:** ఉక్రెయిన్‌రష్యా యుద్ధం నేపథ్యం లో భారత్ వైఖరిని అమెరికా నిందిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ పై పోరాడేందుకు అవసరమైన డబ్బును ఆ దేశానికి అందిస్తోందని అమెరికా కన్నెర్ర చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికే అదనపు సుంకంతో కలిపి భారత్ పై 50 శాతం సుంకాలు విధించింది. ఈ నేపథ్యంలో, అత్యంత ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. భారత్ ఒకవైపు రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తూనే, మరోవైపు అదే చమురును శుద్ధి చేసి యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు అతిపెద్ద డీజిల్ సరఫరాదారుగా నిలిచింది. అమెరికాలోని కొందరు విమర్శిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థకు, సైనిక అవసరాలకు భారత ఇంధనమే కీలకంగా మారింది. ఉక్రెయిన్‌కు చెందిన చమురు మార్కెట్ విశ్లేషణ సంస్థ 'నాఫ్టోరైనోక్' విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 జులై నెలలో ఉక్రెయిన్‌కు అత్యధికంగా డీజిల్ సరఫరా చేసిన దేశంగా భారత్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ నెలలో ఉక్రెయిన్ వినియోగించిన మొత్తం డీజిల్‌లో 15.5 శాతం వాటా భారత్‌దే కావడం గమనార్హం. సగటున రోజుకు 2,700 టన్నుల డీజిల్‌ను భారత్ నుంచి ఉక్రెయిన్ దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు ఉక్రెయిన్‌కు భారత డీజిల్ ఎగుమతులు 10.2 శాతానికి పెరిగాయి. 2024లో ఇదే కాలంలో ఇది కేవలం 1.9 శాతంగా మాత్రమే ఉంది. భారత్ నుంచి శుద్ధి చేసిన ఈ డీజిల్ రొమానియా, తుర్కియే దేశాల ద్వారా ఉక్రెయిన్‌కు చేరుతోంది. యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉక్రెయిన్ నగరాలు, రవాణా వ్యవస్థ, యుద్ధ క్షేత్రాలు నడవడానికి ఈ ఇంధన సరఫరా అత్యంత కీలకంగా మారింది. భారత్‌తో పాటు స్లొవాకియా, గ్రీస్, తుర్కియే, లిథువేనియా వంటి దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఇంధనాన్ని అందిస్తున్నాయి. అయితే, అమెరికాలోని ట్రంప్ కార్యవర్గానికి చెందిన పీటర్ నవారో వంటి కొందరు, రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. కానీ, అదే రష్యా చమురుతో నడుస్తున్న ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. గతంలో అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్, వెనిజులా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసిన భారత్, ఇప్పుడు రష్యా విషయంలో కూడా అదే పనిచేస్తే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఎయిర్‌ఫోర్స్‌కు రెండు తేజాస్ జెట్ విమానాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** తేజస్ యుద్ధ విమానాల డెలివరీలో జాప్యం జరుగుతోందంటూ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ నెలాఖరు కల్లా రెండు తేజస్ ఎమ్‌కే1ఏ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఎయిర్‌ఫోర్స్‌కు అందజేయనుంది. ఈ విషయాన్ని డిఫెన్స్ సెక్రెటరీ ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ఆ తరువాత మరో 97 తేజస్ యుద్ధ విమానాల డెలివరీకి ఎయిర్ ఫోర్స్‌తో హెచ్ఏఎల్ ఒప్పందం కుదుర్చుకుంటుందని కూడా తెలిపారు. పూర్తిస్థాయి వెపన్స్ (ఆయుధాలు) ఇంటెగ్రేషన్‌తో ఈ రెండు తేజస్ యుద్ధ విమానాలు డెలివరీ అవ్వొచ్చని అన్నారు. ఇప్పటికే హెచ్ఏఎల్, ఎయిర్‌ఫోర్స్ మధ్య యుద్ధ విమానాల డెలివరీకి ఒప్పందం ఉంది. అయితే, విమానాల తయారీలో జాప్యంపై ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

1-9pg6exHMNWJQE 10_1-9pg6exHMNWJQE.qxd 8/31/2025 11:59 PM Page 1



## 3 నుంచి శ్రీకాళహస్తీశ్వరుని పవిత్రోత్సవాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదివారం ప్రకటించారు.ఈ మేరకు శుక్రవారం అధికారులు, సిబ్బంది పవిత్రోత్సవాలకు స్వామి అమ్మవార్లకు అలంకారాల్లో ప్రత్యేకతకు ఈ ఏడాది లాకర్లోని ఏడు వారాల నగలను బయటకు తీయనున్నట్లు వివరించారు.. ప్రతి ఏడాది పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకునిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ పూజలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది.

## శేషవాహనంపై లంబోదరుడి దరహాసం



**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సర్వాలాంకృతుడైన స్వామివారు ఉభయదేవేరులతో కలసి ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామ పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44 బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాదుల కమ్మవ ఒశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు వేద పండితుల మంత్రఘోష నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్ బాబు,ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయడు, చిట్టిబాబు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధునికి వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం





**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరిగిన చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన కమ్మవ ఒశస్థులు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు.

## చిన్నశేషవాహనంపై శివపుత్రుని చిద్విలాసం

**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సర్వాలాంకృతుడైన స్వామివారు ఆలయ మాడా వీధుల్లో ఉభయదేవేరులతో కలసి చిన్నశేషవాహనంపై అధిరోహించి భక్తులకు అభయ హస్తం అందించారు. ఉదయం ఉత్సవ ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు వేద పండితుల మంత్రఘోష నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు దేదీప్యమానంగా అలంకరించిన చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.





దాతలకు దుర్గమ్మవారి మెమొంటో అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మ ఆలయానికి విరాళాల వెల్లువ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గమ్మ వారి ఆలయానికి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున విరాళాలు సమర్పించారు. నిత్యాన్నదాన పథకానికి రు.1,00,111ల విరాళాన్ని విజయవాడకు చెందిన పి సుబ్బలక్ష్మి పేరిట వారి కుమార్తు నాగేశ్వరమ్మ దంపతులు, కుమార్తె మమత శ్రీరంగ తరపున రు.1,00,001ల విరాళాన్ని ఉచిత ప్రసాదపంపిణీ కోసం అందించారు. ఆయా దాతలకు, వారి కుటుంబ సభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి మెమొంటో, ప్రసాదం,





మంచుమనోజ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఇఓ శీనా నాయక్

శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. శివశంకర్, కోడలు విజయదుర్గ కామేశ్వరి లు అధికారులకు అందించారు. ఇక ఉచిత ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన కెవి లక్ష్మి నరసింహ శాస్త్రి, పద్మావతి దంపతులు, వారి కుమారుడు కెవి సునీల్‌చంద్ర, కెవి ఫణిశ్రీ లు రు.1,00,001ల విరాళాన్ని అందించారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి కనకదుర్గ, కావ్య,సుధీర్ కుమార్ లు రు.1,00,116ల విరాళాన్ని అందించారు. అదేవిధంగా గుంటూరు జిల్లా కొత్తూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతుల పేరిట రు.1,00,001ల విరాళాన్ని అందించారు. గుంటూరుకు చెందిన తేగెల రవీంద్రబాబు, దా

**దుర్గమ్మను దర్శించుకున్న మంచు మనోజ్:** దుర్గమ్మవారిని సినీ నటుడు మంచు మనోజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## వైఎస్ జగన్‌కు ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఫోన్..

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో మాజీ సిఎం, వైఎస్సార్ సిపి అధినేత వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఫోన్ చేసి మద్దతు కోరగా,జగన్ తన నిర్ణయాన్ని ఆయనకు స్పష్టంగా తెలియచేశారు. ఇప్పటికే ఎన్డీఏ నాయకులు తమతో సంప్రదించారని, ముందుగానే వారికి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చామని జగన్ తెలిపారు. అంతేకాకుండా వ్యక్తిగతంగా సుదర్శన్‌రెడ్డిని ఎంతో గౌరవిస్తాను. ఆయన న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అపారమైన సేవలందించారు. కానీ,మేము ముందే ఎన్డీఏకు మాట ఇచ్చినందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అలాగే ఈ విషయంలో అపార్థం చేసుకోవచ్చని, తన నిర్ణయాన్ని అన్యథాభావంగా తీసుకోవద్దని జగన్ విజ్ఞప్తి చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఆయన స్పష్టమైన ధోరణి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# నేడు సిఎం రాజంపేటకు రాక

## అన్నమయ్య జిల్లాకు చంద్రబాబు వరాలు ప్రకటించేనా?



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాజంపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు అన్నమయ్య జిల్లాలో పర్యటించనున్నారు. రాజంపేట మండలం బోయినపల్లిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం వస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజంపేట నియోజకవర్గంలో మొదటిసారి పర్యటిస్తున్నారు. దీంతో జిల్లాలోని రాజంపేట తో పాటు పక్కనే ఉన్న రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలు సీఎం చంద్రబాబు ఈ ప్రాంతానికి వరాలు ప్రకటిస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు కూటమి నేతగా చంద్రబాబు పలు హామీలను ప్రకటించారు. అందులో ప్రధానంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని చంద్రబాబు స్పష్టమైన హామీ చేశారు. మదనపల్లె జిల్లా చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారని, రాజంపేటలో జిల్లా కేంద్రం చేయకపోతే ప్రజలు తిరుగుబాటు చేసే పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటికే రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగుతోందని, అందరి మనోభావాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. తాజాగా జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లా సెంటిమెంట్ మరింత బలంగా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు వైఖరి ఎలా ఉంటుందనేది సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. రాజంపేట కేంద్రంగా జిల్లా ప్రకటిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు రాజంపేట జిల్లా కేంద్రంగా చేయాలని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గస్థాయి ఏకగ్రీవ తీర్మానం చేసి సీఎంకు అందజేస్తామని పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు ప్రకటించారు. మరోవైపు జిల్లా కేంద్రం సాధన కోసం ఏర్పడిన కమిటీ ఆందోళన లో భాగంగా ఇప్పటికే 4000 పోస్టు కార్డులను మంత్రివర్గ సభ్యులకు పంపారు. ఇకపోతే కడపతో పాటు అన్నమయ్య, తిరుపతి జిల్లాల రైతాంగానికి వరప్రసాదిని అయిన గాలేరు నగిరి ప్రాజెక్టు రెండో దశ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రాష్ట్రంలోనే ఉద్యానవన పంటలకు ప్రసిద్ధిగాంచిన రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలం. అయితే ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాజంపేటలో ఏపీఐఐసీ ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ క్లస్టర్ ఉన్నా కూడా పరిశ్రమలు లేవు. అన్నమయ్య ప్రాజెక్టు వరదల్లో కొట్టుకుపోయిన తర్వాత పునర్నిర్మాణం చేస్తామని ప్రకటించి నిపుణుల కమిటీని నియమించారు. నిపుణుల కమిటీనివేదిక సిద్ధమైంది. ప్రభుత్వానికి కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. దీనిపై కూడా ఇంకా స్పష్టతరాలేదు. దశాబ్దాలుగా రైల్వే కోడూరు రైతాంగం డిమాండ్ చేస్తున్న కోల్డ్ స్టోరేజ్ కి దిక్కు లేదు. రాజంపేట రైల్వేకోడూరు నియోజవర్గాలకు సోమశిల వెనుక జలాలను మళ్లించినట్లయితే బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి.దీనిపై కూడా ప్రతిపాదనలు ఉన్నా ఇంతవరకు ఎలాంటి ప్రయత్నం జరగలేదు. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటకు ఎలాంటి వరాలు ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాల రద్దీ

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** డిగ్రీ ప్రవేశాల కౌన్సిలింగ్‌లో కళాశాలల నుంచి సైతం రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వడంతో కొన్ని కళాశాలలకు భారీగా ధరఖాస్తులు వస్తున్నాయి. దీంతో వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎక్కువ సమయం పడుతోంది.

ఈ ఏడాది డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు విద్యార్థులు నేరుగా నమోదు చేసుకోవడంతో పాటు కళాశాలల నుంచి ప్రవేశాలు పొందేందుకు అవకాశం కల్పించారు. విజయవాడ లోని సిద్ధార్థ కళాశాలలకు సుమారు 1,330 వరకు ధరఖాస్తులు వచ్చాయి. విభాగాల వారీగా ప్రత్యేకంగా అధ్యాపకులు,కంప్యూటర్లను ఏర్పాటు చేసి నమోదు చేయిస్తున్నారు. డిగ్రీ ప్రవేశాలు ఎక్కువగా ఉండే కళాశాలల వద్ద ఈ పరిస్థితి నెలకొంది.

కౌన్సిలింగ్‌లో రిజిస్ట్రేషన్ గడువు సెప్టెంబరు ఒకటితో ముగుస్తుంది.తిరుపతి లోని పద్మావతి మహిళా డిగ్రీ పీజీ కళాశాలకు సుమారు 2వేల వరకు ధరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సిబ్బందికి కొంత ఇబ్బందిగా మారింది.ఒక్కో విద్యార్థి వివరాల నమోదుకు 20 నిముషాలకు పైగా సమయం పడుతోంది.

అందరి వివరాలను నమోదు చేయలేక నేరుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కొంతమంది విద్యార్థులకు సిబ్బంది ఫోన్లు చేసి చెబుతున్నారు.

## బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌సహా 44 మంది నిందితుల అరెస్టు

### 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదు జప్తు

### చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీచోరీ కేసులో వీడిన మిస్టరీ



చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీ చోరీ కేసులో నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా.

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సంచలనం రేపిన ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు ఎస్‌బిఐ 2లో వెలుగు చూసిన భారీ చోరీ కేసులో బ్యాంకు మేనేజర్, క్యాషియర్ సహా 44 మంది నిందితులను అ రెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 15.237 కిలోల బంగారంతో పాటు 1.61 లక్షల రూపాయల నగదును జప్తు చేశారు. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. చెన్నూరు ఎస్‌బిఐ 2 బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న రవీందర్ కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా అనేక మందికి బాకీ పడడం, ఈ క్రమంలో బ్యాంకులో ప్రజలు దాచిన బంగారు నగలను ఇదే ప్రాంతంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసు కుని, వాటిని కూడా పందాలు కాసి నిండా మునగడం తెలిసిందే. దీంతో పాటు బ్యాంకులోని కోటి పది లక్షల రూపాయల నగదు కూడా ఇతను సొ ంత అవసరాలకు వాడుకోవడం విదితమే. తన అక్రమాలు వెలుగు చూడకుండా వుండేందుకు తనకు తెలిసిన ఖాతాదారుల నుంచి వడ్డీకి డబ్బులు, బంగారు నగలు తీసుకుని లాకర్లలో వుంచేవాడు. అయితే పది రోజుల క్రితం రవీందర్ నాలుగు రోజుల సెలవుపై వెళ్లి పారిపోవడం, మేనేజర్ మనో హర్ రెడ్డి కూడా పత్తా లేకుండా పోవడంతో ఎనిమిది రోజుల క్రితం జరిగిన ఆడిటింగ్‌లో ఈ భారీ చోరీ రట్టయ్యింది. 2024 అక్టోబర్ నెల నుంచే ఈ బ్యాంకు క్యాషియర్ నరిగే రవీందర్ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో నష్టపోయి బ్యాంకులో ఖాతాదారుల నగలను మరో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో వారికి తెలియకుండా తాకట్టు పెట్టి అక్కడ తీసుకున్న డబ్బులతో మళ్లీ పందాలు కాసీ మరోదఫా కూడా నష్టపోయాడు. ఇతను మొత్తం మీద 40 లక్షల రూ పాయలకు పైగా నష్టపోయాడు. ఈ క్రమంలో ఇతను బ్యాంకులో 402 మంది తనఖా పెట్టిన 25.17 కిలోల బంగారు నగలు, 1.10 లక్షల రూపాయల నగదును తన అవసరా లకు వాడుకున్నాడు. అయితే ఇందుకు మేనేజర్ మనోహర్ రెడ్డితో పాటు మరో ఉద్యోగి సహకరించాడు. అయితే బ్యాంకు అంతర్గత ఆడిటింగ్‌లో ఈ గోల్ మాల్ వెలుగు చూడడంతో చెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టి పరారీలో వున్న క్యాషియర్ రవీందర్‌ను మహారాష్ట్రలో అరెస్టు చేసి విచారించగా మొత్తం వ్యవహారం రట్టయ్యింది. దీని తరువాత మేనేజర్ మనోహర్ రెడ్డి ఇతర నిందితులు కొంగండి బీరేష్, నరిగే సరిత, నరిగే స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎనపల్లి సాయి కిరణ్, సందీప్, మోత్కూరి రమ్యలతో పాటు మరో 32 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బ్యాంకులో కాజేసిన 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదును జప్తు చేశారు. అయితే మరో 20 శాతం నగలు ఇంకా జప్తు కావాల్సి వుందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలి పారు. ఈ కేసులో పక్కాగా వ్యవహరించిన చెన్నూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్, చెన్నూరు సిఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గంగులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం

### ఆకారం పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటుందనుకోవడం పొరపాటు

### నేను బాడీషేమింగ్ గురించి మాట్లాడితే వివాదాస్పదమవుతుంది: గంగుల





**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చ సందర్భంగా బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఒకదశలో బాడీ షేమింగ్ వరకు పోయింది. బిసి రిజర్వేషన్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..గంగుల కంటే ఎక్కువ చదువుకున్నా.. రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి ఉన్నా.. నాకు ఎక్కువ తెల్వదు అనుకుంటే పొరపాటు.. నేను ఏమంటున్న అంటే.. ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటది అనుకుంటే పొరపాటన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పందించారు. నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రా వర్సీ అవుతదన్నారు. తాను కేవలం ఒక్కటే అడగుతు న్నానని.. శాస్త్రీయంగా బిసి రిజర్వేషన్లు కల్పించాలని.. రాజ్యాం గపరంగా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి జీవో పాస్ చేయడానికి 20 నెలలు ఎందుకు టైమ్ వేస్ట్ చేశారని.. ఈ పని అప్పుడే చేసి, ఎన్నికలకు వెళ్ళాల్సింది కదా అని గంగుల కమలాకర్ అన్నారు. మార్చి 2024లో జీవో నెంబర్ 26ను బిసి కమిషన్ ద్వారా తీసుకొచ్చారు.. ఆ తర్వాత బిసి కమిషన్ కాస్త మాయమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బిఆర్‌ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి కాదని... బహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఈ బిల్లు తీసుకొచ్చి ఆ తర్వాత జీవో ఇచ్చి బిసిలకు అన్యాయం చేయొద్దని.. షెడ్యూల్ 9లో బిసి రిజర్వేషన్లను చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. బిసి బిల్లు అమలును తమిళనాడు తరహాలో శాస్త్రీయంగా చేయాలని.. అశాస్త్రీయంగా చేస్తే బీహార్, మధ్య ప్రదేశ్, యూపీ రాష్ట్రాల్లో ఫెయిల్ అయినట్లుగా అవుతుందన్నారు.



## జనసేన వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

### మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** పదకొండేళ్ల రాజకీయ ప్రయాణంలో జనసేన పార్టీ, దాని అధినేత పవన్ కల్యాణ్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని వైసిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తన అవసరానికి అనుగుణంగా రాజకీయాల్లో స్టాండ్ మార్చే పవన్ కల్యాణ్ ఐడియాలజీ ఆయన్ను నమ్మి పార్టీలో చేరిన వారికే అర్థం కావడం లేదన్నారు. లెఫ్టిజం, రైటిజం, సెంట్రలిజం అన్ని కలిపి పవనిజం అని పేర్కొన్నారు. 2017లో సుగాలి ప్రీతి హత్య జరిగితే, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆధారాలు ఎలా తారుమారు అవుతాయని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, అమిత్ షాలు తనకు అత్యంత సన్నిహితులని చెప్పుకుంటున్న పవన్ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వారిని ఎందుకు ఒప్పించడం లేదన్నారు. కేంద్రం ప్రత్యేక ప్యాకేజిలో భాగంగా ఇచ్చిన రూ.11,400 కోట్లు ఒక జేబులో నుంచి తీసి మరో జేబులో పెట్టుకున్న చందంగా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌లో 14 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉంటే, కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం 4 వేల మందికి ఉద్వాసన పలికిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. త్వరలో మరో 2 వేల మందిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన వారిలో ఉద్యోగాలు లభించని 8 వేల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్లాంటుకు చెందిన కీలకమైన విభాగాల్లో 32 విభాగాల ప్రైవేటీకరణకు టెండర్లు ఆహ్వానించారని, ఇవి కూటమి ప్రభుత్వ నిర్ణయాలేనని పేర్కొన్నారు.

## దేశంలో విచారణ పెండింగ్ సిబిఐ కేసులు 7,072

### సివిసి వార్షిక నివేదిక విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశంలో కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ నమోదుచేసిన అవినీతికేసుల్లో ఇప్పటికీ 7072 కేసులు విచారణపరంగా పెండింగ్‌లో ఉఆననయి. వాటిలో 379 కేసులు 20 ఏళ్లకుపైగా నమోదయిన కేసులని కేంద్ర విజిలెన్స్‌కమిషన్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. మొత్తం కేసుల్లో 1506 కేసులు మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. 791 కేసులు మూడేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉంటే 2115 కేసులు ఐదేళ్లనుంచి పదేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని సివిసిస్పష్టంచేసింది. మొత్తం 2281 ఇలాంటి అవినీతికేసులు పదేళ్లనుంచి 20 ఏళ్లుగా విచారణలో పెండింగ్‌లో ఉన్నాయి. 2024 డిసెంబరు 31వ తేదీనాటికే 7072 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 2660 కేసులు పదేళ్లకుపైబడి విచారణలో పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. నివేదికప్రకారంచూస్తే 13,100 కేసుల్లో అప్పీళ్లు, రివిజన్లు అటు సిబిఐ, ఇటు నిందితులు దాఖలుచేసినవి కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవన్నీ వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులోనే ఉన్నాయి. 20 ఏళ్లకుపైబడిన కేసులు 606వరకూ ఉనానయి. 1227 కేసులు 15ఏళ్లకుపైబడి, 2989 కేసులు పదేళ్లనుంచి 15 ఏళ్లలోపు విచారణలోపెండింగ్‌లో ఉన్నాయి. 4059 కేసుల్లో ఐదేళ్లనుంచి పదేళ్లలోపు విచారణకు రాని కేసులు ఉన్నట్లు తేల్చింది. రెండేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉన్న కేసులు 1778 కాగా రెండేళ్లలోపు పెండింగ్ ఉన్న కేసులు 2441 కేసులుగా ఉన్నాయని తెలిపారు. 644 కేసుల్లో తీర్పులు వచ్చాయని, 392 కేసుల్లో శిక్షపడిందని, 154 కేసుల్లో నిందితులు విడుదలకాగా 21 మందిపై ఉన్న అభియోగాలు డిశ్చార్జిచేసారు. మరో 77 కేసులు ఇతర కారణాలదృష్ట్యా కొట్టివేసినట్లు సివిసి తెలిపింది. 2023లో కేసులపరిష్కారం 71.47శాతం కాగా 2024లో 69.14శాతంగా ఉంది. 2024లో 11,384 కోర్టుకేసులు అవినీతిలేని, అవినీతికేసులు వివిధకేసుల్లో విచారణకురానివి ఉన్నాయని సివిసి తెలిపింది. 2024లో సిబిఐ 807 కేసులు నమోదుచేసిందని, వీటిలో 674 రెగ్యులర్‌కేసులు, 133 కేసులుప్రాథమిక దర్యాప్తుకు సంబంధించినవిగా సివిసి వెల్లడించింది. 2024 డిసెంబరునాటికి సిబిఐ 529 కేసులు రిజిస్టరుచేసిందని, అవన్నీ దర్యాప్తు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో 56 కేసులు ఐదేళ్ల పెండింగ్‌లో ఉంటే 60కిపైగా కేసులు మూడేళ్లు, 64కేసులు ఐదేళ్లకుపైబడి, 108 కేసులు ఏడాది నుంచి రెండేళ్లలోపు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 241 కేసులు ఏడాదిలోపు విచారణపెండింగ్‌లో ఉన్నట్లు సివిసి తెలిపింది. కేసునమోదుచేసిన ఏడాదిలోగా సిబిఐ దర్యాప్తుపూర్తిచేయాల్సి ఉందని విచారణ పూర్తి అంటే కోర్టులో ఛార్జిషీటును కూడా దాఖలుచేయాలని, కొన్నికేసుల్లో దర్యాప్తు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని సివిసి అభిప్రాయపడింది.

1-9P□g7exHMNWJQE GN VJA_1-9P□g7exHMNWJQE.qxd 9/1/2025 12:23 AM Page 1



# 4 బిల్లులకు అసెంబ్లీ పచ్చజెండా

### మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణల బిల్లులకు ఆమోదం

### అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్,

### ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లులకు ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఆదివారం రెండోరోజు సమావేశమైన శాసనసభ నాలుగు బిల్లులను ఆమోదించింది. నాలుగు బిల్లులను ప్రవేశ పెట్టిన ప్రభుత్వం వాటిని ఆమోదింప చేసుకుంది. 4 బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లుకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లుకు, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. తొలుత మున్సిపల్ చట్టసవరణ బిల్లు, ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టి చర్చించి.. అనంతరం ఆ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

# దుష్ట రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్

### మోడీని రాజకీయంగా ఎదుర్కొనలేక

### ఆయన మాతృమూర్తిపై దూషణకు దిగిన కాంగ్రెస్

### అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి మహిళా నేతల ధర్నా

### బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై కాంగ్రెస్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నీచ ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాహుల్ గాంధీ వెంటనే ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, భారతీయ జనతా పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ దారుణ స్థాయికి దిగజారిందన్నారు. ప్రధాని మోడీ కన్న తల్లిపై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తమ అసలైన స్వభావాన్ని బయటపెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార యాత్ర సభలో, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు మోడీ తల్లిపై దుర్భాషలాడడం దేశ ప్రజల మనసును కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రాహుల్ గాంధీ మౌనంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. మోడీని ఎదుర్కొనే ధైర్యం లేక, ఆయన కుటుంబాన్ని, మాతృమూర్తిని దూషించడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుల బలహీనతను చూపిస్తున్నదని అన్నారు. ఓటు చోరీ యాత్ర కాదు - భారత్ ఇజ్జత్ చోరీ యాత్ర అన్నారు. మొన్న మహిళలపై దూషణలు చేస్తే, ఇప్పుడు మోడీ మాతృమూర్తిని అవమానపరిచారు.

## టిడిపి నేత కన్నెగంటి వెంకట్రావు మృతి

తెనాలిటౌన్, ఆగస్టు 31చ ప్రభాతవార్త: ఐతానగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కన్నెగంటి వెంకట్రావు(85)ఆదివారం



కన్నుమూశారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిననాటి నుంచి, పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. అయన గతంలో వైకుంఠపురం దేవస్థానం బోర్డు మెంబర్‌గా సేవలందించారు.అలాగే నేలపాడు గ్రామానికి కో అపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా పనిచేశారు. అయన మరణవార్త తెలుసుకున్న శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఐతానగర్ లోని ఆయన నివాసానికి వెళ్లి వెంకట్రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వెంకట్రావు పార్టీకి చేసిన సేవలుగురించి,అయన నిబద్ధత గురించి గుర్తుచేసుకున్నారు.ఆలపాటితో పాటు పలువురు పార్టీ నేతలు వెంకట్రావుకు నివాళి అర్పించారు.

## రోడ్డుప్రమాదంలో యువకుని మృతి

తెనాలిటౌన్, ఆగస్టు 31చ ప్రభాతవార్త: రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి చెందిన ఘటన పట్టణంలో ఆదివారం, స్థానిక కొత్తవంతెన వద్ద జరిగింది.



స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని మారీస్ పేట లోని,కాల్వకట్ట రోడ్డులో నివసించే అన్నపురెడ్డి పవన్(21),తన ద్విచక్ర వాహనంపై ఇంటినుండి వెళుతుండగా సమీపంలోని కొత్తవంతెన వద్ద బండి అదుపుతప్పి క్రిందపడిపోగా, ప్రమాదంలో డివైడర్ కు తల తగలటంతో అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ప్రమాదవిషయం తెలియగానే త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం,ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు.ఈ సంఘటనతో మృతుని కుటుంబంలో విషాదఛాయాలు నెలకొన్నాయి.

## వినాయకుని ఆరాధించిన పోలీసు గణం

జగ్గయ్యపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త :విధి నిర్వహణలో కఠిన తరంగా విధులు నిర్వర్తించే పోలీసులు సంప్రదాయ పండుగలు, వేడుకల్లో కుటుంబ సభ్యులను భాగస్వాములను చేస్తున్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వినాయక మండపం ఏర్పాటుచేసి మృత్తిగా గణపతి





విగ్రహాన్ని నెలకొల్పి నిత్యపూజలు కొనసాగిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు పోలీసులు కూడా వినాయకుని ఆరాధన చేస్తూనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఊరేగింపు, నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తిస్తూ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కర్తవ్యాలను అనుసరిస్తున్నారు. ఆదివారం నందిగామ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తిలక్ జగ్గయ్యపేటకు విచ్చేసి నిమజ్జనోత్సవాలను పరిశీలించారు. వేదాద్రి క్షేత్రంలో కృష్ణానదిలో ప్రత్యేక బల్లకట్టు ద్వారా కొనసాగుతున్న విగ్రహ నిమజ్జనాలను తనిఖీచేసి సిబ్బందిని అభినందించారు. కాగా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ఆదివారం సిఐ వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మున్సిపాల్టీల్లో ఫాగింగ్‌కు డబ్బులు లేవు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మున్సిపాల్టీలలో నిధుల లేమితో రోజువారీ ఖర్చులు కూడా నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాయని మున్సిపాల్టీలు చేయడం కాదు వాటికి నిధులు సిబ్బంది కూడా సమకూర్చాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి వద్దనే మున్సిపాలిటీ శాఖ ఉంది. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అయిందికానీ వాటికి మౌలిక వసతుల కల్పనలో వెనక్కి నెట్టివేశారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండే మున్సిపాల్టీలకు నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలు ఎన్ని ఏర్పాటు చేశామన్నది ముఖ్యం కాదు, ఎంత మేరకు అభివృద్ధి చేశాం అన్నది ముఖ్యం అని ఆయన అన్నారు నిధులు ఇస్తున్నారా లేదా? అనేది ఆలోచించాలి. ఫాగింగ్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి. బిఆర్‌ఎస్ హయాంలో నెల నెల పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు డబ్బులు ఇచ్చాం. ఈ ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వలేదు. ఎన్నికలు జరగలేదని ఫైనాన్స్ కమిషన్ డబ్బులు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తుంది రక్తమాంసాలు పీలుస్తుంది అంటూ ఊదరగొట్టి కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తాం నో ఎల్‌ఆర్‌ఎస్ నో బిఆర్‌ఎస్ అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇవాళ్నేమో బరాబర్ పైసలు కట్టాలని వసూలు చేస్తున్నారు. మరి అదే ప్రజలు నో ఎల్‌ఆర్‌ఎస్ నో కాంగ్రెస్ అనే పరిస్థితి వస్తుంది. ఎల్‌ఆర్‌ఎస్ జీవో తెచ్చాం.. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన డబ్బుల్లో కొంత మేర ఆ మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించడం జరుగుతుందని జీవోలో చెప్పాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వసూలు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులను మున్సిపాలిటీలకు ఎప్పటి వరకు అందజేస్తారో చెప్పాలి. వచ్చిన డబ్బు ఎంతనో చెప్పాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పట్టణ ప్రగతి కింద నిధులు ఇవ్వలేదు.. ఫైనాన్స్ కమిషన్ నుంచి డబ్బులు రావడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ నిధుల నుంచి డబ్బులు ఇవ్వడం లేదు. రాష్ట్ర నుంచి నయా పైసా లేదు. మరి ఎలా కొనసాగాలి మున్సిపాలిటీలు. ప్రజలు కట్టిన డబ్బును ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే డబ్బులను కూడా ఇవ్వడం లేదు. మరి మున్సిపాలిటీలు ఎలా నడవాలి..? పరిస్థితి ఏంటి అనేది ఆలోచించాలి. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేరు. కొత్త మున్సిపాలిటీలకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయండి. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్‌కు ఎస్డీఎఫ్ కింద రూ. 50 కోట్లు మంజూరు చేశారు. ఆ డబ్బులన్నీ మీరు రద్దు చేశారు. ఇదేం పద్ధతి అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

# మంత్రిమండలిలో 42శాతం కోటా అమలు పరచండి

### బిఆర్‌ఎస్ అంటే బహుజన రాష్ట్ర సమితి

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్రప్రభుత్వస్థాయిలో బిసిలకు సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం 42శాతం కోటాలో చేయాల్సిన రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యంగా మంత్రి మండలిలో, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవుల పందేరంలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఔశాసనసభలో బిసి బిల్లుపై చర్చ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు రావాలని మా పార్టీ కూడా కోరుకుంటుంది.18 జీవో తర్వాత హైకోర్టు ఏం చేసిందంటే, ఇందిరా సహాని ప్రకారం కమిషన్ వేయమని చెప్పింది. ఆ తర్వాత 46 జీవో తీసుకొచ్చింది. నేను బీఆర్‌ఎస్ పార్టీ తరపున మాట్లాడుతున్నా సూచనను విమర్శగా భావించకండి.బిఆర్‌ఎస్ అంటే అంటే భారత రాష్ట్ర సమితి కాదుబహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కొత్తగా నిర్వచనం ఇస్తూ మా సూచనను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వంను కోరారు

. బీహార్‌లో బిసి రిజర్వేషన్లు ఫెయిల్ అయినట్టు కావొద్దు అని అంటున్నాను. నిజంగా బిసి లపై చిత్తశుద్ధి ఉంటే కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1992 కింద మాత్రమే డెడికేటెడ్ కమిషన్ వేయాలి అని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.బిసి బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందంటున్నారు. షెడ్యూల్ 9లో బీసీ రిజర్వేషన్లు చేర్చాలి. కాబట్టి సవరణ చేయాలి. అలా చేయకపోతే కోర్టుల్లో ఈ బిల్లు నిలబడదు.

బీహార్, మధ్యప్రదేశ్‌లో కొట్టేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయితేనే 42 శాతం రిజర్వేషన్లకు ప్రొటెక్షన్ లభిస్తుంది. బిసిల మీద చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రకారం చేయండి. భూసాని వెంకటేశ్వర్ రిపోర్టును టేబుల్ చేయండి. బిసిలకు అన్యాయం జరగొద్దని శాస్త్రీయంగా చేయాలని కోరుతున్నా ను అని గంగుల కమలాకర్ పేర్కొ న్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది? ఇది సీఎం చేతు ల్లోనే ఉంది. 42 శాతం మంత్రి వర్గంలో కల్పి స్తామన్నారు. మంత్రివర్గంలో వెనుకబడిన తరగ తులకు అవకాశం కల్పిస్తే మేం సంతోషపడు తామని ఆయన అన్నారు

ప్రతి ఏడాది కూడా 20 వేల కోట్లు బిసిలకు బడ్జెట్ పెడుతామన్నారు. ఇప్పటివరకు 20 నెలలు కావొస్తున్నా 20 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు. దీనికి చట్టం అవసరం లేదు సిఎం తలచుకుంటే క్షణాల్లో అయిపోతది. ఎంబిసి కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెడుతా మన్నారు.. ఇవ్వండి. తెలంగాణలో ఏ వర్కు బిసి లకు ఇవ్వలేదు. బిసిల ఓట్లు గంపగుత్తగా ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చారు అని గంగుల కమలాకర్ మండిపడ్డారు.

# అమలుకాని ప్రధానమంత్రి ఫసల్ బీమా.. రైతులకు శాపం

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఫసల్ బీమా (పంటల బీమా)యోజనను తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అమలు చేయకపోవడమే రైతులకు శాపంగా మారిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. భారీ వర్షాలతో తీవ్రంగా రైతాంగం నష్టపోయిన కామారెడ్డి జిల్లాలో బిజెపి కిసాన్ మోర్చా, స్థానిక బిజెపి జిల్లా నాయకులతో కలిసి భిక్కనూరు మండలం రామేశ్వరపల్లి అంతంపల్లి లక్ష్మీ మదేవి పల్లిలో పర్యటించారు. వాగు ఉధృతికి ముంపుకు గురైన పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఇంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ నష్టాన్ని నమోదు చేయడానికి రాకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కొందరు రైతులు పొలాల్లో పూర్తిగా ఇసుక మేటలు వేసి సాగుకు పనికి రాకుండా పోయిందని శ్రీధర్ రెడ్డి సమక్షంలో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని గతంలో అనేక సందర్భాలలో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించి నాటి కెసిఆర్ లాగానే రేవంత్ ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా యోజనను తెలంగాణలో అమలు చేయకపోవడం రైతులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల బీమా యోజన అమలులో ఉంటే రైతు సహాయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి పరిహారం పొందే అవకాశం ఉండేదన్నారు. ఈ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ధ్వజమెత్తారు. వెంటనే యుద్ధ ప్రాతిపదిక మీద రైతులకు జరిగిన నష్టాన్ని రెవెన్యూ వ్యవసాయ అధికారులతో నమోదు చేయించి ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొలాలలో ఇసుకమేట వేసిన నేపథ్యంలో వెంటనే ఇసుకమేటను తొలగించడానికి రైతులకు సహాయ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలం రాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలతో వరదలతో రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు రాజకీయ ప్రకటనలకు పరిమితం కాకుండా రైతులను ఆదుకోవడానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసి కామారెడ్డికు స్పెషల్ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు రమేష్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి రాజు రవీందర్ గంగారెడ్డి పిచ్చయ్య లింగారెడ్డి సుధాకర్ రెడ్డి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం వద్ద సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించిన గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ

## సండేస్ అండ్ సైక్లింగ్ విస్తృతం చేయాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** పర్యావరణహితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన సండేస్ ఆన్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని జాతీయ ఫిట్‌నెస్ ఉద్యమంలా తెలంగాణలో నిర్వహించాలన్నారు. ఫిట్నెస్‌కి డోస్ అరగంట రోజ్ అన్న నినాదాన్ని విద్యార్థుల్లో యువకుల్లో ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం వల్ల సామాజిక బంధాలను బలపరుస్తాయన్నారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడా దినోత్సవం తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించి, దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడిందని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించే కార్యక్రమాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని, సైక్లింగ్ క్రీడను మరింతగా ప్రోత్సహించే కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేపడతామని అన్నారు.

## ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం మా కర్తవ్యం, బాధ్యత

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, భారతీయ జనతా పార్టీకి చెందిన తెలంగాణ రాష్ట్రంలోని ఆరుగురు ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు తమ ఎంపి నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున కేటాయించడం ద్వారా ప్రజల పక్షాన నిలబడ్డారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిన సందర్భంలో, బిజెపి ఎంపిలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం గమనార్హం అని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సహకారం అందించిన బిజెపి ఎంపిలు, కేంద్రమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బిజెపి ముందుండి తోడ్పడుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రజా హితం కోసం పనిచేస్తుంది. ప్రజల పక్షాన నిలబడేది బిజెపి మాత్రమే అన్నది మరోసారి రుజువైందన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం, సహాయక చర్యల్లో పాల్గొనడం భారతీయ జనతా పార్టీ కర్తవ్యబాధ్యత అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం మా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## బిసి వర్గాల జీవితాల్లో వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

### బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీ లకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమో దించిన నేపథ్యంలో మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరు తున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు అమలు చేసేం దుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, మంత్రివర్గానికి, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గేకు లోక్‌సభ ప్రధానప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి, సిఎం రేవంత్‌రెడ్డికి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఎఐసిసి రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్‌కు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాలవ్యాప్తంగా బాణాసంచాకాల్చి స్వీట్స్ పంచి సంబరాలుచేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్‌గౌడ్ కోరారు.

# తూతూమంత్రంగా అసెంబ్లీ సమావేశాలు

### బిసిల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

### బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ సమావేశాలను పక్కనపెట్టి సీఎం కేరళ పర్యటనకు వెళ్లడం.. వారికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడి యా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఏబిల్లులు పెడతారో స్పష్టత ఇవ్వలేదని రాష్ట్రంలో వరదలతో, యూరియా కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అసెంబ్లీ సమావేశాలను పట్టించుకోకుండా పుస్తక ఆవిష్కరణ కోసం ఫ్లైట్ బుక్ చేసుకొని మరి సీఎం కేరళకు వెళ్లారు అని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరద కారణంగా ఇబ్బంది పడుతున్నారని రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో మేమంతా అసెంబ్లీకి వచ్చామన్నారు. రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో హై కమాండ్‌కు భజన చేయడం, కుర్చీ కాపాడుకోవడం తప్పా రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. రాజకీయ కక్షతో పీసీ ఘోష్ రిపోర్ట్‌పై చర్చ పెట్టారని పీసీ ఘోష్ కమిషన్ కేవలం కాంగ్రెస్ కమిషన్ మాత్రమే అన్నారు. ఇంకా కొన్ని రోజులు సభ నడ పాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోవడం లేదని యూరియాపై చర్చ చేద్దామంటే స్పందన లేదని వివేకానంద పేర్కొన్నారు.

**కాళేశ్వరంపై కెసిఆర్ లక్ష కోట్లు దోచుకున్నాడు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



కెసిఆర్ కాలేశ్వరం ప్రాజెక్టును కామధేనువుగా వాడుకుని 30 వేల కోట్ల బడ్జెట్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి లక్ష కోట్లు దోచుకున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అవినీతి అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం ఎప్పుడో పోయిందన్నారు. కోర్టులో లంచు మోషన్ పిటిషన్ వేసి కాళేశ్వరంపై చర్చ జరగకుండా చేసే ప్రయత్నం చేశారని కమీషన్‌ను కూడా తప్పు పడుతు న్నారన్నారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారని తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే కేంద్రం అందుకు తగ్గట్టు ఇవ్వడం లేదన్నారు.

**కాళేశ్వరం భయంతోనే యూరియా నినాదం : కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతో బిఆర్‌ఎస్ యూరియా నినాదం ఎత్తుకుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇద్దరు ముగ్గురు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షలకోట్లు దోచుకుని తిన్నారన్నారు. ప్రాజెక్టు ఎస్టిమేషన్ ఎం? ఎంత వరకు తీసుకెళ్లారు. అనే విషయం వాస్తవాలు ప్రజలకు తెలువాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ కు చెందిన బాలు నాయక్ అనే రైతుకు యూరియా వచ్చినప్పటికీ బి.ఆర్.ఎస్ దొంగలు కావాలని రైతుతో పత్తిని చేను నుండి తీయించి ధర్నా చేయించారని మండిపడ్డారు.

**వరద బాధిత రైతులను ఆదుకోవాలి**

**బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఇటీవల కురిసిన వరదల కారణంగా రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్,మెదక్ జిల్లా లో రైతులకు వేలకోట్ల రూపాయల పంట నష్టం జరిగింది వేల ఇండ్లు నీట మునిగి 10 నుండి 15 మంది చనిపోవడం జరిగింది బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈమేరకు ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 70 నుండి 80 శాతం పంట పై పెట్టుబడి పెట్టిన రైతు పంట నీట మునిగిందన్నారు. కావున ప్రభుత్వం దగ్గరనుండి రైతుకు భరోసా ఇచ్చేటట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శాసన సభ సమావేశాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య అతివృష్టి వల్ల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని చెప్పామని ఆ పథకం తెస్తే రైతు భరోసాగా ఉంటాడన్నారు. బడ్జెట్లో 3000 కోట్లు పెట్టి చివరికి మూడు రూపాయిలు కూడా పంట బీమా ఇవ్వలేదుని మండిపడ్డారు. పంట బీమా లేని కారణంగా ప్రకృతి నష్టానికి రైతు నష్టపోయాడని పత్తికి ఎకరాకు 50 వేలు, సోయాబీన్‌కు 40వేలు, వరి పంటకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం, కందులకు 40 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రభుత్వం రైతు బీమా ప్రకటించాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో నష్టపోయిన రైతుల పక్షాన ఆందోళన చేస్తామని పాయల్‌శంకర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

**గోదావరి పరీవాహకాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయ్ : బిజెపి ఎమ్మెల్యేలు, రామారావుపటేల్, పాల్వాయి హరీశ్, సూర్యనారాయణ**

గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరదల వల్ల పంటల తీవ్రంగా దెబ్బ తిన్నాయని సోయా, పత్తి, వరి పంటలు



దెబ్బతిన్నాయని వెంటనే రైతులకి నష్టపరిహారం ఇవ్వాలని బిజెపి ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్, దన్‌పాల్ సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ రైతేరాజు అంటారు. ఇప్పుడు రైతును పట్టించుకోవడం లేదన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో తీవ్రంగానష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి రిజర్వేషన్‌లకి బీజేపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకిస్తుందన్నారు. 42 రిజర్వేషన్ బీసీ లకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 శాతం ముస్లిం లకి ఇస్తే వక్ బోర్డ్ ఆస్తులు హిందువులకి ఇస్తారా..అని ప్రశ్నించారు. కెసిఆర్ గతంలో పోడు రైతులని ఇబ్బందిపెట్టి.. శంకరగిరిమాన్యాలకి పోయిందని..కాంగ్రెస్‌కి అదే గతి పడుతుందని పేర్కొన్నారు.

### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌లో..

# నం.వన్ భారత్

## 50 స్వర్ణాలతో ముగిసిన టోర్నీ



**న్యూఢిల్లీ:** అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్ 50 బంగారు పతకాలతో ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025ను ముగించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు చారిత్రాత్మక అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసి 50 స్వర్ణాలతో అగ్రస్థానంలో నిలిచింది. రైఫిల్, పిస్టల్ మరియు షాట్‌గన్ విభాగాలలో జరిగిన 15 ఒలింపిక్ ఈవెంట్లలో సీనియర్ భారత్ షూటర్లు 6 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 8 స్వర్ణాలను గెలుచుకున్న ప్రపంచ పవర్‌హౌస్ చైనా కంటే వెనుకబడి, ఆతిథ్య కజకిస్తాన్ మరొకటి కైవసం చేసుకుంది. 100 పతకాల మార్కుకు కొద్ది దూరంలోనే భారత్ ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. 26 రజతాలు, 23 కాంస్యాలతో సహా 50 స్వర్ణాలతో. ఆతిథ్య జట్టు 70 పతకాలు, 21 స్వర్ణాలతో రెండవ స్థానంలో ఉండగా, చైనా 15 స్వర్ణాలు, 37 పతకాలతో మొత్తం మీద 3వ స్థానంలో ఉంది. సీనియర్ మహిళల ఎయిర్ రైఫిల్‌లో రెండుసార్లు ఒలింపియన్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా రికార్డు స్కోరుతో రెండవ ఆసియా కిరీటాన్ని (ఆమె మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ బాబుటాతో కలిసి డబుల్ స్వర్ణం గెలుచుకుంది). మహిళల ట్రాప్‌లో భారత్ తరపున నీరూ దండా తొలి స్వర్ణం, మహిళల 50 రైఫిల్ 3పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా తొలి ఆసియా టైటిల్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ పురుషుల టైటిల్ కైవసం, భారత్ జూనియర్ షూటర్లు కూడా అన్ని ఒలింపిక్ ఈవెంట్లలో పూర్తిగా ఆధిపత్యం చెలాయించడం ద్వారా దేశ ప్రతిభ ప్రదర్శించారు. ఒక్కొక్కరు 10 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ జోడీ ముందుకు

## బోపన్న ద్వయం నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ ముందుకు దూసుకుపోగా, బోపన్న-కాడే ద్వయం మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. న్యూయార్క్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ, అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ ఆధిపత్య విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లగా, రోహన్ బోపన్న-అర్జున్ కాదే తొలి రౌండ్‌లో పరాజయంతో నిష్క్రమించింది. 14వ సీడ్ గా బరిలోకి దిగిన భాంబ్రీ, వీనస్ జంట కేవలం గంట వ్యవధిలోనే అమెరికన్లు మార్కోస్ గిరోన్, లెర్నర్ టియన్ లను 6-0, 6-3 తేడాతో ఓడించారు. రెండో సెట్ ప్రారంభంలోనే బ్రేక్ చేసి మ్యాచ్‌ను ముగించారు. మొత్తం మూడు ఆటలను మాత్రమే కోల్పోయారు. ఇక మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోతో జతకట్టిన బోపన్న, అమెరికన్ ద్వయం రాబర్ట్ క్యాష్-జేమ్స్ ట్రేసీ చేతిలో 4-6, 3-6 తేడాతో ఓడిపోయాడు. దాదాపు 65 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో క్యాష్-ట్రేసీ కీలకమైన బ్రేక్ పాయింట్లను సద్వినియోగం చేసుకుని ఓటమిని చవిచూశారు. యుఎస్ ఓపెన్‌లో అరంగేట్రం చేసిన అర్జున్ కాడే, ఈక్వెడార్‌కు చెందిన డియెగో హిడాల్గోతో కలిసి రెండవ సీడ్ జంట మేట్ పావిక్-మార్సెలో అరెవాలోతో తలపడ్డారు. కాడే-హిడాల్గో మొదటి సెట్‌ను 7-5తో కైవసం చేసుకున్నా, చివరికి హోరాహోరీ పోరులో 7-5, 6-7(4), 36తో ఓడిపోయారు. దీంతో పురుషుల డబుల్స్‌లో భాంబ్రీ-వీనస్ మాత్రమే భారత్ తరపున టోర్నీలో కొనసాగుతున్నారు.

### ముక్కోణపు టి20లో..

# పాక్ రెండో విజయం

## 31 రన్స్ తేడాతో యుఎఇ చిత్తు

**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ అదరగొడుతోంది. ఈ ట్రైసిరీస్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌ను చిత్తు చేసిన పాకిస్థాన్ ఇప్పుడు రెండో మ్యాచ్‌లో యుఎఇ పై అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. షార్జాలో ఆదివారం



జరిగిన మ్యాచ్‌లో యూఏఈపై 31 పరుగుల తేడాతో మెన్ ఇన్ గ్రీన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో సైమ్ ఆయుబ్ (38 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69), హసన్ నవాజ్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 56) మెరుపు హాఫ్ సెంచరీలతో మెరిశారు. వారితో మహ్మద్ నవాజ్ (25), అష్రాఫ్ (16) రాణించారు. యూఏఈ బౌలర్లలో సిద్దుఖీ, నగీర్ ఖాన్ తలా 3 వికెట్లు పడగొట్టగా, హైదర్ అలీ 2 వికెట్లు సాధించాడు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. యూఏఈ బ్యాటర్ ఆసిఫ్ ఖాన్ (35 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 77) మెరుపు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ తన జట్టును గెలిపించుకోలేకపోయాడు. అతడితో మహ్మద్ వసీం (33) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో హసన్ అలీ 3 వికెట్లు పడగొట్టగా, నవాజ్ 2, మిర్జా, ఆయూబ్ ఒక్క వికెట్ సాధించారు.



# రాజస్థాన్ రాయల్స్‌లో అంతర్గత విభేదాలు

## మూడు గ్రూపులుగా టీం.. కెప్టెన్ రేసులో ముగ్గురు

**న్యూఢిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత గొడవలు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో రాజస్థాన్ పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. తాజాగా రాహుల్ ద్రవిడ్ రాజీనామా చేయడం దాని వెనుక ఈ విభేదాలే కారణాలు అని తెలుస్తోంది. జట్టు మూడు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూపు ఒక్కో ఆటగాడిని కెప్టెన్‌గా చేయాలని పట్టుదలతో ఉన్నాయి. ద్రావిడ్ కోచింగ్‌లో భారత టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచింది. దాని తర్వాత రాజస్థాన్ తమ మాజీకెప్టెన్ ద్రావిడ్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. కానీ ఒక సీజన్ తర్వాతే ఆయన జట్టు నుంచి తప్పుకున్నాడు. ద్రావిడ్‌కు మరో పోస్ట్ ఆఫర్ చేసినా ఆయన అంగీకరించలేదు. ఫ్రాంఛైజీ తీసుకుంటున్న నిర్ణయాలు ద్రావిడ్ ప్రణాళికలకు భిన్నంగా ఉండటం వల్ల ఆయన రాజీనామా చేశాడు. ఈ నేపథ్యంలో జట్టు 3గ్రూపులుగా విడిపోయింది. రాజస్థాన్ రాయల్స్‌లో ఒక గ్రూపు రియాన్ పరాగ్‌ను కెప్టెన్‌గా చేయాలనుకుంటోంది. పరాగ్ గతంలో సంజు శాంసన్ లేని సమయంలో, ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉన్నప్పుడు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 23 ఏళ్ల పరాగ్ 2019 నుంచి ఈ జట్టులో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 84 మ్యాచ్‌లలో 1566 పరుగులు చేశాడు. అలాగే మరో గ్రూప్ యశస్వి జైస్వాల్‌ను కెప్టెన్‌గా చేయాలని యత్నాలు చేస్తోంది. యశస్వి తన మొదటి సీజన్ నుంచే రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్నాడు. అతను 2020లో తొలిసారి ఈ జట్టు కోసం ఆడాడు. యువకుడైన జైస్వాల్ ప్రస్తుతం భారత జట్టులో కూడా ఉన్నాడు. ఆసియా కప్ జట్టులో అతను రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్నాడు. కాగా మూడో గ్రూపు సంజు శాంసన్ కెప్టెన్‌గా కొనసాగాలని కోరుకుంటోంది. కొన్ని రోజుల క్రితం, రాజస్థాన్ శాంసన్‌ను ట్రేడ్ డీల్ ద్వారా మార్చవచ్చని చర్చ జరిగింది. 30 ఏళ్ల సంజు శాంసన్ 2013లో రాజస్థాన్ రాయల్స్‌కు తొలిసారిగా ఆడాడు. ఆ తర్వాత 2015 వరకు ఈ జట్టులో ఉన్నాడు. 2016, 2017లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడి, 2018లో తిరిగి రాజస్థాన్‌కు వచ్చాడు. అప్పటి నుంచి ఈ జట్టులో కొనసాగుతూ ఇప్పుడు కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. ఐపీఎల్‌లో మొత్తం 177 మ్యాచ్‌లలో 4704 పరుగులు చేశాడు. సంజు ఆసియా కప్ 2025 జట్టులో కూడా ఉన్నాడు.

### మహిళల ఛాంపియన్‌షిప్..

# భారత్ ఓటమి

## 3-4 తేడాతో బంగ్లాదేశ్ విక్టరీ




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్-2025 చివరి పూల్ మ్యాచ్‌లో బాంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓటమి చెందింది. భూటాన్‌లోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ చివరి మ్యాచ్‌లో అత్యధిక స్కోరింగ్ థ్రిల్లర్‌లో బంగ్లాదేశ్ కొన్ని గోల్స్‌తో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో భారత్ మహిళా జట్టు తన ప్రచారాన్ని నిరాశాజనకంగా ముగించింది. ఈ ఓటమి చెందినప్పటికీ, యంగ్ టైగ్రెస్సెస్ ఛాంపియన్లుగా నిలిచారు. చేతిలో ఒక ఆట ఉండగానే పాయింట్ల పట్టికలో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించారు. యంగ్ టైగ్రెస్సెస్ 5 విజయాలు, ఒక ఓటమితో మహిళల ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. తొలి నిమిషంలోనే బంగ్లాదేశ్ తరపున పూర్ణిమ మర్మ గోల్ చేయగా, 9వ నిమిషంలో భారత క్రీడాకారిణి అనుష్క కుమారి గోల్ చేసి స్కోరును సమం చేసింది. అయితే, 34వ నిమిషంలో ఆల్పి అక్టర్ గోల్ చేయడంతో బంగ్లాదేశ్ తిరిగి ఆధిక్యాన్ని పొందింది. 48వ నిమిషంలో సౌరవి ప్రీతి దాన్ని పొడిగించింది. 65వ నిమిషంలో ప్రీతికా బర్మన్ చేసిన స్ట్రైక్‌తో భారత్ గోల్‌ను వెనక్కి తీసుకుంది. 89వ నిమిషంలో కెప్టెన్ జులన్ గోల్‌ను సమం చేసింది. ఇంజురీ టైమ్‌లో ప్రీతి మళ్ళీ గోల్ చేసి బంగ్లాదేశ్‌కు విజయాన్ని అందించింది. ఆట ప్రారంభమైన 30 సెకన్లలోనే పూర్ణిమ మర్మ ద్వారా బంగ్లాదేశ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దీనితో యంగ్ టైగ్రెస్సెస్ మొత్తం టోర్నమెంట్‌లో ఇచ్చిన తొలి గోల్‌గా నిలిచింది. క్లీన్ షీట్ పరంపర ముగిసింది.

# 77 యాప్‌లు ప్లేస్టోర్‌నుంచి తొలగింపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. ఈ యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని రివ్యూలను చదవాలని విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.



# భారత్‌లోకి మళ్లీ టిక్‌టాక్!

## నియామకాలకు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌లోనిషేధం ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్‌మీడియా యాప్ టిక్‌టాక్ తాజా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసింది. గురుగ్రామ్‌లోని తన ఆఫీస్‌లో 2 ఖాళీలను భర్తీచేయనున్నట్లు పోస్టుచేసింది. వీటిలో ఒకటి కంటెంట్ మోడరేటర్ బెంగాలీ మాట్లాడే అభ్యర్థి, మరొకటి మంచి భాగస్వామ్యం, కార్యకలాపాల నాయకత్వానికి సంబందించినపోస్టులు. ఈ క్రమంలో టిక్‌టాక్‌సేవలు మళ్లీ భారత్‌లో అందుబాటులోకి వస్తున్నట్లుప్రచారం జోరందుకుంది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌ను అనేకమందియాక్సెస్‌చేస్తున్నారు. అయితే దానిలోకి లాగిన్‌కావడం, విడియోలను చూడటం సాధ్యంకావడంలేదు. మరోవైపు కేంద్రం మాత్రం టిక్‌టాక్‌పై ఇప్పటికీ నిషేధం కొనసాగుతోందని స్పష్టంచేసింది. భారత్‌లో టిక్‌టాక్ సేవలను పునరుద్ధరించేందుకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న కూడా ఇలాంటి వార్తలను ప్రభుత్వం ఖండించింది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌లోసేవలు అందుబాటులో లేవని చూపించేది. ఇపుడు మాత్రం అబౌట్ ఆజ్‌పేజీ ఓపెన్ అవుతోంది. కానీవిడియోలు కనిపించడంలేదు. యాప్‌కూడా ఆండ్రాయిడ్‌ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్‌చేయడానికి అందుబాటులోలేదు. భారత్‌లో టిక్‌టాక్‌సేవలను మేం పునరుద్ధరించడంలేదని భారత సర్కార్ ఆదేశాలు పాటిస్తున్నట్లు టిక్‌టాక్‌ప్రతినిధి తెలిపారు. బీజింగ్ న్యూఢిల్లీ సంబంధాలు వేగంగా పునరుద్ధరణజరుగుతున్న వేళ ఈ నియామకాలప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే యాప్స్‌పైనా నిషేధం తొలగించవచ్చనే ప్రచారం యూజర్లమధ్య నలుగుతోంది.

# నేటినుంచి మారనున్న రూల్స్ ఇవిగో!

**ముంబయి, ఆగస్టు31:** ఆర్ధికసంవత్సరంలో సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. ఈనెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి. ఐటీ ఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. యూపీఎస్ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.




ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్లు పొందలేరు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది.

### కార్పొరేట్ విదేశీ వాణిజ్య

# రుణాల్లో భారీ పెరుగుదల




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** విదేశీ వాణిజ్య రుణాలపరంగా ఈ ఏడాది ఏప్రిల్‌జూన్‌త్రైమాసికంలో గణనీయంగా పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో 2.8 బిలియన్ డాలర్ల రుణం పొందితే ఈసారి ఇదేకాలంలో ఏకంగా 4.6 బిలియన్ డాలర్లకుపెరిగాయి. భారతీయ రిజర్వుబ్యాంకు ఈ డేటా వివరాలను విడుదలచేసింది. ఆగస్టు నెలవారీ బులిటెన్‌లో విదేశీ వాణిజ్యరుణాలకు రిజిస్ట్రేషన్లు మెరుగుపడుతున్నట్లు తెలిపింది. అయితే తొలిత్రైమాసికంలో రిజిస్ట్రేషన్‌లు మందగించాయి. గత ఏడాది 11.1 బిలియన్ డాలర్ల రుణాలకోసం దరఖాస్తులు వస్తే ఈ ఏడాది 9.1 బిలియన్ డాలర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు తెలిపింది. నికర రాబడులు రుణాలు పెరుగుతున్నా రిజిస్ట్రేషన్లలో స్వల్పంగా మందగమనం ఉన్నట్లు గుర్తించింది. ఐపిఒలు, విదేశీ వాణిజ్యరుణాలరూపంలో మూలధన వ్యయాలకోసం ముందు త్రైమాసికంతో పోలిస్తే కొంత తగ్గాయి. నెలవారీ ధోరణులు చూస్తే క్రమానుగతంగా జూన్‌లో కేవలం 0.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 1.2 బిలియన్ డాలర్లని ఆర్బీఐ తెలిపింది. ఇసిబి రిజిస్ట్రేషన్లపరంగా జూన్‌లో 3.5 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే మేనెలలో 2.7 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నట్లు తెలిపింది. ఇక విదేశీ వాణిజ్యరుణాలకోసం 113 రిజిస్ట్రేషన్లు జూన్‌లో వచ్చాయి. వీటి విలువలుమొత్తం 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 2.73 బిలియన్ డాలర్లకోసం 100 రిజిస్ట్రేషన్లురాగా జూన్2024లో 2.81 బిలియన్‌డాలర్ల విలువైన 125 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్బీఐ విశ్లేషించింది. ఉత్పత్తిరంగానిక ఇచెందిన కార్పొరేట్ సంస్థలు 954 మిలియన్ డాలర్లమేర జూన్‌లో దరఖాస్తులుచేసాయి. అదే గత ఏడాది జూన్‌లో 603 మిలియన్ డాలర్ల విలువైన రిజిస్ట్రేషన్లు మాత్రమే ఉన్నాయి. సేవలరంగంలో ఇసీబిలకోసం 19 మిలియన్ డాలర్ల దరఖాస్తులు వచ్చాయి. అదే గత ఏడాదిజూన్‌లో 37 మిలియన్ డాలర్లతోపోలిస్తే తగ్గాయి. ఇక ఎన్బీఎఫ్‌సిలు గత ఏడాది 1.31 బిలియన్ డాలర్లకు రిజిస్ట్రేషన్‌లు దాఖలుచేస్తే ఈసారి కేవలం 682 మిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఫిక్సెడ్ వడ్డీరేట్ల పరిధి శూన్యశాతంనుంచి 10.50శాతంవరకూ ఉన్నాయి. అదే గత ఏడాది జూన్‌లో జీరో నుంచి 11శాతం వరకూ ఉన్నట్లు వెల్లడించింది.

# రూ.17,200 కోట్లకు టాటా మెగా ఐపిఒ!

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** స్టాక్ మార్కెట్లలోకి మరో భారీ ఐపిఒ వస్తోంది. టాటా గ్రూప్‌లోని టాటాక్యాపిటల్ ఇపుడు తన తొలిపబ్లిక్ ఆఫరింగ్‌తో వస్తోంది. సెప్టెంబరు 22వ తేదీ రూ.17,200 కోట్ల విలువైన ఐపిఒను మార్కెట్‌కు తీసుకువస్తోంది. ఈ ఐపిఒద్వారా టాటా క్యాపిటల్‌కి దాదాపు 11 బిలియన్ డాలర్లు అంటే రూ.91 వేల కోట్లకుపైగా విలువలుపెరుగుతాయని అంచనాలున్నాయి. మొత్తం 47.58 కోట్ల షేర్లు అమ్మకానికి వస్తున్నాయి. వీటిలో 21కోట్ల షేర్లు కొత్తగా ఇష్యూ అవుతాయి. 26.58 కోట్ల షేర్లు ఆఫర్‌ఫర్‌సేల్ అంటే ఒఎఫ్ఎస్‌ద్వారా ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తారు. టాటాసన్స్ 23 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. ఐఎఫ్‌సి అంటే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ 3.58 కోట్లషేర్లు అమ్ముతోంది. ప్రస్తుతం టాటాసన్స్ టాటాక్యాపిటల్‌లో 88.6శాతం వాటాతో ఉంది. ఐఎఫ్‌సి వద్ద 1.8శాతం వాటాలున్నాయి. ఈ ఐపిఒద్వారా వచ్చే నిధులు మూలధన బేస్ పెంచేందుకు వినియోగిస్తామని తెలిపింది. జూన్‌లో హెచ్‌డిబి ఫైనాన్షియల్ 12,500 కోట్లకు ఐపిఒకు వచ్చింది. తొలిరోజు లిస్టింగ్‌లో బజాజ్‌హౌసింగ్ ఫైనాన్స్‌కూడా 135శాతం ప్రీమియంతో ముగిసింది. టాటా క్యాపిటల్‌మొత్తం రుణాలు రూ.2.26 లక్షలకోట్లకు చేరాయి. 2025లో సంస్థ లాభం 3646.6 కోట్లుగా ఉంది. 2023లో 3029.2కోట్లతో పోలిస్తే 10శాతం వార్షిక వృద్ధిని నమోదుచేసింది. స్థూల రానిబాకీలు 1.9శాతంతో తక్కువగానే ఉన్నాయి. నికర పారుబాకీలు 0.8శాతంమాత్రమే ఉన్నాయి. 2007లో వ్యాపారం ప్రారంభించిన టాటా క్యాపిటల్ ఇప్పటివరకూ 70 లక్షలమంది కస్టమర్లకు సేవలందించినట్లు వెల్లడించింది.

# పాస్‌వర్డ్‌లు వెంటనే మార్చుకోండి..

## 2 ఎస్వీ అమలుచేయండి..

### జిమెయిల్ కస్టమర్లకు గూగుల్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** జీమెయిల్ ఖాతాదారులకు గూగుల్ అత్యవసర హెచ్చరికలు జారీచేసింది. 2.5 బిలియన్ జిమెయిల్ ఖాతాదారుల పాస్‌వర్డ్‌లు ప్రమాదంలో ఉన్నాయని వెంటనే మార్చుకోవాలనిహెచ్చరించింది. సైబర్‌సెక్యూరిటీ బలోపేతంకావాలంటే వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలని అలాగే టూస్టెప్ వెరిఫికేషన్ అంటే టూఎస్వీని తప్పనిసరిగా వర్తింపచేసుకోవాలని సూచించింది. హ్యాకింగ్ కుట్రలు భారీగాపెరగడంతో కస్టమర్లు అప్రమత్తం కావాలని, హ్యాకింగ్ వెనక షైనీ హంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్లముఠా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. 2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈగ్రూప్‌పై ఇప్పటికే ఎటిఅండ్‌టి, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి సంస్థల డేటాలీక్ కేసుల్లోప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ హ్యాకర్లు ఫిషింగ్‌పద్ధతిని ప్రధాన ఆయుధంగా వాడుతున్నారని గూగుల్ తెలిపింది. నకిలీ ఇమెయిళ్లు పంపించి యూజర్లను వేరే లాగిన్‌పేజీలలోకి మళ్లించడం, సెక్యూరిటీ కోడ్‌లు సహా కీలక సమాచారాన్ని దోచుకోవడం వీరి ప్రధాన వ్యూహం. గూగుల్‌జూన్‌లోనే ఒక బ్లాగ్‌పోస్ట్‌లో షైనీ హంటర్స్‌గ్రూప్ డేటా లీక్‌సైట్‌ప్రారంభించడానికి సిద్ధమవుతోందని భావిస్తున్నట్లు గూగుల్ తెలిపింది సున్నితమైన సమాచారం దోపిడీ అవుతుందని గుర్తించాలని కోరింది. పాస్‌వర్డ్ మార్చుకోవడంతోపాటు 2ఎస్వీని వెంటనే అమలుచేసుకోవాలని సూచించింది. 2ఎస్వీ ప్రారంభిస్తే దొంగలు అకౌంట్‌లోకి చొరబాటుచేయలేరని అన్నారు. బ్రిటన్‌లోని యాక్షన్‌ఫ్రాడ్‌కూడా ఇమెయిళ్లు సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపింది. జిమెయిల్‌కే కాకుండా బ్యాంకింగ్, షాపింగ్, సోషల్‌మీడియా ఖాతాలన్నింటి సర్వీసుల్లోను 2ఎస్వీ ఆప్షన్ అందుబాటులో ఉంది. సెక్యూరిటీసెట్టింగ్స్‌లో టూఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌లేదా మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ పేరుతో అందుబాటులో ఉంటుందని గూగుల్ స్పష్టంచేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14